




సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:148 | హైదరాబాద్ 29 డిసెంబర్ 2025, సోమవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-148 | Hyderabad 29 December 2025, Monday | Pages: 8, Rs. 5/-









## సబ్ మెరైన్ లో...
# రాష్ట్రపతి సాహసం

**బెంగళూరు (ఏడీఎన్ఎన్) :**

భారత రాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతి ద్రౌపది ముర్ము ఆదివారం సరికొత్త చరిత్ర సృష్టించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక జలాంతర్గామి 'ఐఎన్ఎస్ వాగ్‌షీర్' లో ఆమె ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం వద్ద, పశ్చిమ తీరంలో సముద్ర గర్భంలో జరిగిన ఈ అరుదైన పర్యటన ద్వారా జలాంతర్గామిలో ప్రయాణించిన దేశ తొలి మహిళా రాష్ట్రపతిగా ఆమె రికార్డు నెలకొల్పారు. భారత రక్షణ చరిత్రలో ఒక రాష్ట్రపతి సబ్ మెరైన్‌లో ప్రయాణించడం ఇది రెండోసారి. గతంలో 2006లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 'ఐఎన్ఎస్ సింధురక్షక్'లో ప్రయాణించి ఈ సాహసం చేసిన తొలి వ్యక్తిగా నిలిచారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఇప్పుడు ద్రౌపది ముర్ము ఆ ఘనతను సాధించారు.

...::: తరువాయి 2వ పేజీలో..



## నేటి నుంచి తెలంగాణ
# అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి మొదటి వారం వరకు కొనసాగే ఈ సమావేశాలు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకోబోతున్నాయి. గత కొన్ని అసెంబ్లీ సమావేశాలకు అనారోగ్యం ఇతర కారణాలతో దూరంగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి సభకు హాజరు కానుండటం విశేషం. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు సభలో ఉండటంతో చర్చలు ఉత్కంఠభరితంగా సాగనున్నాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి నదీ జలాల హక్కుల రక్షణ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీటి కేటాయింపుల తగ్గింపుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ సిద్ధమైంది. అలాగే కాంగ్రెస్ రెండేళ్ల పాలన, రైతు రుణమాఫీ అమలులో లోపాలు, ఆరు గ్యారెంటీల హామీల వైఫల్యాలపై విపక్షాలు గళమెత్తనున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చలతో సభ వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.



## ఖనిజాన్వేషణ కోసం
# పాక్‌తో అమెరికా దోస్తీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పాకిస్తాన్ లో అరుదైన ఖనిజాల అన్వేషణకు అమెరికా తో సమష్టిగా కృషి చేసేందుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్-అమెరికా మధ్య వాణిజ్య, వ్యూహాత్మక సంబంధాలు వేగంగా బలపడుతున్నాయి. లోకోమోటివ్ రైళ్ల అమ్మకాలు, ఖనిజాల అన్వేషణ, డిజిటల్ సేవల విస్తరణ వంటి కీలక రంగాల్లో రెండు దేశాలు చెట్టాపట్టాలు వేసుకోనున్నాయి. ఖనిజ రంగంలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా కాంగ్రెస్ ద్వారా 135 బిలియన్ డాలర్ల నిధిని ఏర్పాటు చేయడం ఈ పరిణామాలకు బలం చేకూర్చుతోంది. అమెరికా ఎగ్జిమ్ బ్యాంక్ పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ రెకో డిక్ మైనింగ్ ప్రాజెక్టుకు 1.25 బిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేయడం గమనార్హం. పాకిస్తాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణకు సంబంధించి సంయుక్త ప్రణాళిక సిద్ధమైనట్లు పాక్ పత్రిక 'ఎక్స్ ప్రెస్ ట్రిబ్యూన్' వెల్లడించింది.

...::: తరువాయి 3వ పేజీలో..

## తైవాన్‌లో భూకంపం
# రిక్టర్ స్కేలుపై 7.0 నమోదు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

తైవాన్‌ను భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేలుపై 7.0 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం శనివారం అర్ధరాత్రి, యిలాన్ కౌంటీ హాల్‌కు తూర్పున 32 కిలోమీటర్ల దూరంలో సంభవించినట్టు తైవాన్ సెంట్రల్ వెదర్ అడ్మినిస్ట్రేషన్ (సీడబ్ల్యూఏ) అధికారులు తెలిపారు. సముద్రంలో 73 కిలోమీటర్ల లోతులో సంభవించిన ఈ భూకంపం, తైవాన్ చరిత్రలో మూడవ అరుదైన భూకంపంగా సీడబ్ల్యూఏ అధికారులు వెల్లడించారు. ఎలాంటి ప్రాణనష్టం లేదా భారీ ఆస్తి నష్టం జరిగినట్లు తమ దృష్టికి ఇప్పటివరకు రాలేదని అధికారులు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలు నివారించాలని సూచించారు. తైపీ, న్యూ తైపీ, తైచుంగ్, టాయోయువాన్, తైనాన్, హువాలియన్, యిలాన్, మియావోలీ, సించు వంటి నగరాలు భూకంప ప్రభావానికి ఎక్కువగా లోనయ్యాయని అధికారులు...

...::: తరువాయి 3వ పేజీలో..

ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం | నేటి భారతం ఎవరికీ తలవంచదు | ISSకు చేరిన తొలి భారతీయుడు శుభాన్షు శుక్లా పై పొగడ్తలు




నేటి భారతదేశం తన భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని, ఆత్మరక్షణ కోసం ఎలాంటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడదని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. భారత్ జైత్రయాత్ర ను ప్రపంచానికి చాటిచెప్పిన ఏడాదిగా 2025 నిలిచిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని 129వ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సాయుధ బలగాలు అత్యంత సాహసోపేతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ప్రతి భారతీయుడికి గర్వకారణమని ఆయన కొనియాడారు. సరిహద్దుల్లో శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ భారత సైన్యం చూపిన ఈ పరాక్రమం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో మనకున్న దృఢ సంకల్పాన్ని నిరూపించిందని ప్రధాని ప్రశంసించారు. 'వందేమాతరం' 150 ఏళ్ల వేడుకల సమయంలో కనిపించిన అదే జాతీయ భావం 'ఆపరేషన్ సిందూర్' సమయంలోనూ ప్రతిబింబించిందని ప్రధాని వివరించారు. భారత్ శాంతిని కాంక్షిస్తుందని, కానీ మన భద్రతకు భంగం కలిగించే శక్తుల విషయంలో మాత్రం రాజీ అనేదే ఉండదని ప్రధాని మోదీ ప్రపంచ దేశాలకు బలమైన సందేశాన్ని పంపారు.

> "భారతదేశానికి 2025 సంవత్సరం అనేక మైలురాళ్లను అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. జాతీయ భద్రత నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు, క్రీడల నుంచి సాంస్కృతిక వైభవం వరకు భారత్ ప్రతిచోటా తన బలమైన ముద్ర వేసిందని వివరించారు."

## దేశ భద్రతలో...
# తగ్గేదే లేదు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

సైన్స్ , అంతరిక్ష రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న మొదటి భారతీయుడిగా, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా నిలవడం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ప్రధాని అన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..



# అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకున్న సీఎం

**అయోధ్య (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం, అయోధ్యలోని బాల రాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు ఆలయ ప్రాంగణంలో గడిపిన ఆయన, రామాలయ అద్భుత నిర్మాణం భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ఆయన ఈ మొక్కు తీర్చుకున్నట్లు సమాచారం. ఈ ఆధ్యాత్మిక యాత్ర ముగించుకుని ఆయన నేరుగా గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగించుకుని వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి..

...::: తరువాయి 4వ పేజీలో..

# జమ్మూలో ఉగ్రవాదులు




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు ఆదివారం భారత నిఘా వర్గాలు పేర్కొనడంతో, బీఎస్ఎఫ్ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. జమ్మూలో మంచు కురుస్తుండడంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన, పాక్ ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో పాటు, కిష్త్వార్, దోడా జిల్లాల్లోని పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలను మోహరించారు.



# సిగాచీ సీఈవో అరెస్ట్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సిగాచీ పరిశ్రమ సీఈవో అమిత్ రాజ్ సిన్హాను సంగారెడ్డి పోలీసులు, శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. 54 మంది కార్మికుల మృతికి కారణమైన పాశమైలారం ప్లాంట్ పేలుడు ఘటన జరిగిన ఆరు నెలల తర్వాత ఈ అరెస్ట్ చోటు చేసుకోవడం గమనార్హం. ఈ ఏడాది జూన్ 30న జరిగిన ఈ ఘోర ప్రమాదంపై దర్యాప్తులో జాప్యం జరగడం, బాధ్యులను గుర్తించకపోవడంపై ఇటీవల తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కమిటీ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని కోర్టు మండిపడిన నేపథ్యంలో, పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. మరోవైపు తమకు రావాల్సిన పరిహారం అందలేదని బాధిత కుటుంబాలు ఇప్పటికీ ఆందోళన చేస్తున్నాయి.



## ఫిల్మ్ ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా
# దగ్గుబాటి సురేష్‌బాబు

ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానల్ హవా | ఉపాధ్యక్షులుగా నాగవంశీ, దామోదర్ ప్రసాద్

ట్రెజరర్‌గా ముత్యాల రాందాస్, జనరల్ సెక్రటరీగా అశోక్ కుమార్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల్లో నిర్మాత సురేష్‌బాబు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రోగ్రెసివ్ ప్యానెల్ మద్దతుతో ఆయన విజయం సాధించారు. ఫిలింనగర్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో మన ప్యానల్ పేరిట చిన్న నిర్మాతలు, ప్రోగ్రెసివ్ ప్యానల్ పేరుతో పెద్ద నిర్మాతలు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ తన బలాన్ని నిరూపించుకుంది. మొత్తం 48 మంది కార్యవర్గానికి జరిగిన ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 31, మన ప్యానెల్ నుంచి 17 మంది గెలుపొందారు. కార్యదర్శిగా అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగవంశీ, కోశాధికారిగా ముత్యాల రామదాసు, జాయింట్ సెక్రటరీలుగా మోహన్ వడ్లపట్ల, విజయేందర్ రెడ్డి గెలుపొందారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో మొత్తం 3,355 మంది సభ్యులున్నారు. ఛాంబర్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించనున్నారు.

...::: తరువాయి 5వ పేజీలో..

# హాదీ హంతకులు దేశంలోకి రాలేదు

బంగ్లాదేశ్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టిన బీఎస్ఎఫ్



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

బంగ్లాదేశ్ విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య కేసులో నిందితులు భారత్‌కు పారిపోయారంటూ వస్తున్న వార్తలలో వాస్తవం లేదని భారత సరిహద్దు భద్రతా దళం, మేఘాలయ పోలీసులు వివరణ ఇచ్చారు. ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు చేసిన ఈ ప్రకటనకు ఎలాంటి ఆధారాలు లేవని బీఎస్ఎఫ్ అధికారులు ఆదివారం స్పష్టం చేశారు. అంతర్జాతీయ సరిహద్దు నుంచి నిందితులు భారత్‌లోకి ప్రవేశించినట్లు తమ వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, సరిహద్దుల వద్ద భారత బలగాలు నిరంతరం నిఘా ఉంచుతాయని వెల్లడించారు. పొరుగు దేశం కావాలనే నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. మరోవైపు మేఘాలయ పోలీసులు కూడా బంగ్లాదేశ్ మీడియా ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఈ కేసులో నిందితులుగా భావిస్తున్న ఫైసల్ కరీం మసూద్, ఆలంగీర్ షేక్‌లు తమ రాష్ట్రంలోకి ప్రవేశించలేదని, ఈ కేసులో తాము ఎవరినీ అరెస్టు చేయలేదని స్పష్టం చేశారు. భారత్‌లో గందరగోళం సృష్టించేందుకు బంగ్లాదేశ్ మీడియా ఉద్దేశపూర్వకంగా కల్పిత కథనాలను అల్లుతోందని ఆరోపించారు.

87

# వందేళ్ల... ఆర్ఎస్ఎస్
## భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

### సమాజ కార్యానికి పునాది రాళ్లు: ఆర్ఎస్ఎస్ 'ప్రచారక్' వ్యవస్థ

ప్రపంచంలో మరెక్కడా లేని ఈ విశిష్ట వ్యవస్థ లోతుపాతులు



ప్రపంచ చరిత్రలో ఏ సంస్థనైనా నడిపించాలంటే రెండు విషయాలు అవసరం: ఒకటి ధనం (Money), రెండు మనుషులు (Manpower). సాధారణంగా మనుషులు జీతం కోసం పనిచేస్తారు, లేదా గుర్తింపు కోసం పనిచేస్తారు. కానీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) అనే ఈ మహా వటవృక్షం, సాధారణ నిర్వహణ సూత్రాలకు అతీతమైనది. దీనికి పెట్టుబడి కోట్లాది రూపాయలు కాదు.. దీని అసలు పెట్టుబడి... "త్యాగం". ఈ సంస్థ 1925లో నాగపూర్ లోని ఒక చిన్న గదిలో ప్రారంభమై, నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి గల ఏకైక కారణం... దాని వెనుక ఉన్న ఒక అద్భుతమైన మానవ వనరుల వ్యవస్థ. అదే "ప్రచారక్ వ్యవస్థ". దీనిని అర్థం చేసుకోవడానికి "యజ్ఞం" (Sacrificial Fire Ritual) కంటే గొప్ప ఉదాహరణ మరొకటి లేదు. యజ్ఞ గుండంలో అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. ఆ అగ్నిని ఆరిపోకుండా నిరంతరం మండించేది ఏది? నెయ్యి కాదు, బియ్యం కాదు. అది లోపల ఉండి, నిశ్శబ్దంగా కాలిపోయే ఎండిన కట్టె పుల్లలు. సంస్కృతంలో వాటిని "సమిధలు" అంటారు.

- **సమిధ లక్షణం:** అది మండుతూనే వెలుగునిస్తుంది. ఆ వేడిలో తన శరీరాన్ని (కాండాన్ని) పూర్తిగా కాల్చేసుకుంటుంది. చివరికి బూడిదగా మారుతుంది.
- **సమిధ స్వభావం:** అది ఎప్పుడూ "నేను మండాను కాబట్టే యజ్ఞం జరిగింది" అని బయటకు వచ్చి చెప్పుకోదు. యజ్ఞ ఫలాన్ని లోకానికి వదిలేసి, తాను మాత్రం అదృశ్యమైపోతుంది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్ సరిగ్గా అటువంటి వాడు.

...::: తరువాయి 2వ పేజీలో..



## డిప్యూటీ సీఎం విజ్ఞప్తిని
# తోసిపుచ్చిన టీటీడీ!

**తిరుపతి (ఏడీఎన్ఎన్) :**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి తీసుకున్న ఒక కీలక నిర్ణయం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ , అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన విజ్ఞప్తిని టీటీడీ సున్నితంగా తిరస్కరించింది. తిరుమల కొండపై కొత్తగా అతిథి గృహాల నిర్మాణానికి భూమి కేటాయించలేమని టీటీడీ స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది. పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల కోసం ప్రత్యేక అతిథి గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా భూమి కేటాయించాలని కోరుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి అనగాని సత్యప్రసాద్ టీటీడీకి లేఖలు రాశారు. ఈ నెల 16న జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించిన సభ్యులు, అంతిమంగా ఈ అభ్యర్థనను తోసిపుచ్చుతూ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల కొండపై ప్రస్తుతం భూమి లభ్యత ఏమాత్రం లేదని టీటీడీ స్పష్టం చేసింది. గతంలో హైకోర్టు విధించిన పరిమితులు,

...::: తరువాయి 4వ పేజీలో..



## మార్కెట్ క్యాప్‌లో
# 'వెండి' సునామీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ పెట్టుబడి మార్కెట్‌లో వెండి అసాధారణ రీతిలో దూసుకుపోతోంది. టెక్ దిగ్గజాలైన యాపిల్, ఆల్ఫాబెట్‌లను వెనక్కి నెట్టి అత్యంత విలువైన ఆస్తుల జాబితాలో మూడో స్థానానికి చేరడం ఇప్పుడు అంతర్జాతీయ వ్యాపార రంగంలో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం వెండి మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.220 ట్రిలియన్ డాలర్లకు పెరగడంతో, అది త్వరలోనే 4.592

...::: తరువాయి 7వ పేజీలో..



## ప్రభుత్వానికి అసెంబ్లీ
# నడిపే దమ్ముందా?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ ప్రభుత్వం సగటున కేవలం 20 రోజులు మాత్రమే శాసన సభ నడిపిందనని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సభ నడిపేందుకు ప్రభుత్వం జంకుతోందని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో స్నేహపూర్వక వాతావరణాన్ని కాంగ్రెస్ నాశనం చేసిందని హరీశ్‌రావు విమర్శలు చేశారు. మీడియాతో ఆదివారం మాట్లాడుతూ, ఆయన కాంగ్రెస్ పార్టీపై విరుచుకు పడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సగటున 32 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించామని హరీశ్ రావు గుర్తు చేశారు . ఈ సారి కనీసం 15 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు పూర్తిగా విఫలమయ్యారని, తాము ఇచ్చిన అజెండాను కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయినా, ఇప్పటివరకు అసెంబ్లీలో ఒక్క హౌస్ కమిటీ కూడా ఏర్పాటు చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
29.12.2025
www.manasarkar.com

# సమాజ కార్యానికి పునాది రాళ్లు: ఆర్ఎస్ఎస్ 'ప్రచారక్' వ్యవస్థ



మొదటిపేజీ తరువాయి...

ఆయనకు ఒకప్పుడు ఒక పేరు ఉంటుంది, ఒక కుటుంబం ఉంటుంది, మంచి భవిష్యత్తు ఉంటుంది. వాటన్నింటినీ ఒక సంచిలో మూటగట్టి పక్కన పెడతాడు.

- **జీతం లేని ఉద్యోగం:** ఇది 9 నుంచి 5 గంటల వరకు చేసే డ్యూటీ కాదు. ఇది 24 గంటల శ్వాస. దీనికి రూపాయి జీతం రాదు, కానీ జీవితాంతం పనిచేయాలి.
- **సెలవు లేని జీవితం:** ఆదివారం ఉండదు, పండుగ ఉండదు. దీపావళి నాడు అందరూ తమ ఇళ్లలో దీపాలు వెలిగిస్తుంటే, ప్రచారక్ మాత్రం ఎవరో కార్యకర్త ఇంట్లో కూర్చుని దేశం గురించి చర్చిస్తుంటాడు.
- **స్వంత ఇల్లు లేని ప్రయాణం:** ఈ రోజు ఈ ఊరు, రేపు మరో ఊరు. కార్యాలయపు గరుకు నేలలే పరుపులు. కార్యకర్త పెట్టే పచ్చడి మెతుకులే పంచభక్ష్య పరమాన్నాలు.

డాక్టర్ హెడ్గేవార్ ఈ వ్యవస్థను సృష్టించినప్పుడు ఆయన ఉద్దేశ్యం ఒక్కటే:
"దేశం కోసం చనిపోయే వారు చాలామంది ఉన్నారు. కానీ దేశం కోసం ప్రతిక్షణం జీవించేవారు కావాలి."
ఆ పిలుపును అందుకుని, తమ యవ్వనాన్ని, వృద్ధాప్యాన్ని, చివరి శ్వాసను "రాష్ట్ర కార్యం" అనే యజ్ఞంలో ఆహుతి చేసిన వేలాది మంది అజ్ఞాత సూర్యుల కథే ఈ ప్రచారక్ వ్యవస్థ.
వందేళ్ళ సంఘ్ ప్రస్థానంలో... మనకు వేదికల మీద మైకులు పట్టుకున్న నాయకులు మాత్రమే కనిపిస్తారు. కానీ ఆ వేదిక నిలబడటానికి కింద ఊపిరి బిగబట్టి మోస్తున్న పునాది రాళ్లు ఈ ప్రచారకులే. ఇందులో ఆ "సమిధల" త్యాగనిరతికి అక్షర నివాళి.

## ప్రచారక్ అంటే ఎవరు? – కాషాయం కట్టని సన్యాసి... యూనిఫామ్ లేని సైనికుడు

భారతీయ సనాతన ధర్మంలో "త్యాగం" కొత్త కాదు. వేల సంవత్సరాలుగా మనం ఋషులను, సన్యాసులను చూశాము. అలాగే దేశం కోసం ప్రాణాలిచ్చే సైనికులను చూశాము. కానీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ ఈ రెండు లక్షణాలను కలగలిపి సృష్టించిన ఒక అద్భుతమైన మానవ శిల్పమే "ప్రచారక్".
ప్రచారక్ అంటే ఒక వ్యక్తి కాదు, అదొక "తత్వశాస్త్రం". దీనిని మూడు కోణాల్లో లోతుగా అర్థం చేసుకోవచ్చు:

### 1. సామాజిక సన్యాసి (The Social Ascetic)

సాధారణంగా సన్యాసం తీసుకున్నవారు ఏం చేస్తారు? కాషాయ వస్త్రాలు ధరించి, సంసారాన్ని వదిలేసి, హిమాలయాలకో లేదా ఆశ్రమాలకో వెళ్లిపోతారు. వారి లక్ష్యం "స్వంత మోక్షం" (SelfSalvation).

- **ప్రచారక్ మార్గం:** ప్రచారక్ కూడా ఇల్లు వదిలేస్తాడు. పెళ్లి చేసుకోడు. ఆస్తిపాస్తులను త్యజిస్తాడు. కానీ, అతను అడవికి వెళ్ళడు.
- **జనారణ్యంలో తపస్సు:** అతను ఈ సమాజం (Society) అనే అడవిలోనే ఉంటాడు. మనుషుల మధ్యే తిరుగుతాడు.
- **లక్ష్యం:** అతని లక్ష్యం "స్వంత మోక్షం" కాదు, "రాష్ట్ర మోక్షం". ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను తొలగించడమే అతని తపస్సు. అందుకే ప్రచారక్‌ను "కాషాయం కట్టని సన్యాసి" (Ascetic in Civil Dress) అంటారు. అతను చూడటానికి సామాన్యుడిలా (Pants & Shirt/Kurta) ఉంటాడు, కానీ అతని ఆత్మ సన్యాసిది.

### 2. క్రమశిక్షణ కలిగిన సైనికుడు (The Disciplined Soldier)

మరోవైపు, ప్రచారక్ జీవితం ఒక సైనికుడిలా ఉంటుంది.

- **ఆదేశమే శిరోధార్యం:** సైన్యంలో కమాండర్ చెప్పింది ఎలా పాటిస్తారో, సంఘ్‌లో ప్రచారక్ కూడా అంతే.
  - o **ఉదాహరణకు:** నాగ్‌పూర్ నుంచి "నువ్వు రేపు ఉదయం అండమాన్ నికోబార్ వెళ్ళాలి" అని ఆదేశం వస్తే, "ఎందుకు? అక్కడ నాకు భాష రాదు కదా? ఉండటానికి ఇల్లు ఉందా?" అని అడగడు. మరుసటి రోజు రైలు ఎక్కుతాడు.
- **సదా సన్నద్ధం:** సైనికుడికి డ్యూటీ వేళలు ఉండవు. ఎప్పుడు యుద్ధం వస్తే అప్పుడు దూకాలి. ప్రచారక్ కూడా అంతే. అర్ధరాత్రి 2 గంటలకు కార్యకర్తకు కష్టం వస్తే, నిద్రలేచి వెళ్తాడు. అతని జీవితం 24x7 దేశానికి అంకితం. కానీ, సైనికుడికి యూనిఫామ్, తుపాకీ ఉంటాయి. ప్రచారక్ ఆయుధం కేవలం అతని "చిరునవ్వు" మరియు "సిద్ధాంతం".

### 3. బురదలో తామర (Lotus in the Mud)

ప్రచారక్ ఈ సమాజంలోనే ఉంటాడు కాబట్టి, ఆకర్షణలు (Distractions) చాలా ఉంటాయి.

- **కుటుంబ** ఆప్యాయతలు, డబ్బు, పదవులు, రాజకీయ అధికారం... ఇవన్నీ అతని చుట్టూ తిరుగుతాయి.
- **కానీ,** తామర పువ్వు నీటిలో ఉన్నా ఎలాగైతే తడవదో, ప్రచారక్ కూడా సమాజంలో ఉంటూనే దేనికీ అంటుకోకుండా (Detached Attachment) ఉంటాడు.
- **ఈ "నిర్మోహమాటం"** (Dispassion) అతనికి ఎలా వస్తుంది? కేవలం సంఘ్ శాఖలో నేర్చుకున్న సంస్కారం వల్ల, మరియు "భగధ్వజం" (కాషాయ జెండా) ముందు చేసిన ప్రతిజ్ఞ వల్ల వస్తుంది.

ఒక ప్రచారక్...
తల్లి ప్రేమను వదిలేసి, భరతమాత ప్రేమ కోసం పరితపిస్తాడు.
సొంత ఇంటిని వదిలేసి, దేశమంతటినీ తన ఇల్లుగా మార్చుకుంటాడు.
సొంత పిల్లలు లేకపోయినా, లక్షలాది మంది కార్యకర్తలకు "తండ్రి/అన్నయ్య" స్థానంలో నిలుస్తాడు.

అందుకే ప్రచారక్ వ్యవస్థ అనేది "సన్యాసి యొక్క త్యాగానికి, సైనికుడి యొక్క పోరాట పటిమకు" మధ్యస్థ రూపం.
ఇది ప్రపంచంలో మరే ఇతర సంస్థలోనూ కనిపించని ఒక అద్భుతమైన జీవన విధానం.

## ప్రచారక్ జీవనశైలి – ఒక సంచి, నిత్య ప్రయాణం: ఆధునిక సంచార ఋషులు

మనం ఒక ఊరి నుంచి మరో ఊరికి రెండు రోజులు ప్రయాణం చేయాలంటేనే రెండు సూట్ కేసులు సర్దుకుంటాం. కానీ, ఒక ప్రచారక్ 20 ఏళ్లు, 30 ఏళ్లు, లేదా జీవితాంతం ఇంటికి దూరంగా గడుపుతాడు. మరి అతని దగ్గర ఏముంటుంది? కేవలం ఒక "జోలె సంచి" (Shoulder Bag).

**ఈ జీవనశైలిని నాలుగు అద్భుతమైన కోణాల్లో దర్శించవచ్చు:**

### 1. అపరిగ్రహం - ఆస్తి లేని ఆనందం (The Joy of Non-Possession)

భారతీయ యోగ శాస్త్రంలో "అపరిగ్రహం" (దేనినీ కూడబెట్టుకోకపోవడం) అనేది ఒక గొప్ప గుణం. ప్రచారక్ దీనికి నిలువెత్తు రూపం.

- **ఆ సంచిలో ఏముంటాయి?:** రెండు లేదా మూడు జతల బట్టలు (సాధారణంగా తెల్ల చొక్కా, ఖాకీ లేదా బ్రౌన్ ప్యాంట్), ఒక తువ్వాలు, పళ్ళు తోముకునే సామాగ్రి, ఒక డైరీ, ఒక పెన్ను. అంతే.
- **సిద్ధాంతం:** "నాకు రేపు బదిలీ అయితే, నేను లారీని పిలిపించి సామాన్లు సర్దక్కర్లేదు. నా సంచి తీసుకుని బస్సెక్కాలి." ఈ "సంసిద్ధత" వారి జీవన విధానం.
- **వారి పేరు** మీద బ్యాంకు ఖాతాలు ఉండవు (కొత్త నిబంధనల ప్రకారం కనీస అవసరాల కోసం ఉన్నా, అందులో వ్యక్తిగత ధనం ఉండదు). వారి జేబులో ఉండే డబ్బు కూడా సంఘ పని కోసమే ఖర్చు అవుతుంది.

### 2. కార్యాలయమే నివాసం - కఠినమైన వసతి (Life in Karyalaya)

ప్రచారక్ ఎక్కడ ఉంటారు? వారికి ప్రత్యేక క్వార్టర్స్ ఉండవు.

- **సంఘ్ కార్యాలయం:** ప్రతి జిల్లా కేంద్రంలో ఉండే సంఘ్ కార్యాలయమే వారి ఇల్లు.
- **వసతులు:** అది ఫైవ్ స్టార్ హోటల్ కాదు. చాలా కార్యాలయాల్లో పడుకోవడానికి మంచాలు ఉండవు. నేల మీదే చాప వేసుకుని పడుకుంటారు.
- **ఉదయం** 4 గంటలకే నిద్రలేవాలి. అందరితో పాటు క్యూలో నిలబడి బాత్రూం వాడుకోవాలి. తమ బట్టలు తామే ఉతుక్కోవాలి. ఎంత పెద్ద అధికారి (ప్రాంత ప్రచారక్/క్షేత్ర ప్రచారక్) అయినా సరే, ఈ నియమాలు అందరికీ ఒక్కటే.
- **ఈ కఠినమైన** జీవనమే వారిని ఎటువంటి పరిస్థితుల్లోనైనా బ్రతకగలిగే "సర్వైవర్స్" (Survivors) గా మారుస్తుంది.

### 3. గృహ సంపర్కం - భోజనం ఒక నెపమే (Dining for Bonding)

ప్రచారక్ జీవితంలో "భోజనం" అనేది ఒక అద్భుతమైన సామాజిక ప్రక్రియ.

- **వారు** కార్యాలయాల్లో వండుకుని తినడం చాలా తక్కువ. వారు రోజుకో కార్యకర్త ఇంటికి భోజనానికి వెళ్తారు.
- **ఉద్దేశ్యం:** కేవలం కడుపు నింపుకోవడం కాదు. ఆ ఇంటికి వెళ్లడం ద్వారా, ఆ కుటుంబంలోని కష్టసుఖాలు తెలుస్తాయి. ఆ ఇంటి పిల్లలతో ఆడుకుంటారు, పెద్దవారితో మాట్లాడతారు.
- **ఫలితం:** కొన్నాళ్లకు ఆ ప్రచారక్ ఆ ఇంటికి ఒక సొంత మనిషి అయిపోతాడు. ఆ ఇంటి సభ్యులు "మా అబ్బాయి వచ్చాడు" అని ఎదురుచూసే బంధం ఏర్పడుతుంది.
- **"ఏది** పెడితే అది తినడం, ఎంత పెడితే అంత తినడం, రుచి గురించి మాట్లాడకపోవడం" అనేది ప్రచారక్ ధర్మం.

### 4. చక్రం తిరిగే బండి - నిత్య ప్రయాణీకుడు (The Eternal Traveller)

ప్రచారక్ జీవితం ఒక ప్రవహించే నది లాంటిది. ఒక చోట నిలకడగా ఉండదు.

- **బదిలీలు:** సాధారణంగా ప్రతి 3 ఏళ్లకు ఒకసారి ప్రచారక్‌కు స్థానచలనం (Transfer) ఉంటుంది.
  - o **అది** ఆంధ్రప్రదేశ్ నుంచి కేరళ కావచ్చు, లేదా ఢిల్లీ నుంచి ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు.
- **ప్రయాణ సాధనాలు:** వారు విమానాల్లో తిరగరు. రైలులో జనరల్ లేదా స్లీపర్ బోగీల్లో, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారు.
- **సమయ పాలన:** ఆ ప్రయాణంలో కూడా పక్కన కూర్చున్న వారితో దేశం గురించి మాట్లాడతారు. రైలు లేటైతే విసుగు చెందరు, ఆ సమయాన్ని పుస్తకం చదవడానికి వాడుకుంటారు.

ప్రచారక్ జీవనశైలిని ఒక్క ముక్కలో చెప్పాలంటే...
"తన కోసం కనిష్టంగా (Minimum), దేశం కోసం గరిష్టంగా (Maximum) జీవించడం."
స్వంత ఇల్లు లేకపోయినా... దేశంలోని ప్రతి కార్యకర్త ఇల్లు తనదే అనుకునే విశాల హృదయం వారిది.
ఆ ఒక్క సంచిలో... వారి బట్టలు మాత్రమే ఉండవు; ఈ దేశాన్ని మార్చగల గొప్ప సంకల్పం కూడా ఉంటుంది. అందుకే వారి ప్రయాణం 'నిత్యం', వారి లక్ష్యం 'సత్యం'.

**వ్యవస్థ నిర్మాణం - పునాది రాళ్లు:** అదృశ్యంగా ఉంటూ... సంస్థను నడిపించే 'సూత్రధారులు'

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ప్రపంచంలోనే ఒక ప్రత్యేకమైన మేనేజ్‌మెంట్ గురు (Management Guru). ఎందుకంటే, ఇక్కడ అధికారం (Power) ఉన్నవాడికి బాధ్యత ఉండదు; బాధ్యత (Responsibility) ఉన్నవాడికి అధికారం మీద ఆశ ఉండదు. ఈ విచిత్రమైన, కానీ విజయవంతమైన సూత్రానికి కేంద్ర బిందువు "ప్రచారక్".
సంఘ్ నిర్మాణంలో ప్రచారక్ పాత్రను "వెన్నెముక" (Backbone) అని ఎందుకు అంటారో నాలుగు సాంకేతిక మరియు వ్యూహాత్మక కోణాల్లో అర్థం చేసుకోవచ్చు:

### 1. అనుసంధానకర్త - 'సంవాద సేతువు'

సంఘ్ అనేది నాగ్ పూర్ (కేంద్రం) నుంచి మారుమూల పల్లెటూరి వరకు విస్తరించి ఉంది.

- **సమస్య:** నాగ్ పూర్ లో సర్ సంఘ్‌చాలక్ (మోహన్ భాగవత్) తీసుకున్న ఒక నిర్ణయం లేదా విధానం, క్షేత్ర స్థాయిలో ఉన్న సామాన్య కార్యకర్తకు ఎలా చేరాలి? అలాగే క్షేత్ర స్థాయిలోని కార్యకర్త అభిప్రాయం పైవాళ్లకు ఎలా తెలియాలి?
- **పరిష్కారం:** ఇక్కడే ప్రచారక్ పాత్ర కీలకం.
  - o **జిల్లా ప్రచారక్,** విభాగ ప్రచారక్, ప్రాంత ప్రచారక్... ఇలా ఒక గొలుసుకట్టు వ్యవస్థ ఉంటుంది.
  - o **వీరు** పోస్టుమాన్ లాగా కేవలం సమాచారాన్ని చేరవేయరు. ఆ సమాచారాన్ని విశ్లేషించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా (Localize) కార్యకర్తలకు వివరిస్తారు. వీరు సంస్థకు "నాడీ వ్యవస్థ" లాంటి వారు.

### 2. నాయకుల కర్మాగారం (The Factory of Leaders)

ప్రచారక్ యొక్క అతి ముఖ్యమైన పని "మనిషిని తయారు చేయడం" (Man Making).

- **స్వభావం:** ఒక ప్రచారక్ ఎప్పుడూ తాను మైక్ పట్టుకుని ఉపన్యాసం ఇవ్వాలని లేదా వేదిక మీద కూర్చోవాలని కోరుకోడు. అతను వెనుక ఉంటాడు (Backstage).
- **వ్యూహం:** శాఖకు వచ్చే యువకుల్లో ఎవరికి ఏ ప్రతిభ ఉందో గుర్తిస్తాడు.
  - o **ఒకడికి** మంచి వాక్చాతుర్యం ఉంటే, వాడిని వక్తగా మారుస్తాడు.
  - o **ఒకడికి** మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉంటే, వాడికి బాధ్యతలు ఇస్తాడు.
- **ఉదాహరణ:** అటల్ బిహారీ వాజ్‌పేయి, నరేంద్ర మోదీ, దీనదయాళ్ ఉపాధ్యాయ వంటి మహానాయకులు ఆకాశం నుంచి ఊడిపడలేదు. వారిని ఒక ప్రచారక్ గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చి, వారిని నాయకులుగా మలిచారు. అందుకే ప్రచారక్‌ను "మానవ శిల్పి" (Sculptor of Men) అంటారు.

### 3. సిద్ధాంత రక్షకుడు - 'సంఘటన మంత్రి' (Guardian of Ideology)

సంఘ్ పరివార్ చాలా పెద్దది. ఇందులో బీజేపీ (రాజకీయం), ఏబీవీపీ (విద్యార్థి), బిఎంఎస్ (కార్మిక), విహెచ్‌పి (మతం) వంటి 36కు పైగా సంస్థలు ఉన్నాయి.

- **ప్రమాదం:** ఈ సంస్థలు పెరిగేకొద్దీ, అధికారం లేదా ప్రజాదరణ వల్ల అవి దారి తప్పే ప్రమాదం ఉంది. సిద్ధాంతాన్ని మర్చిపోయే అవకాశం ఉంది.
- **రక్షణ:** దీన్ని అడ్డుకోవడానికి సంఘ్ తన ప్రచారకులను ఈ సంస్థలకు "సంఘటన మంత్రులుగా" (Organizing Secretaries) అరువు (Loan) ఇస్తుంది.
  - o **ఉదాహరణకు** బీజేపీలో అధ్యక్షుడి తర్వాత అత్యంత కీలకమైన పదవి "జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్)". ఈ పదవిలో ఎప్పుడూ ప్రచారకే ఉంటారు.
  - o **వీరు** ఎన్నికల్లో పోటీ చేయరు, టికెట్లు అడగరు. కానీ పార్టీ సిద్ధాంతం గీత దాటకుండా, క్రమశిక్షణ తప్పకుండా చూసే "అంకుశం" లాంటి వారు.

### 4. నిరంతర ప్రవాహం (Continuity & Stability)

సంఘ్‌లో రెండు రకాల కార్యకర్తలు ఉంటారు.

1. **గృహస్తులు:** వీరికి కుటుంబం, ఉద్యోగం ఉంటాయి. వీరు రోజులో కొంత సమయం మాత్రమే ఇవ్వగలరు.
2. **ప్రచారకులు:** వీరికి వేరే పనేమీ ఉండదు. 24 గంటలూ సంఘ్ పనే.

- **ఒకవేళ** గృహస్తులైన కార్యకర్తలు వ్యక్తిగత పనుల వల్ల బిజీ అయినా, సంస్థ పని ఆగిపోకుండా ప్రచారక్ చూసుకుంటాడు.
- **ప్రచారక్** ఒక "జనరేటర్" లాంటి వాడు. కరెంట్ (కార్యకర్తల ఉత్సాహం) పోయినప్పుడల్లా, తన శక్తితో సంస్థను నడిపిస్తాడు.

**ఈ వ్యవస్థ నిర్మాణం ఎంత పటిష్టమైనదంటే...**
వ్యక్తులు రావచ్చు, పోవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. కానీ సంస్థ మాత్రం చెక్కుచెదరదు.
ఎందుకంటే, ఆ సంస్థ గోడలు ఇటుకలతో కట్టినవి కావు; అవి ప్రచారక్ అనే "సిమెంట్" తో అతికించబడ్డాయి.
బయట ప్రపంచానికి కనిపించని, కానీ మొత్తం భారాన్ని మోసే ఆ పునాది రాయి... ప్రచారక్.

## భావోద్వేగ త్యాగం - కన్నీళ్లు కనిపించనివ్వరు: గుండెలో దాచుకున్న సముద్రం

బయట ప్రపంచం ప్రచారక్‌ను చూసినప్పుడు ఒక "ఉక్కు మనిషి" (Iron Man) అనుకుంటుంది. అతను ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు, ధైర్యం చెబుతూ ఉంటాడు, సమస్యలను పరిష్కరిస్తుంటాడు. కానీ, ఆ కాషాయపు నవ్వు వెనుక, ఎవరికీ కనిపించని ఒక తడి (Tears) ఉంటుంది.
ప్రచారక్ చేసే త్యాగాల్లోకెల్లా అత్యంత కఠినమైనది భౌతికమైనది కాదు (ఇల్లు, ఆస్తి వదలడం సులభమే), అది "భావోద్వేగ త్యాగం" (Emotional Sacrifice). దీనిని నాలుగు హృదయ విదారక కోణాల్లో దర్శించవచ్చు:

### 1. పేగు బంధాన్ని తెంచే కఠిన నిర్ణయం (Severing the Umbilical Cord)

ఒక యువకుడు ప్రచారక్‌గా వెళ్తున్నప్పుడు, అతని తల్లి పడే వేదన వర్ణనాతీతం. కానీ ఆ తల్లికి, ఆ కొడుకుకి మధ్య జరిగే ఆ మూగ సంభాషణే అసలైన త్యాగం.

- **ఆఖరి పిలుపు:** ఇంట్లో చెల్లెలి పెళ్లి జరుగుతుంటుంది. కానీ ప్రచారక్ ఏదో ఒక శిక్షణా శిబిరంలో (Camp) బాధ్యతలో ఉంటాడు. ఇంటి నుంచి ఫోన్ వస్తుంది. "నువ్వు రాకపోతే ఎలా?" అని అమ్మ అడుగుతుంది.
- **కఠిన సమాధానం:** "అమ్మా, అక్కడ పెళ్లికి నువ్వు, నాన్న, బంధువులు అందరూ ఉన్నారు. కానీ ఇక్కడ ఈ శిబిరంలో నేను లేకపోతే వందల మంది కార్యకర్తలకు ఇబ్బంది అవుతుంది. నా బాధ్యత ముఖ్యం" అని చెప్పి ఫోన్ పెట్టేస్తాడు.
- **ఫోన్ పెట్టేశాక,** ఒంటరిగా బాత్రూంలోకి వెళ్లి కన్నీళ్లు పెట్టుకుంటాడు. మళ్ళీ ముఖం కడుక్కుని, బయటకు వచ్చి కార్యకర్తలతో నవ్వుతూ మాట్లాడతాడు. ఈ "ద్వంద్వ జీవితం" (Dual Life of Emotions) అనుభవించడం అంత సులభం కాదు.

2. కన్నవారి కడచూపుకు నోచుకోని దురదృష్టం
ప్రచారక్ చరిత్రలో ఎన్నో విషాద ఘటనలు ఉన్నాయి.

- **తల్లిదండ్రులు** చనిపోయినప్పుడు, సంస్థ నియమాల ప్రకారం లేదా దూరం వల్ల చాలామంది ప్రచారకులు కనీసం అంత్యక్రియలకు కూడా వెళ్ళలేకపోయారు.
- **"నా కొడుకు** దేశం కోసం బతుకుతున్నాడు" అని ఆ తల్లిదండ్రులు గర్వపడినా, చివరి చూపు దక్కలేదనే బాధ ఆ ప్రచారక్ గుండెలో జీవితాంతం ఒక ముల్లులా గుచ్చుకుంటూనే ఉంటుంది.
- **కానీ,** ఆ బాధను దిగమింగుకుని, "దేశమే నా కుటుంబం" అని సరిపెట్టుకునే ఆ స్థితప్రజ్ఞత సామాన్యులకు సాధ్యం కాదు.

### 3. అందరివాడు... కానీ ఒంటరివాడు (Lonely in a Crowd)

ఇది చాలా విచిత్రమైన స్థితి. ప్రచారక్ చుట్టూ ఎప్పుడూ వందల మంది కార్యకర్తలు ఉంటారు.

- **కార్యకర్తలు** తమ కష్టాలు, ఆఫీసు గొడవలు, ఇంటి సమస్యలు అన్నీ ప్రచారక్‌తో చెప్పుకుంటారు. ఆయన అందరినీ ఓదారుస్తాడు.
- **కానీ...** ప్రచారక్ తనకు జ్వరం వస్తే ఎవరికి చెప్పుకుంటాడు? తనకు ఒంటరిగా అనిపిస్తే ఎవరి భుజం మీద తల వాల్చుతాడు?
- **నిశ్శబ్ద రోదన:** ఆయన తన బాధను ఎవరితోనూ పంచుకోలేడు. ఎందుకంటే, నాయకుడు బలహీనపడితే, కార్యకర్తలు ధైర్యం కోల్పోతారు. అందుకే, ఆయన తన కన్నీళ్లను కేవలం ఆ "భగధ్వజం" (కాషాయ జెండా) ముందు మాత్రమే కార్చుతాడు. ఆ జెండాయే అతనికి ఏకైక నేస్తం.

### 4. పండుగ లేని జీవితం (Life without Festivals)

దీపావళి, సంక్రాంతి, దసరా... పండుగ వస్తే చాలు హాస్టల్స్ లో ఉండే కుర్రాళ్లు కూడా ఇంటికి పరిగెడతారు.

- **కానీ ప్రచారక్?** ఆ రోజు కార్యాలయంలో ఒంటరిగా మిగిలిపోతాడు. లేదా ఎవరో కార్యకర్త "మా ఇంటికి రండి" అని పిలిస్తే వెళ్తాడు.
- **ఆ ఇంట్లో** అందరూ కొత్త బట్టలు వేసుకుని, బంధువులతో నవ్వుతుంటే... ప్రచారక్ పక్కన కూర్చుని నవ్వుతూ ఉంటాడు. కానీ అతని మనసులో చిన్నప్పుడు అమ్మ చేసిన వంట గుర్తుకురాదా? నాన్న ఇచ్చిన బహుమతి గుర్తుకురాదా?
- **వస్తుంది.** కానీ ఆ జ్ఞాపకాలను బలవంతంగా అణచివేసి, "సంఘ కార్యమే నా పండుగ" అని మనసును గట్టిచేసుకుంటాడు.

ప్రచారక్ కన్నీళ్లు బయటకు కనిపించవు. అవి లోపలే ఇంకిపోతాయి.
ఆ ఇంకిపోయిన కన్నీళ్లే... అతని వ్యక్తిత్వానికి "సిమెంట్" లా మారి, అతనిని వజ్రంలా (Diamond) గట్టిపరుస్తాయి.
అందుకే ప్రచారక్ త్యాగం అంటే కేవలం ఇల్లు వదిలేయడం కాదు;
"మనసులోని మమకారాన్ని చంపుకుని, ఆ ఖాళీ స్థానంలో భరతమాతను ప్రతిష్టించుకోవడం."
ఇది ఒక ఆత్మీయ ఆత్మహత్య (Emotional Suicide) మరియు ఒక దివ్యమైన పునర్జన్మ.

## చరిత్రలో నిలిచిన త్యాగధనులు – రక్తమాంసాలతో చరిత్ర రాసిన 'ఆధునిక దధీచులు'

పురాణాల్లో దధీచి మహర్షి లోక కళ్యాణం కోసం తన వెన్నెముకను ఆయుధంగా ఇచ్చాడని చదువుకున్నాం. ఆధునిక కాలంలో అటువంటి దధీచులు ఎవరైనా ఉన్నారా అంటే... నిస్సందేహంగా అది సంఘ్ ప్రచారకులే అని చెప్పవచ్చు.
కేవలం మాటలతో కాకుండా, తమ జీవితమే ఒక సందేశంగా (Life is the Message) బతికిన కొందరు దిగ్గజ ప్రచారకుల జీవితాలను ఉదాహరణగా తీసుకుందాం. ఇవి కేవలం వ్యక్తుల కథలు కాదు, ప్రచారక్ వ్యవస్థకు నిలువెత్తు సాక్ష్యాలు.

### 1. దంతోపంత్ ఠేంగ్డే - మేధావి... కానీ నిరుపేద (The Intellectual Saint)

భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS), స్వదేశీ జాగరణ్ మంచ్ వంటి భారీ సంస్థలను స్థాపించిన దంతోపంత్ ఠేంగ్డే గారు ఒక అద్భుతమైన ఉదాహరణ.

- **గొప్పతనం:** ఆయన తలుచుకుంటే కేంద్ర మంత్రి కాగలరు, లక్షల కోట్లు సంపాదించగలరు. కానీ ఆయన మరణించే నాటికి ఆయన జేబులో చిల్లిగవ్వ లేదు.
- **జీవనశైలి:** దేశవ్యాప్తంగా కార్మికులను ఏకం చేయడానికి ఆయన జనరల్ కంపార్ట్ మెంట్ లోనే ప్రయాణించేవారు. రైలు బాత్రూం పక్కన న్యూస్ పేపర్ వేసుకుని పడుకునేవారు.
- **"నేను** కార్మికుల నాయకుడిని, వారి కంటే విలాసంగా బతికే హక్కు నాకు లేదు" అని చెప్పిన ఆదర్శమూర్తి ఆయన.

### 2. నానాజీ దేశ్‌ముఖ్ - రాజయోగం వద్దు... సేవా యోగమే ముద్దు

ఈరోజు రాజకీయాల్లో ఒక చిన్న పదవి వస్తేనే ఎవరూ వదలరు. కానీ నానాజీ దేశ్‌ముఖ్, జనతా పార్టీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రి పదవిని (మొరార్జీ దేశాయ్ ఆఫర్ చేసినప్పుడు) తృణప్రాయంగా తిరస్కరించారు.

- **చిత్రకూట్ ప్రయోగం:** "నాకు అధికారం వద్దు, గ్రామాల సేవ ముఖ్యం" అని 60 ఏళ్ల వయసులో రాజకీయ సన్యాసం తీసుకున్నారు. చిత్రకూట్ అనే వెనుకబడిన ప్రాంతానికి వెళ్లి, అక్కడ విద్య, వైద్యం, వ్యవసాయం ద్వారా ఆ ప్రాంత రూపురేఖలను మార్చారు.
- **ఒక ప్రచారక్** రాజకీయాలకు అతీతంగా ఎలా ఉండాలో, అధికారాన్ని గడ్డిపోచలా ఎలా విసిరికొట్టాలో నానాజీ నిరూపించారు.

3. యాదవరావు జోషి దక్షిణాది భగీరథుడు
హిందీ రాని, సంఘ్ గురించి తెలియని దక్షిణ భారతంలో (ముఖ్యంగా కర్ణాటకలో) సంఘ్ విత్తనాలు నాటిన మహనీయుడు యాదవరావు జోషి.

- **కఠోర శ్రమ:** ఆయనకు భాష రాదు, ఉండటానికి చోటు లేదు. ఆలయాల మండపాల్లో పడుకునేవారు. కొబ్బరి చిప్పల్లో నీళ్లు తాగారు. కానీ, అలుపెరగని ప్రయాణంతో వేలాది మంది యువకులను సంఘ్ వైపు ఆకర్షించారు.
- **ఈరోజు** దక్షిణాదిలో సంఘ్ మరియు బీజేపీ ఇంత బలంగా ఉన్నాయంటే, ఆనాడు యాదవరావు జోషి వంటి ప్రచారకులు చిందించిన చెమట చుక్కలే కారణం.

### 4. డాక్టర్ హెడ్గేవార్ - ఆయనే ప్రథమ ప్రచారక్

అసలు ఈ వ్యవస్థకు ఆద్యుడు, సంఘ్ స్థాపకుడు డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్.

- **సర్వస్వం ధారపోసి:** సంఘ్ పని కోసం ఆయన తన ఇంటిని కూడా అమ్మేశారు. వైద్య వృత్తిని వదిలేశారు.
- **తీవ్రమైన** అనారోగ్యంతో ఉండి కూడా, డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నా వినకుండా, దేశమంతటా తిరిగి యువకులను చైతన్యపరిచారు. "నా శరీరంలో చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు దేశం కోసమే పని చేస్తా" అని శపథం చేసి, అలాగే మరణించారు.

### 5. అజ్ఞాత వీరులు - కేరళ బలిదానాలు

కేవలం పెద్ద నాయకులే కాదు, పేర్లు తెలియని వేలాది మంది సామాన్య ప్రచారకులు కూడా ఉన్నారు.

- **ముఖ్యంగా** కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో... ప్రత్యర్థి పార్టీల కత్తులకు బలైన ప్రచారకులు ఎందరో ఉన్నారు.
- **"రేపు** నేను బతికి ఉంటానో లేదో తెలియదు, కానీ ఈ రోజు శాఖ జరగాలి" అనే తెగువతో పనిచేసిన ఆ యువ ప్రచారకుల త్యాగం... ఈ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.

వీరంతా తమ కోసం బతకలేదు.
వారికి కూడా కోరికలు ఉండి ఉంటాయి. వారి తల్లిదండ్రులు కూడా "మా అబ్బాయి గొప్పవాడు కావాలి" అని కోరుకుని ఉంటారు.
కానీ, వారు "వ్యక్తిగత గొప్పతనం" కంటే "జాతీయ వైభవం" మిన్న అని భావించారు.
ఆ త్యాగధనుల ఫోటోలు గోడల మీద ఉండకపోవచ్చు, కానీ వారు వెలిగించిన దీపాలు నేడు కోట్లాది మంది హృదయాల్లో వెలుగుతున్నాయి.
ఆ వెలుగు పేరే... ప్రచారక్.

## ఆధునిక సవాళ్లు - మారుతున్న ప్రచారక్

నేటి కాలంలో ప్రచారక్ వ్యవస్థ కూడా మారుతోంది.

- **ఒకప్పుడు** కేవలం స్కూల్ డ్రాపౌట్స్ లేదా సాధారణ చదువు ఉన్నవారు ప్రచారకులుగా వచ్చేవారు.
- **ఇప్పుడు** ఐఐటీ, ఐఐఎం చదివిన గోల్డ్ మెడలిస్టులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ లక్షల జీతాలను వదిలేసి ప్రచారకులుగా (Fulltimers) వస్తున్నారు.
- **వీరు** టెక్నాలజీని వాడుతున్నారు, లాప్‌టాప్‌లతో పనిచేస్తున్నారు, కానీ "త్యాగం" అనే మూల సిద్ధాంతం మాత్రం మారలేదు.

## సమాజమే వారి కుటుంబం – రక్త సంబంధం కంటే గొప్పదైన 'ధర్మ సంబంధం'

ప్రపంచంలో ఏ మనిషైనా ఎందుకు కష్టపడతాడు? తన భార్య కోసం, తన పిల్లల కోసం, వారికి మంచి ఆస్తిని కూడబెట్టడం కోసం. ఇది సహజం.
కానీ, ప్రచారక్ ఎందుకు కష్టపడతాడు? ఆయనకు సంపాదించిన ఆస్తిని అనుభవించడానికి పిల్లలు లేరు. వృద్ధాప్యంలో సేవ చేయడానికి భార్య లేదు.

**మరి ఆయన్ను నడిపించే శక్తి ఏది?**
కేవలం ఒక్కటే... "ఈ సమాజం నాది, ఈ దేశం నాది" అనే మమకారం.
దీనిని నాలుగు లోతైన భావోద్వేగ కోణాల్లో (Emotional Dimensions) ఆవిష్కరించవచ్చు:

1. వసుధైక కుటుంబకమ్ సిద్ధాంతం కాదు, ఆచరణ
చాలామంది "వసుధైక కుటుంబకమ్" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అని ఉపన్యాసాలు ఇస్తారు. కానీ దానిని అక్షరాలా జీవించేది ప్రచారక్ మాత్రమే.

- **ఒక** ప్రచారక్ తన సొంత ఇంటి గడప దాటి బయటకు వచ్చినప్పుడు, అతనికి ఒక ఇల్లు పోతుంది. కానీ, లక్షలాది కార్యకర్తల ఇళ్లు స్వాగతం పలుకుతాయి.
- **కాశ్మీర్** నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు... ఏ ఇంటికి వెళ్ళినా అతనికి "అన్నయ్య" అనే పిలుపు, "కొడుకు" అనే ఆప్యాయత దొరుకుతుంది.
- **రక్త సంబంధం** (Blood Relation) కొన్ని జన్మలకే పరిమితం కావచ్చు. కానీ ప్రచారక్ ఈ సమాజంతో ఏర్పరుచుకునే "ధర్మ సంబంధం" (Ideological Bond) శాశ్వతమైనది.

### 2. వారసులు లేని వంశం కాదు... (Heirs of Ideology)

ప్రచారక్ చనిపోతే ఆయనకు తలకొరివి పెట్టడానికి సొంత కొడుకు ఉండకపోవచ్చు. కానీ, ఆయన తయారుచేసిన వేలాది మంది కార్యకర్తలు ఆయన సిద్ధాంతానికి వారసులుగా నిలుస్తారు.

- **నిజమైన సంపద:** ప్రచారక్ ఆస్తి బ్యాంకు బ్యాలెన్స్ కాదు. ఆయన తయారుచేసిన "మనుషులే" ఆయన ఆస్తి.
- **నరేంద్ర మోదీ** లాంటి ప్రధానమంత్రి అయినా, ఒక మారుమూల గ్రామంలోని సర్పంచ్ అయినా... వారిలో దేశభక్తి అనే విత్తనాన్ని నాటిన ఆ ప్రచారక్, వారి రూపంలో జీవించే ఉంటాడు.
- **భౌతికంగా** వారికి పిల్లలు లేకపోయినా, మానసికంగా వారు "లక్షలాది మందికి తండ్రి".

### 3. పునాది రాయి తత్వం (Philosophy of Foundation Stone)

ఒక గొప్ప కట్టడం (Building) అందంగా కనిపిస్తుంది. దాని గోడలు, రంగులు అందరినీ ఆకర్షిస్తాయి. కానీ ఆ కట్టడం నిలబడటానికి అసలు కారణం... భూమి లోపల, చీకటిలో, ఎవరికీ కనిపించకుండా, బరువును మోస్తున్న "పునాది రాళ్లు".

- **రాజకీయ** నాయకులు, మంత్రులు, సెలబ్రిటీలు ఆ కట్టడం పైన కనిపించే "గోపుర కలశాలు" లాంటి వారు.
- **కానీ** ప్రచారక్ ఆ "పునాది రాయి" లాంటి వాడు.
- **ఆయనకు** పేరు ప్రఖ్యాతులు అక్కర్లేదు. ఫోటోలు అక్కర్లేదు. "నా దేశం అనే భవనం నిలబడితే చాలు, నేను చీకటిలో ఉండిపోవడానికి సిద్ధం" అనేదే ఆయన తత్వం. ఈ "అజ్ఞాత త్యాగమే" సంఘ్ బలం.

### 4. నిశ్శబ్ద నిష్క్రమణ (Silent Exit)

ప్రచారక్ జీవితం ఎంత నిరాడంబరంగా మొదలవుతుందో, అంత్యక్రియలు కూడా అంతే నిరాడంబరంగా జరుగుతాయి.

- **ఆయన** మరణించినప్పుడు, ప్రభుత్వ లాంఛనాలు ఉండకపోవచ్చు. కానీ, ఆయన పార్థివ దేహం చుట్టూ చేరిన వేలాది మంది కళ్ళలో నీళ్లు ఉంటాయి.
- **ఆ కన్నీళ్లే** ఆయన సంపాదించిన నిజమైన పతకాలు (Medals).
- **"నమస్తే** సదా వత్సలే మాతృభూమే" (ఓ మాతృభూమీ! నీకు సదా నమస్కారం) అనే ప్రార్థనతో మొదలైన ఆయన జీవితం, అదే మాతృభూమి ఒడిలో ప్రశాంతంగా ముగుస్తుంది.

చివరి మాట:
వందేళ్ళ ఆర్ఎస్ఎస్ ప్రస్థానాన్ని చూసి ప్రపంచం ఆశ్చర్యపోవచ్చు.
దాని విస్తరణను చూసి రాజకీయ విశ్లేషకులు తలలు పట్టుకోవచ్చు.
కానీ దాని రహస్యం ఏ మేనేజ్‌మెంట్ పుస్తకాల్లోనూ దొరకదు.
అది... ఒక సంచి భుజాన వేసుకుని, చెప్పులు అరిగిపోయేలా నడుస్తూ, ఆకలిని దాచుకుని నవ్వుతూ, కార్యకర్త భుజం తట్టి "ధైర్యంగా ఉండు, నేనున్నాను" అని చెప్పే ఆ "ప్రచారక్" గుండెలో దొరుకుతుంది.
సమాజమే వారి కుటుంబం. దేశమే వారి దైవం. త్యాగమే వారి ఆయుధం.
ఆ అజ్ఞాత ఋషులకు, ఆధునిక దధీచులకు ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.
జై భారత్!

**ఒక సంచి భుజాన వేసుకుని, చెప్పులు అరిగిపోయేలా నడుస్తూ, ఆకలిని దాచుకుని నవ్వుతూ, కార్యకర్త భుజం తట్టి "ధైర్యంగా ఉండు, నేనున్నాను" అని చెప్పే ఆ "ప్రచారక్" గుండెలో దొరుకుతుంది. సమాజమే వారి కుటుంబం. దేశమే వారి దైవం. త్యాగమే వారి ఆయుధం.**

రచన: భూక్యా గోపినాయక్

# రాష్ట్రపతి సాహసం

మొదటిపేజీ తరువాయి...

నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి సమక్షంలో జరిగిన ఈ పర్యటనలో రాష్ట్రపతి జలాంతర్గామి పనితీరును, లోపల ఉండే సాంకేతికతను స్వయంగా పరిశీలించారు. సముద్రం అడుగున ఉండే క్లిష్ట పరిస్థితుల్లో శత్రువుల కంట పడకుండా మన నావికాదళం ఎలా విధులు నిర్వర్తిస్తుందో ఆమె అడిగి తెలుసుకున్నారు. 'కల్వరి' తరగతికి చెందిన ఈ అత్యాధునిక జలాంతర్గామిలో సిబ్బంది సామర్థ్యాన్ని చూసి ఆమె ముగ్ధులయ్యారు. దేశ రక్షణ కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సైనికులకు తన పర్యటన ద్వారా గొప్ప స్ఫూర్తిని నింపారు. ఆసియాలోనే అతిపెద్ద నౌకాదళ స్థావరాల్లో ఒకటిగా ఉన్న కార్వార్ బేస్ వద్ద జరిగిన ఈ పర్యటన, హిందూ మహాసముద్రంలో భారత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో అత్యంత వ్యూహాత్మకమైనదిగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# దేశ భద్రతలో...తగ్గేదే లేదు

మొదటి పేజీ తరువాయి...

దీనితో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ భారత్ ముందంజలో ఉందన్న ప్రధాని, దేశంలో చిరుతల సంఖ్య 30 దాటడం వన్యప్రాణుల సంరక్షణలో మన నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. భారతీయ సంస్కృతి, విశ్వాసం 2025లో ప్రపంచాన్ని ఆకర్షించాయని ప్రధాని అన్నారు. ఏడాది ప్రారంభంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిస్తే.. ఏడాది చివరలో అయోధ్య రామమందిరంలో జెండా ఎగురవేత కార్యక్రమం ప్రతి భారతీయుడి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిందని పేర్కొన్నారు. ప్రజలు 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తుల పట్ల చూపించిన ఉత్సాహం స్వదేశీ మార్కెట్‌కు కొత్త జవజీవాలను ఇచ్చిందని ప్రశంసించారు. సమస్యలను పరిష్కరించడంలో భారత యువత చూపుతున్న చొరవను మోదీ అభినందించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో భాగంగా విద్యార్థులు 80 శాఖలకు చెందిన 270 సమస్యలపై పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా మణిపూర్‌కు చెందిన మోయిరంగ్థెమ్ సేథ్ అనే యువకుడు తన మారుమూల గ్రామంలోని విద్యుత్ సమస్యను 'సౌర శక్తి'తో పరిష్కరించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అలాగే దుబాయ్‌లో నివసిస్తున్న కన్నడ కుటుంబాలు తమ పిల్లల కోసం 'కన్నడ పాఠశాల'ను ప్రారంభించి మాతృభాషను కాపాడుకుంటున్న తీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒడిశాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, గిరిజన సంక్షేమ నేత పార్వతి గిరి శతజయంతి ఉత్సవాలను జనవరి 2026లో జరుపుకోనున్నట్లు ప్రధాని వెల్లడించారు.

# చందమామపై మకాం..
# అమెరికా వ్యూహం



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
చంద్రునిపై శాశ్వత స్థావరం కోసం అంతరిక్షంలో అమెరికా వ్యూహం రచిస్తోంది. అంతరిక్ష ప్రయోగాల్లో తిరుగులేని ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతో అమెరికా మరో అడుగు ముందుకేసింది. చంద్రునిపై శాశ్వత స్థావరం నిర్మించేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుతో అంతరిక్షంలో అమెరికా ప్రభావాన్ని మరింత పెంచుకోవాలని నాసా భావిస్తోంది. ఇది కేవలం కొన్ని మిషన్లు లేదా తాత్కాలిక ప్రయాణాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక కార్యకలాపాలకు నాంది పలకనుంది. నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మాన్ ఈ ప్రాజెక్ట్‌ను అమెరికా అంతరిక్ష విధానంలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. భవిష్యత్తులో వ్యూహాత్మక ప్రయోజనాలు సాధించడానికి, అంతరిక్ష కార్యకలాపాలకు దిశానిర్దేశం చేయడానికి చంద్రునిపై స్థావరం అవసరమని ఆయన స్పష్టం చేశారు. 'మేం చంద్రునిపై ఒక స్థావరాన్ని నిర్మిస్తాం. అంతరిక్షంలో అమెరికా నాయకత్వమే మా మొదటి ప్రాధాన్యత' అని సీఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ప్రణాళికలో చంద్రుడిపైకి వెళ్లి రావడం మాత్రమే కాదు, మానవులు దీర్ఘకాలం పాటు అక్కడే ఉండి కార్యకలాపాలు నిర్వహించేలా మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా ఉంది. సైన్స్, వాణిజ్యం, భద్రత రంగాల్లో కొత్త అవకాశాలను తెరపైకి తీసుకురావడమే లక్ష్యంగా నాసా అడుగులు వేస్తోంది. చంద్రుడిపై నిరంతర ఉనికికి మద్దతుగా అణుశక్తి సాంకేతికతపై భారీగా పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. చంద్రునిపై శాశ్వత స్థావరం ఏర్పాటుతో ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ ఆవిష్కరణలకు ఊతం లభిస్తుందని నాసా యోచిస్తోంది. శాశ్వత మౌలిక సదుపాయాలు పరిశోధన వేగాన్ని పెంచుతాయని ఐజాక్‌మాన్ తెలిపారు. చంద్రుని కక్ష్యలో ఆర్థిక వ్యవస్థను విస్తరించడం కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలక అంశం. కొత్త వ్యవస్థల ద్వారా వాణిజ్య ప్రాజెక్టులు, పరిశోధన కార్యకలాపాలకు అవకాశాలు పెరుగుతాయని అంచనా. ఈ స్థావరం ద్వారా ఉద్యోగాల సృష్టి, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం పెరుగుతాయని, అతీతమైన మార్కెట్లకు దారి తెరుచుకుంటుందని నాసా విశ్వసిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ అంతరిక్ష విధానానికి అనుగుణంగానే ఉన్నాయని, వాటిని అమలు చేస్తామని ఐజాక్‌మాన్ స్పష్టం చేశారు.

# బంకర్‌లో దాక్కో..
# పాక్ అధ్యక్షుడు వ్యాఖ్యలు



- ❖ ఆపరేషన్ సిందూర్‌తో వణికిపోయిన పాకిస్తాన్
- ❖ బంకర్‌లో వెళ్లాలని దేశాధ్యక్షుడికి సూచన
- ❖ 8 నెలల తర్వాత బయటపెట్టిన అసిఫ్ అలీ జర్దారీ

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో తనను బంకర్‌లో దాక్కోమని సైనికాధికారి సలహా ఇచ్చినట్టు పాకిస్తాన్ దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ స్వయంగా వెల్లడించారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కానీ , నాయకులు బంకర్‌లో మరణించరని, అవసరమైతే యుద్ధభూమిలో వీరమరణం పొందుతానని..' సైనికాధికారికి తెలిపినట్లు జర్దారి వ్యాఖ్యానించారు. యుద్ధ వస్తుందని తనకు నాలుగు రోజుల ముందే తెలుసని ఆయన చెప్పారు.ఇదిలాఉండగా, జర్దారీ వ్యాఖ్యలపై భారత సైన్యం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ స్పందిస్తూ , యావత్ పాక్ నాయకత్వం, సైన్యం బంకర్లలో దాక్కున్నాయని తెలిపారు. 'భారత్ దాడి సమయంలో అసిమ్ మునీర్ సైతం బంకర్‌లోకి వెళ్లిపోయాడు. పాక్ రాజకీయ నాయకత్వం, సైనిక కమాండర్లు బంకర్లలో తలదాచుకున్నారని , కేవలం సైనికులు మాత్రమే పోరాటం చేసి ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. ఆయన (జర్దారీ) అబద్ధాలు చెబుతున్నాడని ధిల్లాన్ తెలిపారు. ఒకవేళ నాలుగు రోజులు ముందే తెలిస్తే తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తే ఒక్క క్షిపణిని కూడా అడ్డుకోలేకపోయారు ఎందుకు' అని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ ఏఎన్ఐతో పేర్కొన్నారు.



# హమాస్ నిరాయుధీకరణపై
# అమెరికాకు షాక్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
గాజా పరిస్థితులపై అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలపై పాకిస్తాన్ ఒక తిరకాసు పెట్టింది. గాజాలో ఏర్పాటు చేయనున్న ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో భాగంగా తమ దళాలను పంపేందుకు పాక్ సానుకూలంగా స్పందించినప్పటికీ, ఒక ముఖ్యమైన షరతును ముందుంచింది. అమెరికా ప్రతిపాదించిన 20 అంశాల ప్రణాళికలో హమాస్‌ను నిరాయుధీకరించాలన్న అంశాన్ని తొలగిస్తేనే తాము ఐఎస్ఎఫ్‌లో భాగమవుతామని పాకిస్తాన్ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని పాక్ ఉపప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. ఐఎస్ఎఫ్‌లో భాగస్వామ్యం కావడం తమకు అత్యంత సున్నితమైన అంశమని ఆయన పేర్కొన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ శాంతి పరిరక్షణ దళంగానే వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. "మమ్మల్ని శాంతి నెలకొల్పే చర్యలు లేదా హమాస్ నిరాయుధీకరణలో భాగం చేయకుండా, కేవలం శాంతిని కాపాడే బాధ్యతకే పరిమితం చేస్తేనే ఐఎస్ఎఫ్‌లో సంతోషంగా భాగం అవుతాం" అని ఆయన తెలిపారు. శాంతి పరిరక్షణలో తమ పాత్ర చాలా పరిమితంగానే ఉంటుందన్నారు.అమెరికా ప్రతిపాదిత శాంతి ప్రణాళిక రెండో దశలో హమాస్‌ను నిరాయుధీకరించడమే ప్రధాన అంశంగా ఉంది. గాజాలో దీర్ఘకాలిక శాంతి స్థాపనకు ఇదే కీలక దశగా అమెరికా భావిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ షరతులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, గాజాకు బలగాలు పంపేందుకు పాకిస్తాన్ ముందుకు వచ్చిందని వెల్లడించారు. పాకిస్తాన్‌తో పాటు మరికొన్ని దేశాలు కూడా ఐఎస్ఎఫ్‌లో భాగం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణను కొనసాగించడంలో ఈ అంతర్జాతీయ బలగాలు కీలక పాత్ర పోషిస్తాయని ట్రంప్ కార్యవర్గం విశ్వసిస్తోంది.

# సోమాలిలాండ్ పై అంతర్జాతీయ వివాదం?



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
సోమాలిలాండ్‌ను స్వతంత్ర దేశంగా ఇజ్రాయెల్ అధికారికంగా గుర్తించడం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నిర్ణయంతో ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల నుంచి వ్యతిరేక స్వరాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు ఏ దేశం కూడా అధికారికంగా గుర్తించని సోమాలిలాండ్‌కు ఇజ్రాయెల్ తొలి దేశంగా ముందుకు రావడం, ప్రపంచ రాజకీయ సమీకరణాల్లో కొత్త వివాదాలకు దారితీస్తోంది. సౌదీ అరేబియా, ఈజిప్ట్, అమెరికా సహా అనేక దేశాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి.ఈ వివాదం మూలాలు 1990వ దశకానికి వెళ్లాలి. అప్పట్లో సోమాలియా తీవ్ర అంతర్యుద్ధంతో అట్టుడుకింది. 1991లో సోమాలియా ప్రభుత్వం కూలిపోవడంతో, దేశ ఉత్తర భాగంలో ఉన్న ఒక ప్రాంతం స్వతంత్ర దేశంగా 'సోమాలిలాండ్' పేరుతో స్వయంప్రతిపత్తిని ప్రకటించుకుంది. అప్పటి నుంచి అంతర్జాతీయ గుర్తింపు కోసం నిరంతరం ప్రయత్నిస్తోంది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు అబ్దిరహ్మాన్ మొహమ్మద్ అబ్దిల్లాహి, ఈ గుర్తింపునే తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇప్పటివరకు సోమాలిలాండ్‌ను దేశంగా గుర్తించిన తొలి దేశం ఇజ్రాయెల్. అయితే ఈ నిర్ణయాన్ని అమెరికా బహిరంగంగా తోసిపుచ్చింది. ఆఫ్రికన్ యూనియన్ కూడా తీవ్రంగా స్పందించింది. ఈ చర్య ఆఫ్రికా ఖండంలో అస్థిరతకు దారి తీస్తుందని హెచ్చరించింది. సోమాలియా ప్రభుత్వం అయితే మరింత ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది తమ సార్వభౌమాధికారంపై 'ఉద్దేశపూర్వక దాడి'గా అభివర్ణించింది.ఇజ్రాయెల్ నిర్ణయంపై ఆఫ్రికన్ యూనియన్ స్పష్టమైన వైఖరి తీసుకుంది. సోమాలిలాండ్ అనేది సోమాలియాలో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. ఈ గుర్తింపు వేర్పాటువాద ఉద్యమాలకు ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతుందని హెచ్చరించింది. అయితే సోమాలిలాండ్ మాత్రం దీనిని 'చారిత్రక విజయం'గా అభివర్ణించింది.సోమాలిలాండ్ 1991 నుంచి వాస్తవంగా దేశంవలె పనిచేస్తోంది. సొంతంగా ఎన్నికైన ప్రభుత్వం, పార్లమెంట్, పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. సోమాలిలాండ్ షిల్లింగ్ అనే ప్రత్యేక కరెన్సీని ప్రవేశపెట్టింది. పాస్‌పోర్టులు, జాతీయ గుర్తింపు పత్రాలను జారీ చేస్తోంది. పన్నుల వసూళ్లు, ప్రభుత్వ ఖర్చులు పూర్తిగా స్వతంత్రంగా నిర్వహిస్తోంది. బెర్బెరా వంటి కీలక ఓడరేవుల ద్వారా వాణిజ్యాన్ని నియంత్రిస్తోంది. గల్ఫ్ ఆఫ్ ఆడెన్‌లో ఉన్న ఈ ఓడరేవు విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, ప్రజాసేవలను సోమాలిలాండ్ ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తోంది. ప్రజలు మొగదిషులోని సోమాలియా ఫెడరల్ ప్రభుత్వంపై కాకుండా, తమ స్థానిక సంస్థలపైనే ఆధారపడుతున్నారు. ఇతర సోమాలియా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ శాంతియుత వాతావరణం నెలకొని ఉంది. మూడు దశాబ్దాలకు పైగా సోమాలిలాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించలేదు. ఇందుకు ప్రధాన కారణం అంతర్జాతీయ సూత్రాలే. స్వాతంత్ర్యం సమయంలో ఏర్పడిన సరిహద్దులను ఒప్పందం లేకుండా మార్చకూడదనే నిబంధనను చాలా దేశాలు పాటిస్తున్నాయి. ఒక విడిపోయిన ప్రాంతాన్ని గుర్తిస్తే, ఇతర ప్రాంతాల్లోనూ వేర్పాటువాద ఉద్యమాలు చెలరేగి అస్థిరత పెరుగుతుందనే భయం ఉంది.ఐక్యరాజ్య సమితి, ఆఫ్రికన్ యూనియన్, అనేక దేశాలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సోమాలియా డిమాండ్ చేస్తోంది. దౌత్యపరమైన మార్గాల్లో ఈ గుర్తింపును సవాలు చేస్తామని ప్రకటించింది.పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలతో పాటు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్‌కు చెందిన 20కి పైగా దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ గుర్తింపును ఆఫ్రికా హార్న్ భద్రతకు ముప్పుగా అభివర్ణించాయి. ఇది అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఖతార్, కువైట్, ఇరాక్, జోర్డాన్ వంటి దేశాలు పేర్కొన్నాయి. ప్రాంతీయ కూటములు కూడా ఈ చర్యను ఖండించాయి.అమెరికా మాత్రం ఇజ్రాయెల్ మార్గాన్ని అనుసరించబోమని స్పష్టం చేసింది. సోమాలియా ప్రాదేశిక సమగ్రతకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపింది. డొనాల్డ్ ట్రంప్ కూడా ఇజ్రాయెల్ నిర్ణయాన్ని సమర్థించలేదు.ఇదిలా ఉండగా, సోమాలిలాండ్ అధ్యక్షుడు అబ్దిరహ్మాన్ మొహమ్మద్ అబ్దిల్లాహి ఇజ్రాయెల్ నిర్ణయాన్ని ఘనంగా స్వాగతించారు. ఇది తమ పోరాటానికి దక్కిన చారిత్రక గుర్తింపని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ఆరంభమని తెలిపారు. ఇజ్రాయెల్ బాటలోనే మరిన్ని దేశాలు ముందుకు వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# దిగ్గజ సీఈవోలకు చెక్ ..అగ్రస్థానంలో ఉల్లాల్



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
టెక్ రంగంలో భారత సంతతి మహిళ అగ్రస్థానంలో జయశ్రీ ఉల్లాల్ నంబర్‌వన్ గా నిలిచారు. ప్రపంచ టెక్ రంగంలో భారత సంతతికి చెందిన సీఈవోలంటే ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. గత కొన్నేళ్లుగా అత్యంత సంపన్న భారత సంతతి టెక్ ఎగ్జిక్యూటివ్‌లుగా వీరిద్దరూ కొనసాగుతున్నారు. తాజా నివేదికలు ఈ సమీకరణాన్ని పూర్తిగా మార్చేశాయి. అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈవో జయశ్రీ ఉల్లాల్ ఈ ఇద్దరినీ వెనక్కి నెట్టి అగ్రస్థానంలో దూసుకుపోతున్నారు. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం, టెక్ సీఈవోల జాబితాలో జయశ్రీ ఉల్లాల్ అత్యంత సంపన్నురాలిగా మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. ఆమె నికర విలువ రూ.50,170 కోట్లుగా అంచనా వేశారు. రెండో స్థానంలో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల రూ.9,770 కోట్ల నికర విలువతో నిలిచారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ రూ.5,810 కోట్ల నికర విలువతో ఏడో స్థానంతో సరిపెట్టుకున్నారు.1961 మార్చి 27న లండన్‌లో జన్మించిన జయశ్రీ ఉల్లాల్ భారత సంతతికి చెందిన హిందూ కుటుంబానికి చెందారు. ఐదేళ్ల వయసులో ఆమె కుటుంబం భారత్‌కు తిరిగి వచ్చింది. ఆమె తండ్రి ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తగా పనిచేశారు. ఐఐటీల ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించినట్లు నివేదికలు చెబుతున్నాయి. జయశ్రీ న్యూఢిల్లీలోని కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత కుటుంబం శాన్‌ఫ్రాన్సిస్కోకు వలస వెళ్లడంతో అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేశారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు.తొలిదశలో 15 ఎళ్లుగా సిస్కో, పలు సంస్థల్లో పనిచేసిన జయశ్రీ, 2008 నుంచి అరిస్టా నెట్‌వర్క్స్‌లో కీలక బాధ్యతలు చేపట్టారు. ఆమె నాయకత్వంలో సంస్థ వేగంగా వృద్ధి చెందింది. ఫోర్బ్స్ కథనం ప్రకారం, 2024లో కంపెనీ ఆదాయం 7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 20 శాతం అధికం. కంపెనీ స్టాక్‌లో జయశ్రీకి దాదాపు 3 శాతం వాటా ఉంది. ఈ విజయాలే ఆమెను ప్రపంచ టెక్ రంగంలో అత్యంత సంపన్న సీఈవోగా జయశ్రీ ఉల్లాల్ ని నిలబెట్టాయి.

# బంగ్లా దాడులను ఖండించాలి : రో ఖన్నా



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా పేర్కొన్నారు. ఇటీవలి ఘటనల్లో భాగంగా, ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలపై దీపూ చంద్రదాస్ అనే యువ వస్త్ర కార్మికుడిని మూక దాడి చేసి హత్య చేయడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి విద్వేషపూరిత, మతతత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచం తన గొంతుకను వినిపించాలని ఎక్స్ వేదికగా రో ఖన్నా పిలుపునిచ్చారు. దీపూ చంద్రదాస్ హత్య అత్యంత భయంకరమైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ద్వేషం, మత అసహనంతో జరిగే ఇలాంటి నీచమైన చర్యలను కచ్చితంగా ఖండించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మానవ హక్కులు, మత స్వేచ్ఛకు భంగం కలిగించే ఘటనలపై అంతర్జాతీయ సమాజం మౌనం వీడాలని ఆయన వ్యాఖ్యానించారు. బాధిత వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై అమెరికా విదేశాంగ శాఖ కూడా స్పందించింది. దీపూ చంద్రదాస్ హత్యను ఖండించిన అమెరికా, బంగ్లాదేశ్‌లోని అన్ని వర్గాల భద్రతకు ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు వెల్లడించింది. మత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛలకు అమెరికా మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేసింది. అయితే, యువ నాయకుడు ఇంక్విలాబ్ మంచ్ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల మధ్యే దీపూ చంద్రదాస్ హత్య జరగడం కలకలం రేగింది. ఈ ఘటన మరచిపోకముందే అమృత్ మొండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూక దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. వరుస హత్యలతో దేశంలో భద్రతా పరిస్థితులపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ పరిణామాలపై భారత్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మైనారిటీల భద్రత, శాంతి భద్రతలు కాపాడేలా బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కెనడా ప్రభుత్వ వైద్యతీరుపై మస్క్ మండిపాటు

- ❖ కెనడాలో భారత సంతతి వ్యక్తి మృతి
- ❖ ప్రభుత్వ వైద్యంపై ఎలాన్ మస్క్ ఘాటు వ్యాఖ్యలు
- ❖ వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భర్త చనిపోయాడని భార్య ఆరోపణ
- ❖ ప్రభుత్వమే బాధ్యత వహించాలని భారత్ డిమాండ్
- ❖ మృతికి గల కారణాలపై విచారిస్తున్న కెనడా పోలీసులు



**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
కెనడాలోని ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై టెస్లా సీఈవో, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత సంతతికి చెందిన 44 ఏళ్ల ప్రశాంత్ శ్రీకుమార్ , ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వైద్యం కోసం ఎనిమిది గంటలకు పైగా వేచి చూసి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మస్క్ స్పందించారు. ప్రభుత్వాలు అందించే వైద్య సేవల డొల్లతనంపై ఈ ఘటనే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కెనడాలోని ఎడ్మంటన్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ శ్రీకుమార్‌కు డిసెంబర్ 22న తీవ్రమైన ఛాతీ నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే గ్రే నన్స్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మధ్యాహ్నం 12:20 గంటలకు చేర్చగా, ఈసీజీ తీసి, నొప్పి తగ్గడానికి టైలనాల్ మాత్రలు ఇచ్చి, చికిత్స కోసం వేచి ఉండమని వైద్య సిబ్బంది తెలిపారు. అయితే, 8 గంటల పాటు నొప్పితో బాధపడుతున్న ఆయనకు, రాత్రి 8 గంటల తర్వాత చికిత్స నిమిత్తం పిలవగానే కుప్పకూలిపోయారు. గుండెపోటుతో ఆయన మరణించినట్లు వైద్యులు చెప్పారు. ఈ ఘటనపై ఎలాన్ మస్క్ తన 'ఎక్స్' లో స్పందించారు. "ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తే, అది డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్ (డీఎంవీ) ఆఫీసులో లభించే సేవల మాదిరిగానే ఉంటుంది" అని మండిపడ్డారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వ్యవస్థల్లో ఉండే జాప్యం, నిర్లక్ష్యాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు, ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిపై పలు ఆరోపణలు చేశారు. "సకాలంలో వైద్యం అందించకుండా నా భర్తను ఆసుపత్రి సిబ్బందే చంపేశారు. మేము కెనడా పౌరులుగా ఎన్నో పన్నులు కట్టామని , ఒక్కసారి వైద్య సహాయం అవసరమైతే, ఇలా చంపేస్తారా అంటూ " అని ప్రశాంత్ భార్య నిహారిక ఆవేదన చెందారు. ఇదిలాఉండగా , "నాన్నా, నేను నొప్పి భరించలేకపోతున్నా" అని తన కుమారుడు కడసారి చెప్పిన మాటలను ప్రశాంత్ తండ్రి కుమార్ శ్రీకుమార్ గుర్తుచేసుకుని బోరున కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ సైతం స్పందించింది. ప్రశాంత్ శ్రీకుమార్ భారత సంతతికి చెందినప్పటికీ, కెనడా పౌరుడని, అతని మృతికి కెనడా ప్రభుత్వమే బాధ్యత వహించాలని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై అల్బెర్టా చీఫ్ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించింది. ఆసుపత్రిని నడుపుతున్న 'కొవెనెంట్ హెల్త్' సంస్థ కూడా ఈ ఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు వెల్లడించింది.



# ప్రపంచ వైద్య రంగం..
# అద్భుత ఆవిష్కరణలు

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**
ప్రపంచ వైద్య ఆరోగ్య రంగ చరిత్రలో 2025 సంవత్సరం మలుపుగా నిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోగ నిర్ధారణ నుంచి జన్యు సవరణ చికిత్సల వరకు, టెలిమెడిసిన్ నుంచి స్మార్ట్ హాస్పిటళ్ల వరకు అనేక అద్భుత ఆవిష్కరణలు ఈ ఏడాది వైద్య సేవల స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాయి. గూగుల్, ఫిలిప్స్ వంటి టెక్ దిగ్గజాలు, మెడ్‌ట్రానిక్ వంటి వైద్య సాంకేతిక సంస్థలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనా కేంద్రాల కృషితో ఈ వైద్య విప్లవం సాధ్యమైంది. 2025 నాటికి వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా రేడియాలజీలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల విశ్లేషణను ఏఐ వేగవంతం చేసింది. రాయల్ ఫిలిప్స్ అభివృద్ధి చేసిన ఆధునిక స్కానింగ్ వ్యవస్థలు దాదాపు 80 శాతం ప్రక్రియలను ఆటోమేట్ చేసి, వైద్యుల పనిభారాన్ని తగ్గిస్తున్నాయి. సీమెన్స్ హెల్తీనీర్స్ రూపొందించిన 'ఆప్టిక్ ఏఐ' టెక్నాలజీ తక్కువ రేడియేషన్‌తోనే అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తోంది. స్ట్రోక్ కేసులను వెంటనే గుర్తించే 'రాపిడ్‌ఏఐ' సాఫ్ట్‌వేర్‌లు ప్రాణాలను కాపాడుతున్నాయి. అబాట్ సంస్థ ప్రవేశపెట్టిన పోర్టబుల్ రక్తపరీక్ష పరికరం కేవలం 15 నిమిషాల్లో మెదడు గాయాలను గుర్తించేలా చేస్తోంది. అలాగే, 'లిక్విడ్ బయాప్సీ' ద్వారా రక్త నమూనాలతోనే క్యాన్సర్ మళ్లీ వచ్చే అవకాశాలను ముందుగానే తెలుసుకునే వీలొచ్చింది. ఇంటి నుంచే గర్భాశయ క్యాన్సర్ పరీక్షించే 'టీల్ వాండ్'కు ఎఫ్‌డీఏ ఆమోదం లభించడం మరో కీలక ముందడుగు. బయోటెక్నాలజీ రంగంలో ఈ ఏడాది చారిత్రాత్మక విజయాలు నమోదయ్యాయి. ఫిలడెల్ఫియా చిన్నపిల్లల ఆసుపత్రిలో వైద్యులు 'క్రిస్పర్‌క్యాస్9' టెక్నాలజీతో అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతున్న శిశువును పూర్తిగా నయం చేశారు. ఇది వ్యక్తిగత వైద్యంలో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సికిల్ సెల్ ఎనీమియా వంటి వ్యాధులకు వన్‌టైమ్ జన్యు చికిత్సలు అమెరికా, యూరప్‌లలో ఆమోదం పొందాయి. అయితే ఈ చికిత్సల ఖరీదు కోట్ల రూపాయల్లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. హెచ్ఐవీ నివారణకు సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే తీసుకునే 'లెనకాపావిర్' ఇంజెక్షన్‌కు ఆమోదం లభించడం ఎయిడ్స్ రహిత భవిష్యత్తుపై ఆశలు పెంచింది. ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ టెక్నాలజీని క్యాన్సర్, ఫ్లూ వంటి వ్యాధులకు కూడా విస్తరిస్తున్నారు. టెలిమెడిసిన్ 2025 నాటికి సాధారణ సేవగా మారింది. మేయో క్లినిక్ వంటి ఆసుపత్రుల్లో 'ఎబ్రిడ్జ్' ఏఐ సిస్టమ్ వైద్యులు-రోగుల సంభాషణలను ఆటోమేటిక్‌గా క్లినికల్ నోట్స్‌గా మార్చుతోంది. దీంతో వైద్యులు రోగులపై ఎక్కువగా దృష్టి పెట్టగలుగుతున్నారు. చైనా సహా పలు దేశాల్లో ఇంటర్నెట్ హాస్పిటల్స్ ప్రారంభమయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో టెలిహెల్త్ కియోస్క్‌లు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్‌వాచ్‌లు, స్కిన్ ప్యాచ్‌లు నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ సాధనాలుగా మారాయి. గ్లూకోజ్ మానిటర్లు, ఈసీజీ ఫీచర్లు, రక్తపోటు పరికరాలు సాధారణమయ్యాయి. శస్త్రచికిత్సల్లో 'డా విన్సీ', 'హ్యూగో' వంటి రోబోటిక్ సిస్టమ్‌ల వినియోగం పెరిగింది. ఆసుపత్రుల్లో సూక్ష్మక్రిములను నాశనం చేసే రోబోలు సేవలందిస్తున్నాయి. ఐఓటీ, ఏఐతో అనుసంధానమైన స్మార్ట్ హాస్పిటళ్లు వాస్తవరూపం దాల్చాయి. డిశ్చార్జ్ తర్వాత కూడా రోగుల ఆరోగ్యాన్ని రిమోట్‌గా పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రారంభించిన 'ఈఐఓఎస్ 2.0' ప్రపంచ ఆరోగ్య ముప్పులను ముందే గుర్తిస్తోంది. టెక్నాలజీ వైద్య రంగాన్ని మార్చుతున్నప్పటికీ, ఖరీదు, నైతికత, డేటా గోప్యత వంటి సవాళ్లు ఎదురుగా ఉన్నాయి. 2025లో సాధించిన పురోగతి మానవాళికి మరింత ఆరోగ్యకరమైన భవిష్యత్తుపై బలమైన ఆశను కల్పిస్తోంది.

# తైవాన్‌లో భూకంపం
# రిక్టర్ స్కేలుపై 7.0 నమోదు

**మొదటి పేజీ తరువాయి...**
తెలిపారు. యిలాన్ కౌంటీలో తీవ్రత స్థాయి 4గా నమోదైంది. కావోహ్సియంగ్, పింగ్‌టుంగ్ కౌంటీల్లో 3 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకోగా, లియన్‌చియాంగ్, పెంఘు కౌంటీల్లో 2, కిన్మెన్ కౌంటీలో 1 తీవ్రత మాత్రమే నమోదైంది. తైవాన్ తరచుగా భూకంపాలను ఎదుర్కొంటుండటానికి కారణం, ఇది ఫిలిప్పీన్ సీ ప్లేట్, యురేషియన్ ప్లేట్‌లు కలిసే అత్యంత చురుకైన భూకంపల మండలంలో ఉండటమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1999 సెప్టెంబర్‌లో 7.3 తీవ్రతతో సంభవించిన భూకంపంలో సుమారు 2,000 మంది మృతి చెందగా, 2016లో దక్షిణ తైవాన్‌లో వచ్చిన భూకంపంలో 100 మందికి పైగా మరణించారు. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా 7.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈసారి భూకంపం సముద్రంలో లోతుగా సంభవించడం వల్ల పెద్ద ఎత్తున నష్టం తప్పిందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో 5.5 నుంచి 6.0 తీవ్రతతో ఆఫ్టర్ షాక్స్ వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇదిలా ఉండగా, మూడు రోజుల క్రితం తైవాన్ ఆగ్నేయ తీరంలోని టైటుంగ్ కౌంటీలో 6.1 తీవ్రతతో భూకంపం రావడం, ఇప్పుడు మరో భారీ భూకంపం సంభవించడం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇదే సమయంలో, శనివారం ఆఫ్ఘనిస్తాన్‌లో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించగా, సోమవారం జపాన్ తీరంలో 7.6 తీవ్రతతో భూకంపం రావడంతో పసిఫిక్ ప్రాంతమంతా భూకంపాల ప్రభావం కనిపిస్తోంది.

# ఖనిజాన్వేషణ కోసం
# పాక్‌తో అమెరికా దోస్తీ

**మొదటి పేజీ తరువాయి...**
పాక్ ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సలహాదారుడైన రేమాండ్ ఎమోరి కాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల సలహాదారు రికీ గిల్ సహా పలువురు సీనియర్ యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటికే జారీ చేసిన టెండర్ ప్రకారం అమెరికన్ లోకోమోటివ్‌లను పాకిస్తాన్ కొనుగోలు చేయాలని గిల్ కోరినట్లు తెలుస్తోంది. గతంలో అమెరికా నుంచి 55 లోకోమోటివ్‌లు కొనుగోలు చేసిన పాక్, ప్రస్తుతం నిధుల కొరత కారణంగా వాటిని వాయిదా వేసుకున్నట్టు సమాచారం. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వార్షిక సమావేశాల సందర్భంగా ఈ ఏడాది అక్టోబరులో ఔరంగజేబ్ వాషింగ్టన్ పర్యటనకు వెళ్లారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ సేవల కోసం స్టార్‌లింక్ లైసెన్స్‌ను సానుకూలంగా పరిశీలించాలని అమెరికా కోరినట్లు తెలుస్తోంది. అమెరికన్ కంపెనీలపై విధిస్తున్న 5 శాతం డిజిటల్ పన్నును పాకిస్తాన్ తొలగించడంతో వాషింగ్టన్ ప్రశంసలు అందుకుంది. ఖనిజ రంగంలో పెట్టుబడులను మరింత వేగవంతం చేయడానికి రిజర్వ్ అసెస్‌మెంట్లు, ఆఫ్‌టేక్ ఒప్పందాలపై పాక్ సహకారం కావాలని అమెరికా ఎనర్జీ అండ్ బిజినెస్ అఫైర్స్ సీనియర్ అధికారి థామస్ లెర్సెన్ స్పష్టం చేశారు. ఖనిజాల నిల్వల గుర్తింపులో కృత్రిమ మేధ అభివృద్ధిపై కూడా రెండు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఇటీవల కాలంలో అమెరికా-పాక్ సంబంధాల్లో వచ్చిన మార్పులు గమనార్హం. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వడం, ఇంధన వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాలు ఈ స్నేహాన్ని మరింత బలపరుస్తున్నాయి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఇస్లామాబాద్‌కు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల సాయం అవసరమైతే, అమెరికా మద్దతు కీలకంగా మారనుంది. మధ్య, పశ్చిమ, దక్షిణాసియాల్లో పెరుగుతున్న చైనా, రష్యా ప్రభావాన్ని ఎదుర్కోవడానికి పాకిస్తాన్ అమెరికాకు కీలక వ్యూహాత్మక భాగస్వామిగా మారనుంది.



# ఒకే పంట.. ఒకే సీజన్.. సాయంలో తేడాలెందుకు?

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

ఉల్లి రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని వైసీపీ జనరల్ సెక్రటరీ (వ్యవసాయం, రైతు సంక్షేమం) ఎం.వి.ఎస్. నాగిరెడ్డి ధ్వజమెత్తారు. ఉల్లి రైతుల కోసం వైసీపీ , గత మూడు నెలలుగా సాగించిన సుదీర్ఘ పోరాటం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. ఈ పోరాటం ఫలితంగా ప్రభుత్వం 128.33 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమే అయినప్పటికీ, అందులో నంద్యాల , అనంతపురం జిల్లాల రైతులను మినహాయించడం అత్యంత అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఆదేశాల ప్రకారం కర్నూలు , వైఎస్సార్ కడప జిల్లాల్లోని 37,752 మంది రైతులకు ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున సాయం అందుతుందని, అయితే ఇదే సీజన్‌లో పంట సాగు చేసి నష్టపోయిన ఇతర జిల్లాల పరిస్థితి ఏంటని నాగిరెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో భాగంగా ఉన్న నంద్యాల జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో, అనంతపురం జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో ఉల్లి సాగు జరిగిందని ఆయన వివరించారు. ఒకే సీజన్‌లో, ఒకే రకమైన వాతావరణ పరిస్థితుల్లో సాగు చేసి, ఒకే మార్కెట్‌కు పంటను తరలించిన రైతుల మధ్య ప్రభుత్వం ఎందుకు భేదాలు చూపిస్తోందని ఆయన నిలదీశారు. నంద్యాల, అనంతపురం జిల్లాల రైతులకు అందాల్సిన సుమారు 22 కోట్ల రూపాయల సాయాన్ని నిలిపివేయడం వెనుక ప్రభుత్వ ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వివక్ష వల్ల ఆయా జిల్లాల రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన ఈ అరకొర సాయం వల్ల క్షేత్రస్థాయిలో అసహనం వ్యక్తమవుతోందని హెచ్చరించారు. రైతులందరూ ఒకే రకమైన ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయినప్పుడు, కొందరికి మాత్రమే పరిహారం అందించి మరికొందరిని గాలికి వదిలేయడం ఏ రకమైన పాలన అని ఆయన ఆక్షేపించారు. చివరగా, ఉల్లి సాగు చేసిన ప్రతి రైతుకు వివక్ష లేకుండా ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున పరిహారం అందజేయాలని నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే నంద్యాల , అనంతపురం జిల్లాల రైతులను కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చి నూతన జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నష్టపోయిన రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# డిప్యూటీ సీఎం విజ్ఞప్తిని తోసిపుచ్చిన టీటీడీ!

**మొదటి పేజీ తరువాయి...**

పర్యావరణ నిబంధనల దృష్ట్యా కొత్త నిర్మాణాలపై నిషేధం ఉందని పాలక మండలి గుర్తు చేసింది. కేవలం శిథిలావస్థకు చేరిన పాత భవనాలను లేదా విద్యాసంస్థలను మాత్రమే పునర్నిర్మించుకునే అవకాశం ఉందని, కొత్తగా ఏ ప్రభుత్వ శాఖకైనా భూమిని కేటాయించడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. అయితే, ఉపముఖ్యమంత్రి , మంత్రి కోరికను పూర్తిగా కాదనకుండా టీటీడీ ఒక ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. తిరుమలలో ఇప్పటికే అందుబాటులో ఉన్న అతిథి గృహాలలో ఒక భవనాన్ని పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలకు ఉమ్మడిగా కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు టీటీడీ అధికారులు సంబంధిత శాఖలకు సమాచారం అందించారు. దీనివల్ల కొత్తగా భూమిని కేటాయించాల్సిన అవసరం ఉండదని, నిబంధనల ఉల్లంఘన జరగదని టీటీడీ భావిస్తోంది.తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు, ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంలో కీలక వ్యక్తుల నుంచి అభ్యర్థనలు వచ్చినప్పటికీ, హైకోర్టు మార్గదర్శకాలను , టీటీడీ నిబంధనలను అతిక్రమించకూడదని పాలకమండలి ఏకగ్రీవంగా నిర్ణయించింది. టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ యంత్రాంగానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపింది. కొత్త నిర్మాణాల కంటే ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడమే ఉత్తమమని టీటీడీ పాలకమండలి తన చర్య ద్వారా నిరూపించింది.



# రక్షకులే భక్షకులైతే న్యాయమెక్కడ?

**పిడుగురాళ్ల (ఏడీఎన్ఎన్) :**

గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో స్థానిక సీఐ సెటిల్‌మెంట్లు , వేధింపుల ఉదంతం తీవ్ర కలకలం రేపింది. రక్షక భట నిలయమే భక్షక నిలయంగా మారిందని, పోలీసులు తమ ఆస్తులను అక్రమంగా లాక్కున్నారని ఆరోపిస్తూ జ్యోతి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానిక సీఐ వెంకట్రావు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్ల విలువైన ఆస్తులను బలవంతంగా రాయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె చేయి కోసుకున్నారు. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు, ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నారు. బాధితురాలు జ్యోతి వెల్లడించిన వివరాల ప్రకారం, సుమారు రూ. 10 కోట్ల విలువ చేసే తమ స్థిరాస్తిని సీఐ వెంకట్రావు మరో వ్యక్తితో కలిసి అక్రమంగా తన పేరిట రాయించుకున్నారు. ఈ వివాదంలో సీఐ అత్యంత అమానుషంగా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. దాదాపు 20 రోజుల క్రితం తన భర్తను అక్రమంగా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి, తీవ్రమైన బెదిరింపులకు గురిచేసి, ఆస్తి పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని ఆమె వాపోయారు. కేవలం ఆస్తిని లాక్కోవడమే కాకుండా, అప్పటి నుండి తమ కుటుంబాన్ని నిత్యం వేధిస్తున్నారని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. మహిళ అని కూడా చూడకుండా తనను, తన కుమార్తెను అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి సీఐ దుర్భాషలాడారని జ్యోతి ఆరోపించారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక, ఉన్న ఆస్తిని కోల్పోయి వీధిన పడ్డామన్న ఆవేదనతోనే తను ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. "పోలీసులే సెటిల్‌మెంట్లు చేస్తూ మా ఆస్తులు లాక్కుంటే మాకు న్యాయం చేసేవారు ఎవరు?" అని ఆమె ఆర్తనాదం చేశారు. ప్రభుత్వం , ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి సీఐ వెంకట్రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ ఆస్తులను తమకు తిరిగి వచ్చేలా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. ఒక బాధ్యతాయుతమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉండి సివిల్ వివాదాల్లో తలదూర్చడం, సెటిల్‌మెంట్ల పేరుతో ఆస్తులు రాయించుకోవడంపై పట్టణంలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మహిళలపై , వారి కుటుంబాలపై ఇలాంటి అరాచకాలకు పాల్పడటం దారుణమని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఘటనపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించి, బాధితురాలికి న్యాయం చేయాలని, చట్టాన్ని అతిక్రమించిన అధికారులను శిక్షించాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనతో పిడుగురాళ్లలో పోలీసుల తీరుపై ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

# కూటమి పాలనలో హిందూ ధర్మంపై దాడులు..

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆలయాలు, దేవుళ్లను రాజకీయాల కోసం వాడుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని వైసీపీ నేత మల్లాది విష్ణు మండిపడ్డారు. తాడేపల్లిలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా తయారైందని ఆరోపించారు. ముఖ్యంగా తిరుమలలో అనేక అపచారాలు జరుగుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని, తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటంలో చంద్రబాబు సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారం, రీల్స్ సంస్కృతి, మద్యం, మాంసాహారం యథేచ్ఛగా కనిపిస్తున్నా టీటీడీ బోర్డు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తిరుమల కొండపై విజిలెన్స్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, టీటీడీ పాలక మండలి సభ్యులే సిబ్బందితో గొడవలకు దిగడం దారుణమని మల్లాది విష్ణు పేర్కొన్నారు. టీటీడీ గోశాలలో మునుపెన్నడూ లేని విధంగా దాదాపు 190 గోవులు మరణించడం అత్యంత బాధాకరమని, ఇదే విషయాన్ని తాము ఎత్తి చూపితే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసంతోత్సవంలో స్వామివారి నైవేద్య సమర్పణలో జాప్యం జరగడం, భక్తులు చెప్పులు వేసుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి వెళ్లడం వంటి వరుస తప్పిదాలు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన ఆక్షేపించారు. కేవలం టీటీడీ మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్షేత్రాల్లో వరుస అపచారాలు చోటుచేసుకుంటున్నా, భక్తుల రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల పరిస్థితి కూడా దారుణంగా మారిందని విష్ణు వివరించారు. కాశీనాయన క్షేత్రంలో గోశాల, అన్నదాన సత్రాలను అమానుషంగా బుల్‌డోజర్లతో కూలగొట్టి కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. శ్రీశైలంలో మద్యం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని, కూటమి ఎమ్మెల్యేలే అటవీ సిబ్బందిపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. సింహాచలంలో గోడ కూలి ఏడుగురు మరణించినా, కాశీబుగ్గలో తొక్కిసలాటలో తొమ్మిది మంది చనిపోయినా ప్రభుత్వంలో ఏమాత్రం జవాబుదారీతనం లేదని ఆయన మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో విగ్రహాల ధ్వంసం జరిగినా నిందితులను పట్టుకోలేకపోయారని, కనీసం భక్తుల హుండీ కానుకలకు కూడా భద్రత లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ భూములను



టెండర్లు లేకుండా తమ అనుయాయులకు కట్టబెట్టేలా జీవోలు జారీ చేస్తూ ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోందని మల్లాది విష్ణు ఆరోపించారు. నారికంపాడులో సుమారు వెయ్యి కోట్ల విలువైన ఆలయ భూమిని స్వాహా చేయడానికి కుట్ర పన్నారని, విశాఖ కేంద్రంగా గోమాంసం ఎగుమతులు జరుగుతున్నా కూటమి నేతలు నోరు మెదపడం లేదని నిలదీశారు. వైఎస్ జగన్ హయాంలో ఆలయాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని, గతంలో కూల్చివేసిన ఆలయాలను పునర్నిర్మించామని ఆయన గుర్తు చేశారు. హిందూ ధర్మాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని, దేవాలయాల ఆస్తులను కాపాడటంలో తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# పీపీపీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానం కింద ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే యోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఒక బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన వైద్య విద్యను ప్రైవేటు పరం చేయడం పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విషయంలో ముఖ్యమంత్రి అత్యుత్సాహం చూపిస్తూ, మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులు ఈ పీపీపీ విధానాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని రామకృష్ణ గుర్తు చేశారు. ప్రభుత్వ నిధులతో, ప్రజల ఆస్తులతో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం అంటే



ప్రజా ఆస్తులను దోచిపెట్టడమేనని ఆయన మండిపడ్డారు. కాలేజీ సిబ్బందికి రెండేళ్ల పాటు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తూ, విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేసుకునే హక్కును మాత్రం ప్రైవేటు వ్యక్తులకు కల్పించడం విచారకరమని లేఖలో పేర్కొన్నారు. ఈ విధానం వల్ల సామాన్యులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి సత్యకుమార్ ప్రకటనలపై స్పందిస్తూ, పీపీపీ టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపిస్తుంటే, మంత్రి మాత్రం టెండర్లు వస్తున్నాయని అవాస్తవాలు ఎందుకు చెబుతున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు అందించడం అభినందనీయమే అయినప్పటికీ, ప్రభుత్వ విద్యా, వైద్య సంస్థలను ప్రైవేటుకు అప్పగించి కేవలం ట్రస్టుల ద్వారా కొంతమందికే సేవలు అందేలా చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వ రంగంలోని సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రైవేటుకు అప్పగించి పేదలను గాలికి వదిలేయడం తగదని హితవు పలికారు. కాగా, ప్రభుత్వం మాత్రం మెడికల్ కాలేజీల నిర్వహణకు అయ్యే భారీ వ్యయాన్ని భరించడం మరియు నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు అందించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాదిస్తోంది. పీపీపీ ద్వారా నిర్వహించినా అవి ప్రభుత్వ కాలేజీలుగానే ఉంటాయని, అందులో 70 శాతం సీట్లు పేదలకు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే, విద్యా, వైద్య రంగాలు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే భవిష్యత్తులో సామాన్యులకు అవి భారంగా మారుతాయని రామకృష్ణ హెచ్చరించారు. ఈ లేఖ నేపథ్యంలో ప్రభుత్వం పీపీపీ విధానంపై తన నిర్ణయాన్ని పునరాలోచిస్తుందా లేదా అన్నది వేచి చూడాలి.

# మదనపల్లె వద్దు.. రాయచోటి ముద్దు

**రాయచోటి (ఏడీఎన్ఎన్) :**

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాయచోటి పట్టణం నిరసనలతో హోరెత్తింది. జిల్లా పునర్విభజనలో భాగంగా రాయచోటిని జిల్లా కేంద్రం హోదా నుంచి తొలగించి, మదనపల్లెను కొత్త జిల్లా కేంద్రంగా మారుస్తారనే ప్రచారం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో జేఏసీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులు, వర్తక, విద్యాసంస్థల ప్రతినిధులు, యువత భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. "మదనపల్లె వద్దు - రాయచోటి ముద్దు" అంటూ నినాదాలు చేస్తూ తమ ప్రాంత ఆకాంక్షను చాటిచెప్పారు. ఆదివారం ఉదయం నుంచే పట్టణంలోని నేతాజీ కూడలి వద్ద ఉద్రిక్తత నెలకొంది. కర్నూలుచిత్తూరు జాతీయ రహదారిపై ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జేఏసీ పిలుపు మేరకు వ్యాపారస్థులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు సహకరించారు. రాయచోటి ఇప్పటికే జిల్లా కేంద్రంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఇప్పుడు దాన్ని తరలించే ప్రయత్నం చేయడం ఈ ప్రాంత ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై స్థానిక మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ ప్రజలకు భరోసా ఇచ్చారు. రాయచోటి జిల్లా కేంద్రం విషయంలో వస్తున్న వదంతులను నమ్మవద్దని, జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించడమే తన అభిమతమని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ రాయచోటి నుంచి జిల్లా కేంద్రాన్ని మార్చే పరిస్థితి వస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేయడానికి కూడా వెనుకాడబోనని ప్రకటించి ప్రజల్లో ధైర్యం నింపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రాయచోటి ప్రయోజనాలను కాపాడుతానని ఆయన



హామీ ఇచ్చారు. అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు తమ పోరాటం ఆగదని జేఏసీ నేతలు హెచ్చరించారు. రాయచోటి జిల్లా కేంద్రం హోదాను కాపాడుకునేందుకు అవసరమైతే జైలు భరో వంటి ఉధృతమైన కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు. అటు రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న డిమాండ్లు, ఇటు మదనపల్లె జిల్లా ఏర్పాటు వార్తల మధ్య రాయచోటి ప్రజలు ఐకమత్యంతో తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి ఈ అనిశ్చితికి తెరదించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# 'ఆవకాయ అమరావతి'కి ఆదిలోనే హంసపాదు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఆవకాయ అమరావతి ఉత్సవ్' నిర్వహణకు ఆదిలోనే ఊహించని అడ్డంకులు ఎదురయ్యాయి. తెలుగు సినిమా, సాహిత్యం, జానపద కళల వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలనే సత్సంకల్పంతో పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్ సంస్థతో కలిసి ఈ మెగా ఈవెంట్‌ను రూపొందించింది. జనవరి 8 నుంచి 10 వరకు మూడు రోజుల పాటు విజయవాడలోని పున్నమి ఘాట్, భవానీ ద్వీపాలను వేదికగా చేసుకుని ఈ సంస్కృతిక వేడుకలను నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే విడుదల చేయగా, క్షేత్రస్థాయిలో భూ వివాదం తెరపైకి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఉత్సవం కోసం పున్నమి ఘాట్ పరిసరాల్లో ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో, పర్యాటక శాఖ అధికారులు అక్కడ ఉన్న కొన్ని గోడలను కూల్చివేయడం స్థానిక భూ యజమానుల ఆగ్రహానికి కారణమైంది. పున్నమి ఘాట్ ప్రాంతంలో సుమారు



20 ఎకరాల మేర ప్రైవేటు పట్టా భూమి ఉందని, తమ భూములకు రక్షణగా తాము నిర్మించుకున్న గోడలను కనీసం ముందస్తు సమాచారం లేదా నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని యజమానులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమ ప్రైవేట్ ప్రాపర్టీలో తమను సంప్రదించకుండా ప్రభుత్వం ఒక భారీ కార్యక్రమాన్ని ఎలా చేపడుతుందని వారు నిలదీస్తున్నారు. 'భవానీపురం పున్నమి ఘాట్ భూమి యజమానుల సంఘం' ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండా ప్రైవేట్ ఆస్తులపైకి రావడం నిబంధనలకు విరుద్ధమని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి బ్రాండ్‌ను ప్రమోట్ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినప్పటికీ, వ్యక్తుల ఆస్తులను ఆక్రమించే విధంగా వ్యవహరించడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం కారణంగా ఉత్సవ ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడటంతో, అసలు ఈ కార్యక్రమం అనుకున్న సమయానికి పున్నమి ఘాట్ వేదికగా జరుగుతుందా లేదా అన్నది సందేహంగా మారింది. ప్రస్తుతానికి పర్యాటక శాఖ అధికారులు ఈ సమస్యపై స్పందించాల్సి ఉంది. ఒకవైపు ఉత్సవాల తేదీలు దగ్గర పడుతుండటం, మరోవైపు భూ యజమానులు కోర్టుకు వెళ్లే యోచనలో ఉండటంతో ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అధికారులు ల్యాండ్ ఓనర్లతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యను పరిష్కరిస్తారా? లేక వేదికను మార్చి ఉత్సవాలను నిర్వహిస్తారా? అన్నది వేచి చూడాలి. ఏది ఏమైనా, వైభవంగా జరగాల్సిన 'ఆవకాయ అమరావతి ఉత్సవ్'కి ఈ భూ వివాదం పెద్ద తలనొప్పిగా మారింది.

# ఇద్దరు చిన్నారులతో కాలువలో దూకి ఆత్మహత్య

**నంద్యాల (ఏడీఎన్ఎన్) :**

నంద్యాల జిల్లాలో గుండెలు పిండేసే విషాదం చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్నతల్లే కాలయముడిలా మారి ఇద్దరు పసిబిడ్డలను కాలువలోకి నెట్టేసి, ఆపై తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన గడివేముల మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నంద్యాల జిల్లా గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ తన ఇద్దరు కుమార్తెలు వైష్ణవి (4 ఏళ్లు), సంగీత (5 నెలలు) తో కలిసి మంచాలకట్ట సమీపంలోని శ్రీశైలం కుడి కాలువ వద్దకు చేరుకుంది. ఏం కష్టం వచ్చిందో ఏమో కానీ, మొదట తన ఇద్దరు చిన్నారులను కాలువలోకి తోసేసింది. తర్వాత ఆమె కూడా కాలువలోకి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనలో ముగ్గురూ నీటిలో మునిగి మృతి చెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీశారు. ప్రాథమిక విచారణ ప్రకారం, కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలు లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగానే లక్ష్మీదేవి ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఐదు నెలల పసికందును సైతం చూడకుండా అంతటి దారుణానికి ఒడిగట్టడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. గడివేముల పోలీసులు



ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మీదేవి ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ఆమె కుటుంబ సభ్యులను, గ్రామస్తులను విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



# దేశాభివృద్ధికి విద్యే రాజమార్గం

**నరసాపురం (ఏడీఎన్ఎన్) :**

దేశాభివృద్ధికి విద్యే అసలైన రాజమార్గమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైనవానిలంకలో పర్యటించిన ఆమె, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచవ్యాప్తంగా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన డిజిటల్ మౌలిక సదుపాయాలను ఆమె ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. యూనియన్ బ్యాంక్ సహకారంతో సుమారు రూ. 18 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ వంటి సదుపాయాలను మంత్రి ప్రారంభించారు. తర్వాత ల్యాబ్‌లను స్వయంగా పరిశీలించిన ఆమె, విద్యార్థులతో ముచ్చటించి అక్కడ ఉన్న పరికరాల పనితీరు గురించి ఆరా తీశారు. తీరప్రాంత విద్యార్థులకు సైతం అత్యాధునిక సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ ల్యాబ్‌లను నిర్మించినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యా రంగంతో పాటు క్రీడలపై కూడా యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని, శారీరక దృఢత్వం మరియు మానసిక వికాసం రెండూ సమానంగా ముఖ్యమని సూచించారు. తీరప్రాంత యువతకు ఉన్నత చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకెళ్తూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని, మారుమూల ప్రాంతాల నుంచి కూడా గొప్ప నాయకులు, శాస్త్రవేత్తలు రావాలని ఆకాంక్షించారు. అంతకుముందు పెదమైనవానిలంకలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఇతర నాయకులతో కలిసి ఆమె వీక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ నేతలు , జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చి, విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేయాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం ఈ పర్యటన ద్వారా మరోసారి స్పష్టమైంది.

# అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకున్న సీఎం

మొదటి పేజీ తరువాయి...

నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక లోటు, పోలవరం ప్రాజెక్టు నిధులు, అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలపై చర్చించినట్లు తెలుస్తోంది. నిర్మలా సీతారామన్ తన దత్తత గ్రామం పెదమైనవాని లంకలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తర్వాత ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాలోని ఉంగుటూరు మండలం పెద్ద ఆవుటపల్లి గ్రామానికి వెళ్లారు. అక్కడ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహన్ రావు మాతృమూర్తి వెంకట నరసమ్మ (99) ఇటీవల కన్నుమూయడంతో, వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన సీఎం, రామ్మోహన్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ విధంగా ఆదివారం అంతా చంద్రబాబు పర్యటన అటు పాలన, ఇటు మానవీయ సంబంధాల కలయికగా సాగింది.



# 'డిజిటల్ బుక్'లో అన్నీ నమోదు చేస్తాం!

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా లభించిన అపూర్వ స్పందన చూసి కూటమి ప్రభుత్వంలో గుబులు మొదలైందని, ఆ ఓర్వలేకనే వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ మంత్రి తానేటి వనిత తీవ్రంగా ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను మరియు హోంమంత్రి వంగలపూడి అనిత అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. కేవలం ఫ్లెక్సీలపై సినిమా డైలాగులు రాసినంత మాత్రానికే కేసులు పెట్టడం ఏ రకమైన పాలన అని ఆమె ప్రశ్నించారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా రక్తతర్పణం చేశారనే సాకుతో వైసీపీ కార్యకర్తలను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించడంపై వనిత మండిపడ్డారు. గతంలో బాలకృష్ణ సినిమా విడుదలైనప్పుడు 20 పొట్టేళ్ల తలలు నరికి దండలు వేసినప్పుడు ఈ జీవహింస, రాక్షస సంస్కృతి హోంమంత్రికి ఎందుకు కనపడలేదని ఆమె నిలదీశారు. అసలు రాష్ట్రంలో ఇలాంటి సంస్కృతికి పునాదులు వేసిందే తెలుగుదేశం పార్టీ అని, చంద్రబాబు బాలకృష్ణ ఫ్లెక్సీలకు టీడీపీ కార్యకర్తలు పొట్టేళ్ల రక్తంతో అభిషేకాలు చేస్తున్న దృశ్యాలు హోంమంత్రికి ఎందుకు అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె ఆరోపించారు. పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని, నల్లజర్ల సెంటర్‌లో కార్యకర్తలను నడిరోడ్డుపై నడిపించిన తీరు అత్యంత దారుణమని వనిత ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలపై పోలీసులతో 'ట్రీట్మెంట్' ఇప్పిస్తామని హోంమంత్రి వ్యాఖ్యానించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, థర్డ్ డిగ్రీ ప్రయోగించే అధికారం ఆమెకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. నల్లజర్ల ఘటన వెనుక టీడీపీ కార్యకర్తల ముందస్తు ప్రమేయం ఉందని, ఇది పోలీసులతో కలిసి చేసిన కుట్ర అని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు మరియు చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అదుపు చేయడంలో హోంమంత్రి పూర్తిగా విఫలమయ్యారని, రాజధాని రైతులు తమను మోసం చేశారంటూ ప్రభుత్వంపై తిరగబడుతుంటే ఆ నిరసనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ 'జీవహింస' రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను దూషిస్తేనే మంత్రి పదవి ఉంటుందన్న భ్రమలో హోంమంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి అక్రమ చర్యను, పెడుతున్న అక్రమ కేసులను తాము 'డిజిటల్ బుక్'లో నమోదు చేస్తున్నామని, భవిష్యత్తులో అధికారం చేపట్టాక ప్రతి వేధింపుకూ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని తానేటి వనిత హెచ్చరించారు.



# రాష్ట్రంలో 'రాబందు' పాలన నడుస్తోంది

**నాగర్‌కర్నూలు (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో రైతుబంధు పాలన పోయి రేవంత్ 'రాబందు' పాలన వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూలు జిల్లాలో ఆదివారం నిర్వహించిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు యూరియా బస్తాల కోసం చలిలో చెప్పులు క్యూలైన్లో పెట్టి గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేకుండా చూశామని, ఇప్పుడు రైతులు కాళ్ల మీద పడి వేడుకోవాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే యూరియా కొరత లేకుండా చేస్తానని, అర్హులందరికీ రూ. 4వేల పెన్షన్ ఇస్తానని శపథం చేయాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తనపై కేటీఆర్ సెటైర్లు వేస్తూ.. ప్రతిపక్షాలు పథకాల అమలు గురించి అడిగితే సీఎం బూతులు తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రేవంత్ ఫ్రస్ట్రేషన్ చూస్తుంటే రేపో మాపో ఎవరినైనా కరుస్తాడేమో అనిపిస్తోంది" అని ఎద్దేవా చేశారు. తన విద్యాభ్యాసంపై విమర్శలు చేస్తున్న రేవంత్ రెడ్డి, తన అల్లుడు భీమవరం వాడు కాదా అని ప్రశ్నించారు. ఈ క్రమంలో సీఎంకు 'భీమవరం బుల్లెబ్బాయ్' అనే పేరు సరిపోతుందని చమత్కరించారు. పాలమూరు జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పడకేసిందని, కనీసం పంచాయతీ ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజలను ఆశ పెట్టి మోసం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.



# వాళ్లిద్దరూ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు

● **టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నరేంద్ర మోదీ, అమిత్ షాలు తమ పదవులను కాపాడుకోవడానికి ఎంతటికైనా తెగిస్తారని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , బీజేపీ ఒక పెత్తందారీ పార్టీ అని, పేదలను దోచుకుని అదానీ, అంబానీలకు కట్టబెడుతోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదవాడి పక్షాన నిలుస్తుందని, రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేపట్టారని గుర్తు చేశారు. మోదీ సైతం ఇప్పుడు జనగణన గురించి మాట్లాడుతున్నారంటే అది రేవంత్ రెడ్డి చలవనేనని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'క్వేక్ ఎరీనా' పబ్‌లో ఈగల్ వేట

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ కొండాపూర్‌లోని 'క్వేక్ ఎరీనా' పబ్‌లో ఈగల్ బృందం ఆదివారం సోదాలు నిర్వహించాయి . నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఉక్రెయిన్‌కు చెందిన ప్రముఖ డీజే ఆర్బాట్స్ తో ఏర్పాటు చేసిన కాన్సర్ట్ లో కొందరు డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందింది . సైబరాబాద్ పోలీసులతో కలిసి ఈగల్ బృందం తనిఖీలు చేపట్టింది. మొత్తం 14 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, ఎనిమిది మందికి పాజిటివ్‌గా తేలింది. డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా ఈగల్ బృందం గత 10 రోజుల్లో 27 మందిని అరెస్ట్ చేసింది. వీరిలో ఐదుగురు విదేశీ మహిళలు సహా 17 మంది డ్రగ్ వినియోగదారులు ఉన్నారు. నిందితుల నుంచి 68 గ్రాముల కొకైన్, 50.5 గ్రాముల ఎండీఎంఏ, మరియు ఏకంగా 382 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

EAGLE
Elite Action Group
For Drug Law Enforcement




# 'ఐబొమ్మ' కేసులో కొత్త పేరు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలుగు చిత్ర పరిశ్రమను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి కేసు దర్యాప్తులో పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ప్రహ్లాద్ వెల్లేల అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి పత్రాలను ఉపయోగించి రవి తన కార్యకలాపాలు సాగించినట్లు విచారణలో తేలింది. ప్రహ్లాద్ పేరు మీద రవి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందినట్లు గుర్తించిన పోలీసులు, బెంగళూరులో ఉంటున్న ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించారు. గతంలో రవి ప్రహ్లాద్ తన రూమ్‌మేట్ అని చెప్పినప్పటికీ, విచారణలో ప్రహ్లాద్ మాత్రం తనకు రవి ఎవరో తెలియదని, తన డాక్యుమెంట్లను దొంగిలించి ఇలా వాడటం చూసి షాక్‌కు గురయ్యానని పోలీసులకు తెలిపాడు. రేపటితో రవి పోలీసు కస్టడీ ముగియనుండటంతో, ఈ కేసులో ఇంకెన్ని కొత్త కోణాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

# తెలంగాణ రాష్ట్రానికే మణిహారంగా మధిర

**మధిర (ఏడీఎన్ఎన్) :**

మధిర పట్టణాన్ని తెలంగాణ రాష్ట్రానికే మణిహారంగా, భవిష్యత్తు తరాలకు గర్వకారణంగా తీర్చిదిద్దుతానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మధిరలో ఆదివారం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తర్వాత ఆయన ప్రసంగించారు. మధిరను ఒక మహానగరంగా మార్చే క్రమంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థ, నూతన బస్టాండ్, మరియు పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దే పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.



స్వాతంత్ర పోరాట చరిత్ర కలిగిన ఈ గడ్డపై విద్యాభివృద్ధి కోసం అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు 'అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామికాభివృద్ధికి గాను మధిర, ఎర్రుపాలెంలలో ఇండస్ట్రియల్ పార్కులు, మహిళల స్వయం ఉపాధికి వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని, కలెక్టర్ పర్యవేక్షణలో పనులు జరుగుతాయని స్పష్టం ఆయన స్పష్టం చేశారు . రాజకీయాలకు అతీతంగా మధిరను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

# అర్ధరాత్రి వరకు మద్యం ఎలా అమ్ముతారు ?

● **పోలీసులకు ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నలు**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో డిసెంబర్ 31న అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు డ్రగ్స్, గంజాయిని నిర్మూలిస్తామని అధికారులు ప్రకటనలు చేస్తూనే, మరోవైపు మద్యం అమ్మకాలకు సమయం పెంచడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 29 లక్షల మంది డ్రగ్స్ బానిసలు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయని, వీరందరికీ డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అవుతున్నాయో సీఎం, డీజీపీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ కారణంగా రాష్ట్రం సర్వనాశనం అవుతోందని, యువతతో పాటు చివరకు పోలీసుల పిల్లలు కూడా దీనికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ కేసులు పెరిగాయని ఆరోపించిన ఆయన, పోలీసులకు డ్రగ్స్ సరఫరా చేసేవారితో సంబంధాలు ఉన్నాయంటూ సంచలన



వ్యాఖ్యలు చేశారు. రౌడీ షీటర్లు సోషల్ మీడియాలో బహిరంగంగా స్టేట్‌మెంట్లు ఇస్తున్నా పోలీసులు ఏమీ చేయలేకపోతున్నారని రాజాసింగ్ విమర్శించారు.

# కేసీఆర్ కు ఇప్పుడు జ్ఞానోదయమైందా?

● **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపాటు**

**యాదాద్రి భువనగిరి జిల్లా (ఏడీఎన్ఎన్) :**

గత పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రజలను గాలికి వదిలేశారని, రెండేళ్ల పాటు ఫామ్ హౌస్‌కే పరిమితమై ఇప్పుడు వచ్చి నీతులు చెబుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై



తీవ్ర విమర్శలు చేశారు. వలిగొండ నుంచి కాటేపల్లి వరకు రూ. 49.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్ & బీ రోడ్డును ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఉపాధి హామీ పథకం పేరు మార్చాలనే బీజేపీ నిర్ణయంపై మండిపడ్డారు. దీనికి నిరసనగా జనవరి 5 నుంచి ధర్నాలు, ర్యాలీలు చేపట్టి బీజేపీని ప్రజల్లో ఎండగడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవెల్లి నిర్వాసితులకు అండగా కవిత

**కల్వకుర్తి (ఏడీఎన్ఎన్) :**

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎర్రవెల్లిగోకారం నిర్వాసితులు చేపట్టిన ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన పూర్తి మద్దతు ప్రకటించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన ఆమె, ప్రాజెక్టుల రూపకల్పనలో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపారు. 15 వందల ఎకరాల భూమిని సేకరించి, కేవలం 2 వేల ఎకరాలకు నీళ్లివ్వడం సమంజసం కాదని, గోకారం చెరువును పటిష్టం చేస్తే భూ సేకరణ అవసరం లేకుండానే నీటిని అందించవచ్చని ఆమె సూచించారు. తమ గోడు పట్టించుకోనందుకు నిరసనగా గ్రామస్థులు సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించినా.. అటు ప్రభుత్వం, ఇటు ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ఎర్రవెల్లి వాసులను మనుషులుగా గుర్తించడం లేదని ప్రశ్నించిన కవిత, ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రిని, ఇరిగేషన్ మంత్రిని నిలదీస్తామని హెచ్చరిస్తూ నిర్వాసితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



# పంచాయితీలను కేంద్రమే చూసుకుంటుంది

**నిజామాబాద్ (ఏడీఎన్ఎన్) :**

పంచాయితీ నిధుల కోసం సీఎం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వమే నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి నిధులు జమ చేస్తుందని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గ్రామ పంచాయతీలకు నిధులు తెస్తానన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు . గత రెండేళ్లుగా



సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే నిధులు రాలేదని, ఇప్పుడు ఆ నిధులు నేరుగా గ్రామాలకు అందుతాయని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సంచులు మోయాల్సిన పని లేదని ఎద్దేవా చేశారు . కాంగ్రెస్ పార్టీకి గతంలో డిపాజిట్లు కూడా రాలేదని, బీజేపీ టైమింగ్ సరిగా లేకపోవడం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఇక కేసీఆర్ ప్రెస్ మీట్‌పై స్పందిస్తూ, అందులో చాదస్తం తప్ప ఏమీ లేదని, ఆయన తన జ్ఞానాన్ని కేవలం కుటుంబం రూ. 4050 వేల కోట్లు సంపాదించుకోవడానికే ఉపయోగించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు సూక్తులు చెప్పడం హాస్యాస్పదమని, కేసీఆర్ లాంటి పాపాత్ముడు మరొకరు ఉండరని అర్వింద్ మండిపడ్డారు.

# హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్లలో మార్పులు

● **జోన్ల వారీగా ప్రతిపాదిత విభజన**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

జీహెచ్ఎంసీ పునర్విభజన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కమిషనరేట్లలోనూ భారీ మార్పులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. నగర వ్యాప్తంగా ఉన్న మూడు కమిషనరేట్లను మొత్తం 12 పోలీస్ జోన్‌లుగా పునర్విభజించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నగర విస్తీర్ణం పెరగడం, శాంతిభద్రతల పరిరక్షణను మరింత సులభతరం చేసే లక్ష్యంతో ఈ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమాచారం. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 6 జోన్లు, సైబరాబాద్‌లో 3 జోన్లు, , రాచకొండ కమిషనరేట్ పరిధిలో 3 జోన్లు ఉండేలా మార్పులు చేయనున్నారు. ఈ పునర్విభజనలో భాగంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి మరికొన్ని కీలక ప్రాంతాలు చేరే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రస్తుతం సైబరాబాద్ పరిధిలో ఉన్న శంషాబాద్ , రాజేంద్రనగర్ జోన్‌లను హైదరాబాద్ కమిషనరేట్‌లో విలీనం చేయనున్నట్లు సమాచారం. దీనివల్ల శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సైతం హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి రానుంది. పాలనా సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని జిల్లాలుగా విభజించే ప్రక్రియకు సమాంతరంగానే ఈ పోలీస్ జోన్ల ఏర్పాటు కూడా జరగనుంది. ఈ మార్పుల ద్వారా క్షేత్రస్థాయిలో పోలీసు నిఘా పెరగడంతో పాటు, నేర నియంత్రణ




మరింత పకడ్బందీగా మారుతుందని భావిస్తున్నారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

ఫిల్మ్ ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా

# దగ్గుబాటి సురేష్‌బాబు

**మొదటి పేజీ తరువాయి..**

ఈ ఎన్నికల్లో గెలిచిన నూతన కార్యవర్గం 2027 వరకు కొనసాగనుంది. ప్రొడ్యూసర్స్ సెక్టార్ ఈసి మెంబర్స్‌గా ఆశోక్ కుమార్ , సి కల్యాణ్ , వై వి ఎస్ చౌదరి , ప్రసన్న కుమార్ , దిల్ రాజు , నాగవంశీ, దామోదర్ ప్రసాద్, మోహన్ వడ్లపట్ల, రామసత్యనారాయణ, కె.ఎస్ రామారావు, అమ్మిరాజు , చదలవాడ శ్రీనివాసరావు ఎన్నికవ్వగా, ప్రోగ్రెసివ్ ప్యానల్ నుంచి ఐదుగురు, మన ప్యానెల్ నుంచి ఏడుగురు గెలుపొందారు. స్టూడియో సెక్టార్‌లో మన ప్యానెల్ ముగ్గురు, ప్రొగ్రెసివ్ ఒక్కరు రాగా, ఎగ్జిబిటర్స్ సెక్టార్‌లో గెలిచిన వారిలో 14 మంది ప్రోగ్రెసివ్ ప్యానల్ సభ్యులు కాగా, మన ప్యానెల్ నుంచి ఇద్దరు సభ్యులు, డిస్ట్రిబ్యూషన్ సెక్టార్‌లో 12 ఈసి మెంబర్స్‌కు గానూ, ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 8 మంది.. మన ప్యానెల్ నుంచి 3 సభ్యులు గెలుపొందారు. ప్రస్తుతానికి టై అయింది. ఛాంబర్‌లో 3,355 మంది సభ్యులున్నారు. 3287 మందికి ఓటు వేసే అర్హత ఉంది. అయితే 40 శాతం అంటే 1417 ఓట్లు పోలయ్యాయి. ప్రొడ్యూసర్స్ సెక్టార్ నుంచి 805 ఓట్లు, స్టూడియో సెక్టార్ 66, డిస్ట్రిబ్యూటర్స్ సెక్టార్ 374, ఎగ్జిబిటర్స్ సెక్టార్ 172 ఓట్లు పోల్ అయ్యాయి. పరిశ్రమ సమస్యల పరిష్కారం, థియేటర్ల వ్యవస్థ మరియు నిర్మాణ రంగంలోని సవాళ్లపై ఈ కొత్త కమిటీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# అపార్ట్ మెంట్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లోని సోమాజిగూడ సమీపంలో ఉన్న ఎనిమిది అంతస్తుల ఆల్‌పైన్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనంలోని ఐదవ అంతస్తులో ఉన్న ఏ బ్లాక్ 502 ఫ్లాట్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ఫ్లాట్‌కు తాళం వేసి ఉండటంతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, మంటలు, దట్టమైన పొగ భవనం అంతటా వ్యాపించడంతో నివాసితులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు అపార్ట్ మెంట్‌లోని వాసులందరినీ వెంటనే ఖాళీ చేయించారు. ఈ ఘటనలో



ఎవరికీ ప్రాణనష్టం జరగలేదని పోలీసులు ధృవీకరించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ముగింపు దశకు చేరుకోగా, అపార్ట్ మెంట్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.



# దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర అజరామరం

**ఆవిర్భావ దినోత్సవంపై సీఎం రేవంత్ ఆసక్తికర పోస్ట్**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

భారత దేశ ప్రజల కోసం ఒక శక్తిగా 140 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆసక్తికర ట్వీట్ చేసారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించడం నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు, ప్రజాస్వామ్య సంస్థలను ఏర్పాటు చేయడం నుంచి విభిన్న దేశాన్ని ఏకం చేయడం వరకు ఆధునిక భారతదేశంలోని ప్రతి కీలక అధ్యాయాన్ని జాతీయ కాంగ్రెస్ తీర్చిదిద్దిందని కొనియాడారు. జాతీయ కాంగ్రెస్ చరిత్ర అనేది భారత ప్రజాస్వామ్య ప్రస్థానానికి ప్రతిరూపమని సీఎం రేవంత్ అన్నారు. సోనియా గాంధీ నాయకత్వాన్ని స్మరించుకుంటే సేవ, నిబద్ధత, నీతి, విలువలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలోనే తెలంగాణలోని ఒక మారుమూల గ్రామం నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన పీవీ నరసింహారావు దేశ ప్రధానమంత్రిగా ఎదిగారని అన్నారు. అలాగే డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప ఆర్థికవేత్తకు ప్రధానమంత్రి పదవి దక్కేలా సోనియా గాంధీ చేసిన నిర్ణయాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు.




# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తారా ?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

గ్రామీణ ప్రజల ఆర్థిక వెన్నెముక అయిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి 'జీరాంజీ' అని పెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త చట్టం ద్వారా నిధుల కేటాయింపులో 60:40 శాతం నిబంధన పెట్టి రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. గాంధీ, నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీల పేర్లను చరిత్రలో లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. కేంద్రం తెచ్చిన ఈ కొత్త బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, దీనికి నిరసనగా రేపు ప్రతి గ్రామంలో గాంధీ ఫోటోలతో పనులు చేస్తూ నిరసనలు తెలపాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.



# దమ్ముంటే నెల రోజులు అసెంబ్లీ నడపండి

● **బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజుల పాటు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ఏడాదికి 100 రోజులు సభ జరగాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా నిబంధనలను తుంగలోకి తొక్కుతోందని విమర్శించారు. గతంలో కేవలం ఒకే రోజు సభను నిర్వహించిన రేవంత్ రెడ్డికి, ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చి రైతు కూలీల సాయం, రుణమాఫీ, మహిళలకు రూ. 2500, తులం బంగారం వంటి వాగ్దానాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీస్తోందని, హెల్త్ పాలసీ, భూభారతి, ఫార్మాసిటీ భూములపై చర్చకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ సమావేశాల్లో ప్రజా సమస్యలతో పాటు ప్యాక్స్ , డీసీసీబీ పాలకవర్గాల రద్దుపై బీజేపీ గట్టిగా పోరాడుతుందని స్పష్టం చేశారు.

## రాశి ఫలాలు

**29-11-2025 సోమవారం**

**మేషం:**
కాలం మిశ్రమంగా ఉంది. బుద్ధి సామర్థ్యంతో పనులు ప్రారంభించండి. చిన్న పొరపాట్లు ప్రమాదకరం కావచ్చు. ఏకాగ్రత అవసరం. ఉద్యోగ వ్యాపారాల్లో జాగ్రత్తగా ముందుకు సాగండి.

**వృషభం:**
గ్రహబలం అనుకూలంగా ఉంది. ఉద్యోగంలో ఉన్నతిని సాధిస్తారు. వ్యాపారంలో ఆర్థిక లాభాలను గడిస్తారు. సృజనాత్మకతకు మంచి సమయం. స్థిరాస్తి యోగం ఉంది.

**మిధునం:**
శ్రమకు ప్రతిఫలం దక్కుతుంది. అభివృద్ధి అవకాశాలు. ప్రణాళి కాబద్ధంగా పని చేస్తే విజయం. ఖర్చుల్లో నియంత్రణ అవసరం. వ్యాపారంలో శాంతంగా వ్యవహరించాలి.

**కర్కాటకం:**
మిశ్రమకాలం నడుస్తోంది. స్థిరచిత్తంతో నిర్ణయాలు తీసుకోండి. అపార్థాలు, వివాదాలు దూరం పెట్టాలి. ఆర్థికపరంగా అనుకూలం. రుణ సంబంధిత విషయాలలో మాత్రం జాగ్రత్త అవసరం.

**సింహం:**
వ్యాపారంలో మంచి ఫలితాలు ఉన్నాయి. ఆర్థికంగా పొదుపు ధోరణి అవసరం. తోటివారితో ప్రశాంతంగా మాట్లాడడం మంచిది. ఉద్యోగంలో శ్రమ పెరగకుండా చూసుకోవాలి.

**కన్య:**
తలపెట్టిన పనుల్లో శుభఫలితం. ఉద్యోగ గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తాయి. ఆర్థిక పరంగా స్థిరాస్తి యోగం ఉంది. సృజనాత్మక పెట్టుబడులు మేలు చేస్తాయి.

**తుల:**
వ్యాపారంలో శ్రేష్ఠమైన లాభాలు ఉన్నాయి. మాటల్లో స్పష్టత అవసరం. ఉద్యోగంలో చిన్న ఆటంకాలు ఉండొచ్చు. శాంతం, సహనం విజయానికి సంకేతం.

**వృశ్చికం:**
సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోండి. ఉద్యోగ, వ్యాపారాల్లో మేలు జరుగుతుంది. ఆర్థికంగా అనుకూలం, పొదుపు అవసరం. మనోధైర్యంతో తీసుకునే నిర్ణయాలు ఫలిస్తాయి.

**ధనస్సు:**
ఉద్యోగంలో శ్రమతోకూడిన ఫలితాలు ఉంటాయి. ఆర్థికంగా పురోగతి ఉంది. ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి.

**మకరం:**
అదృష్ట యోగం. పనులు సజావుగా పూర్తి అవుతుంది. ఉద్యోగ వ్యాపారాలలో లాభదాయక ఫలితాలు ఉంటాయి. కుటుంబంలో ఆనందం నెలకొంటుంది.

**కుంభం:**
ఉద్యోగంలో మంచి చేకూరుతుంది. ఆర్థికంగా అదృష్టం సిద్ధిస్తుంది. ముఖ్య విషయాల్లో మౌనంగా, తెలివిగా వ్యవహరించాలి.

**మీనం:**
ఆత్మవిశ్వాసంతో పనులు మొదలుపెట్టండి. ఉద్యోగంలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తిచేయాలి. ఆలస్యం, మొహమాటం వీడాలి.



## కూటమి పాలన హెలికాప్టర్లకే పరిమితం...

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాన్య ప్రజల సమస్యలు గాలికి వదిలేశారని, ప్రస్తుతం పాలన మొత్తం హెలికాప్టర్లు, చార్టర్డ్ ఫ్లైట్లకే పరిమితమైందని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని ఇస్లాంపేట, వెంగళరెడ్డి కాలనీల్లో పర్యటించి ప్రజల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నాలుగు నెలలుగా పట్టణ వీధుల్లో కాలువలు శుభ్రం చేసిన దాఖలాలే లేవని, ముఖ్యంగా ఇస్లాంపేటలోని పులివాగు డ్రైన్ చెత్తాచెదారంతో పూర్తిగా పూడుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ హయాంలో 'నగర దీపిక' ద్వారా పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారమని, ఇప్పుడు మున్సిపల్ కమిషనర్ కనీసం రోడ్ల మీదకు రావడం లేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లవుతున్నా, కొత్తగా ఒక్క వికలాంగ లేదా వితంతు పెన్షన్ కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల్లో పర్యటిస్తూ పాత పెన్షన్లనే పంపిణీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రేషన్ ఇంటికే వచ్చేదని, ఇప్పుడు ఆ విధానాన్ని తీసివేసి షాపుల వద్ద కేవలం ఐదు రోజులే ఇస్తున్నారని విమర్శించారు. గతంలో సంక్షేమ పథకాలకు డబ్బులిస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శించిన చంద్రబాబు, ఇప్పుడు రెండు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి ఆ సొమ్మును ఎక్కడ ఖర్చు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, పంటలకు గిట్టుబాటు ధర లేకపోగా ఎరువుల ధరలను విపరీతంగా పెంచి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గోపిరెడ్డి విమర్శించారు. రాజధాని రైతు రామారావు మరణానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని, ఏడేళ్లు గడుస్తున్నా రైతులకు ప్లాట్లు చూపించలేకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' నిధులు ఇంతవరకు అందలేదని, పరీక్షలు దగ్గర పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి కట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఒక్క టెండర్ కూడా దాఖలు కాకపోవడం ప్రజల విజయమని ఆయన స్పష్టం చేశారు. నరసరావుపేటలో జరిగిన మెప్మా కుంభకోణంపై విచారణ కమిటీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కార్యక్రమం ద్వారా పట్టణంలోని ప్రతి సందు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటామని, ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# డ్రైవర్ రామరావుకు న్యాయం చేయాలి

### ఆర్టీసీ జేఏసీ డిమాండ్

**ఆసిఫాబాద్ (ఏడీఎన్ఎన్):**

విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై రెబ్బన పోలీసులు అక్రమంగా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడాన్ని ఆర్టీసీ జేఏసీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. ఈ నెల 23న ఆసిఫాబాద్ డిపోకు చెందిన లహరి బస్సు డ్రైవర్ రామరావు హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్నారు. రెబ్బన పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రయాణికుల కోసం బస్సును రోడ్డుకు ఎడమ వైపున, పూర్తి



సైడ్ లో ఇండికేటర్ లైట్లు వేసి నిలిపారు. అయితే, అదే మార్గంలో అతివేగంగా వచ్చిన ఒక బొలెరో వాహనం ఆగి ఉన్న బస్సును వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ తప్పు ఏమీ లేకపోయినా, రెబ్బన పోలీసులు కావాలనే ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని జేఏసీ నేతలు ఆరోపించారు. ఐదు రోజులుగా డ్రైవర్‌ను జైల్లో ఉంచడం అన్యాయమని, ఆర్టీసీ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ఎం. థామస్ రెడ్డి, ఎండీ మౌలానా ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ డిపో మేనేజర్ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి కేసును ఉపసంహరింపజేయాలని వారు కోరారు.

# కేటీఆర్ భాష మార్చుకోవాలి

### ❖ ఎంపీ బలరాం నాయక్ హెచ్చరిక

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ వాడుతున్న భాష రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా ఉందని, తక్షణమే ఆయన తన ధోరణిని మార్చుకోవాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డిపై మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రేవంత్



రెడ్డి జెడ్పీటీసీ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి తన కష్టంతో ముఖ్యమంత్రి అయ్యారని, కానీ కేటీఆర్ మాత్రం కేవలం తన తండ్రి కేసీఆర్ వల్లనే రాజకీయాల్లో పదవులు అనుభవిస్తున్నారని బలరాం నాయక్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో రేవంత్ రెడ్డిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, వాటన్నింటినీ తట్టుకొని ఆయన నిలబడ్డారని గుర్తు చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవారా? కేటీఆర్ మంత్రి పదవి చేపట్టేవారా? అని ఆయన నిలదీశారు. తెలంగాణను కేసీఆర్ ఒక్కరే తీసుకురాలేదని, నాటి కాంగ్రెస్ ఎంపీలంతా కలిసి సోనియా గాంధీని ఒప్పించడం వల్లే రాష్ట్రం సిద్ధించిందని బలరాం నాయక్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణకు చెందిన ఐదు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపేశారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు తమ భాషను మార్చుకోకపోతే, కాంగ్రెస్ శ్రేణులు అదే స్థాయిలో స్పందిస్తాయని, అప్పుడు ఆ భాషను తట్టుకోవడం వారి వల్ల కాదని ఎంపీ హెచ్చరించారు.

# ఉంగుటూరులో వైసీపీ ఖాళీ..

### ❖ ఎమ్మెల్యే ధర్మరాజు సమక్షంలో భారీగా చేరికలు

**ఏలూరు (ఏడీఎన్ఎన్):**

పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన పార్టీ రాజకీయంగా మరింత బలోపేతం అవుతోంది. గత ఎన్నికల్లో జిల్లాలో క్లీన్ స్వీప్ చేసిన జనసేన, ప్రస్తుతం పార్టీని సంస్థాగతంగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన పార్టీలోకి భారీగా చేరికలు సాగాయి. ఉంగుటూరు మండలం వెల్లిమిల్లి గ్రామానికి చెందిన వైసీపీ కీలక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట ధర్మరాజు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన ముఖ్య నేతలు జనసేన కండువా కప్పుకున్నారు. మాజీ సర్పంచ్ మెడవంకుల రత్తయ్యతో పాటు, ఆ పార్టీలో కీలక పాత్ర పోషించిన అల్లంశెట్టి సాయికుమార్,



కిక్ శెట్టి వెంకటేశ్వరరావు వంటి నేతలు జనసేనలో చేరారు. వీరితో పాటు 30 మంది ముఖ్య కార్యకర్తలు కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలో చేరడం గమనార్హం. క్షేత్రస్థాయిలో పట్టున్న నాయకులు పార్టీని వీడటంతో ఉంగుటూరులో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పత్సమట ధర్మరాజు మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై ప్రజలు, నాయకులు జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా రంజక పాలన పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, అందుకే స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీని మరింత పటిష్టం చేస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో వెల్లిమిల్లి వంటి గ్రామాల్లో బలమైన కేడర్ ఉన్న నేతలు జనసేనలో చేరడం ఆ పార్టీకి రాజకీయంగా పెద్ద ఊరటనిస్తోంది. ఎన్నికల తర్వాత కూడా వలసలు కొనసాగుతుండటం జిల్లాలో జనసేన గ్రాఫ్ పెరుగుతోందనడానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చేరికల కార్యక్రమం వెల్లిమిల్లి పరిసర ప్రాంతాల్లో జనసేన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# హైకోర్టు సీరియస్.. ప్రభుత్వం సైలెంట్!

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

హైకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా, వివాదాస్పద పోలీస్ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావుకు కూటమి ప్రభుత్వం తిరిగి పోస్టింగ్ ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో హైకోర్టు సిబ్బందిపై దాడి చేసిన కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆయనను మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం రహస్యంగా ఉత్తర్వులు జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. న్యాయస్థానం ఆగ్రహానికి గురైన అధికారికి మళ్లీ కీలక బాధ్యతలు అప్పగించడంపై పోలీసు, న్యాయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో మంగళగిరి రూరల్ సీఐగా పనిచేసిన సమయంలో యార్లగడ్డ శ్రీనివాసరావు తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. హైకోర్టుకు చెందిన ఓ డ్రైవర్‌పై ఆయన భౌతిక దాడికి పాల్పడటంతో, ఈ విషయాన్ని న్యాయస్థానం




అత్యంత సీరియస్‌గా తీసుకుంది. సీఐ ప్రవర్తనపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన హైకోర్టు, ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అప్పట్లో ప్రభుత్వం ఆయనను విధులకు దూరం చేస్తూ వెయిటింగ్ లో ఉంచింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆయనకు మళ్లీ విధుల్లో అవకాశం కల్పించడం గమనార్హం. పోస్టింగ్ పొందిన వెంటనే సీఐ శ్రీనివాసరావు రాజకీయంగా కూడా చర్చల్లో నిలిచారు. మార్టూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన, పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, రాజకీయ అండదండలతోనే ఆయనకు మళ్లీ పోస్టింగ్ దక్కిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాన్ని రక్షించాల్సిన పోలీస్ అధికారి, న్యాయవ్యవస్థ సిబ్బందిపైనే దాడి చేసి కేసుల్లో ఉన్నా.. ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. హైకోర్టు ఆదేశాలతో కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో, ఇలాంటి వివాదాస్పద అధికారికి పోస్టింగ్ ఇవ్వడం ఏ రకమైన సంకేతాలను ఇస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం, న్యాయస్థానాల నిర్ణయాలను గౌరవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరింత రాజకీయ దుమారం రేపే అవకాశం కనిపిస్తోంది.

# పోలవరానికి 'అమరజీవి' పేరు పెట్టాలి..

### ❖ సీఎం చంద్రబాబుకు నాగబాబు విన్నపం

**మంగళగిరి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు ఆంధ్ర రాష్ట్ర సాధకుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెనుగొండ సుబ్బారాయుడు నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన వారితో నాగబాబు ప్రతిజ్ఞ చేయించారు.



తర్వాత ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అందుకే రాష్ట్ర స్థాయి పథకాలకు వారి పేర్లు పెట్టాలని ప్రజా ప్రతినిధులంతా కలిసి ప్రభుత్వానికి వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంపై నాగబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్లలో ప్రతి పథకానికీ ఒక్క 'జగనన్న' పేరు మాత్రమే తగిలించారని, కానీ కూటమి ప్రభుత్వం ఆ సంస్కృతికి ముగింపు పలికిందని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలకు తాగునీరు అందించే పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పోలవరం ప్రాజెక్టుకు కూడా పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కోరారు.

# ముఫ్తీ అబ్దుల్ వహాబ్ మృతి, వైఎస్ జగన్ సంతాపం

**నెల్లూరు (ఏడీఎన్ఎన్):**

నెల్లూరుకు చెందిన ప్రముఖ ఇస్లామీయ పండితులు, ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ముఫ్తీ అబ్దుల్ వహాబ్ మృతి ముస్లిం సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. సుమారు 60 ఏళ్లకు పైగా ఇస్లాం ధర్మ ప్రచారానికి , విద్యా రంగానికి అంకితమైన ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ ధర్మ ప్రచారంలో చేసిన సుదీర్ఘ సేవలను వైఎస్ జగన్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం కేవలం నెల్లూరు జిల్లాకే కాకుండా, మొత్తం ముస్లిం సమాజానికి పెద్ద నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాహ్‌ను ప్రా



ర్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ,అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర తబ్లీగ్‌ఎ జమాత్ అధ్యక్షుడిగా, జమీయత్‌ఉలమా గౌరవ అధ్యక్షుడిగా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ సుదీర్ఘ కాలం సేవలందించారు. ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా, విద్యావేత్తగా ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం నుంచి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. సామాజిక మరియు ధార్మిక రంగాల్లో ఆయన వదిలి వెళ్ళిన ముద్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , వైఎస్ జగన్ ఇద్దరూ ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటించడంతో ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ పట్ల ఉన్న గౌరవం , ఆయన సేవలకు ఉన్న గుర్తింపు మరోసారి స్పష్టమైంది. ఆయన లేని లోటు ముస్లిం మత వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



## నగరం బాట పట్టిన ప్రయాణికులు

### టోల్ ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు

**సూర్యపేట (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. వరుస సెలవులు ముగియడంతో సొంత ఊళ్ల నుంచి నగరానికి తిరిగి వస్తున్న ప్రయాణికులతో హైవే అంతా కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా సూర్యపేట జిల్లా కొర్లపహడ్ టోల్ ప్లాజా, యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద పరిస్థితి తీవ్రంగా ఉంది. పంతంగి వద్ద సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

**రద్దీకి కారణాలు:** క్రిస్మస్ పండుగతో పాటు వారాంతపు సెలవులు కలిసి రావడంతో వేల సంఖ్యలో ప్రజలు ఆంధ్రప్రదేశ్, ఖమ్మం ప్రాంతాల నుండి హైదరాబాద్‌కు పయనమయ్యారు. దీనికి తోడు పలు చోట్ల జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు, టోల్ ప్లాజాల వద్ద సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులు ఆలస్యం కావడం ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేసింది. చిట్యాల, చౌటుప్పల్, నార్కట్‌పల్లి వంటి ప్రధాన జంక్షన్ల వద్ద వాహనాలు నత్తనడకన కదులుతున్నాయి.

**పోలీసుల చర్యలు:** ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు హైవే పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బంది రంగంలోకి దిగారు. టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు గేట్లను తెరిచారు. వాహనాలను వేగంగా పంపించేందుకు 'ఫాస్టాగ్' స్కానింగ్‌ను వేగవంతం చేస్తున్నారు. ప్రయాణికులు సహనంతో వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## అసెంబ్లీకి కేసీఆర్ ... ఇక యుద్ధమే అంటున్న బీఆర్ఎస్

### మేమూ సిద్ధమంటున్న అధికారపక్షం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాజకీయాల్లో మరో చారిత్రాత్మక ఘట్టానికి అసెంబ్లీ వేదిక కాబోతోంది. సుమారు ఏడాది కాలంగా సభకు దూరంగా ఉన్న ప్రతిపక్ష నేత కేసీఆర్, ఈసారి శీతాకాల సమావేశాలకు హాజరుకావాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశాల్లో కేసీఆర్ తన గళాన్ని వినిపించేందుకు ఇప్పటికే ఎర్రవల్లి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యంగా కృష్ణా నదీ జలాల కేటాయింపులు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 90 టీఎంసీల నుండి 45 టీఎంసీలకు కుదించారనే ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన పక్కా వ్యూహంతో వస్తున్నారు. కేసీఆర్ రాకతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, గత ప్రభుత్వం చేసిన తప్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ ముందు ఉంచుతామని అధికార కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు, అధికార కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దూకుడుగా ఉంది. సాగునీటి రంగంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, కులగణన సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి కీలక అంశాలపై చర్చకు సిద్ధమవుతోంది. ప్రజా సమస్యలను చర్చించేందుకు కేసీఆర్ సభకు రావాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు, ఇప్పుడు కేసీఆర్ రాక ఒక సమాధానంగా మారుతోంది. ఇక బీజేపీ కూడా రైతుల సమస్యలు, రైతు భరోసా అమలుపై సుదీర్ఘ చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. సామాన్య కార్యకర్తలు మరియు ప్రజలు ఆశించేది ఏమిటంటే, సభలో కేవలం వ్యక్తిగత విమర్శలు కాకుండా రాష్ట్ర ప్రయోజనాలు, నిరుద్యోగం, మరియు అభివృద్ధిపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఏదేమైనా, కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి మధ్య జరగబోయే ఈ వాడీవేడి పోరుతో తెలంగాణ అసెంబ్లీలో రాజకీయ వాతావరణం దబిడి దిబిడే అనిపిస్తోంది.



## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు యువకులు మృతి

**సంగారెడ్డి (ఏడీఎన్ఎన్):**

సంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నారాయణఖేడ్ శివారులోని నిజాంపేట్‌బీదర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కల్వర్టు కోసం తవ్విన భారీ గుంతలో పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. నిజాంపేట్‌బీదర్ మధ్య కొత్తగా నిర్మిస్తున్న 161బి జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఒక చోట కల్వర్టు నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు గుంతను తవ్వి వదిలేశారు. చీకటిలో ఆ గుంతను గమనించని బైక్ ప్రయాణికులు వేగంగా వచ్చి నేరుగా అందులో పడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఆవుటి నర్సింహులు (27), జిన్న మల్లేశ్ (24), జిన్న మహేశ్ (23) అక్కడికక్కడే మృతిచెందారు. నరసాపూర్‌లో విషాద ఛాయలు: మృతులను నారాయణఖేడ్ మండలం నర్సాపూర్ గ్రామస్థులుగా పోలీసులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే పనుల వద్ద కనీస హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## చరిష్మకు గోల్డ్..
# టీమ్ ఈవెంట్‌లో సిల్వర్!
### క్రీడాకారులను అభినందించిన సీఎం

**విజయవాడ (ఏడీఎన్‌ఎన్):**

విజయవాడలో జరిగిన 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2025లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సరికొత్త చరిత్ర సృష్టించారు. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు జాతీయ స్థాయిలో తొలిసారిగా సిల్వర్ మెడల్ (రజత పతకం) సాధించి రికార్డు సృష్టించింది. రాష్ట్ర జట్టు సమిష్టి కృషితో సాధించిన ఈ అసాధారణ విజయంతో ఏపీ క్రీడా చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళల సింగిల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి సూర్య చరిష్మ తారిణి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఫైనల్ పోరులో తన అసాధారణ ప్రతిభను చాటిన చరిష్మ, స్వర్ణ పతకాన్ని (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుని రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసింది. హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా హేమాహేమీలు పాల్గొన్నప్పటికీ, ఆమె పట్టుదలగా ఆడి విజయం సాధించడం విశేషం. ఈ ఘనత సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్ఫూర్తిగా అభినందించారు. నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టు రజత పతకం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఇది మన క్రీడాకారుల కష్టానికి దక్కిన సరైన గుర్తింపు అని కొనియాడారు. ముఖ్యంగా గోల్డ్ మెడల్ సాధించిన సూర్య చరిష్మ తారిణిని ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఆమె మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రానికి చెందిన క్రీడాకారిణులు ఇలాంటి విజయాలతో వెలిగిపోతుండటం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. క్రీడల్లో రాష్ట్ర యువతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సొంత గడ్డపై జరిగిన ఈ పోటీల్లో ఏపీ జట్టు విజయఢంకా మోగించడంతో క్రీడాకారులు, క్రీడాభిమానుల సంబరాలు మిన్నంటాయి.



# గంభీర్‌కు బీసీసీఐ మద్దతు
### కోచ్ మార్పు వార్తలను కొట్టిపారేసిన బోర్డు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

భారత టెస్ట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ భవితవ్యంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి తెరదించింది. గంభీర్ స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమిస్తారనే వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని బోర్డు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి కోచ్ మార్పుపై ఎలాంటి చర్చలు జరగలేదని, అటువంటి ప్రతిపాదన తమ ముందు లేదని బీసీసీఐ ఉన్నతాధికారులు వెల్లడించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా సొంత గడ్డపైనే వైట్‌వాష్‌కు గురవ్వడం క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. దాదాపు 12 ఏళ్ల తర్వాత భారత్ స్వదేశంలో సిరీస్ కోల్పోవడంతో, గంభీర్ కోచింగ్ శైలిపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంభీర్ చేస్తున్న అతి ప్రయోగాలు జట్టు ఫలితాలపై ప్రభావం చూపుతున్నాయని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే గంభీర్‌ను తప్పించి, ఎన్.సి.ఎ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను కోచ్‌గా నియమిస్తారనే పుకార్లు షికారు చేశాయి. కేవలం కొన్ని ఓటముల ఆధారంగా కోచ్‌ను మార్చే ఆలోచన లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం జట్టులో సీనియర్ ఆటగాళ్లు తప్పుకుని యువతకు అవకాశం కల్పిస్తున్న 'పరివర్తన దశ' నడుస్తోందని, ఇలాంటి సమయంలో ఫలితాలు రావడానికి కొంత సమయం పడుతుందని బోర్డు అభిప్రాయపడింది. గంభీర్‌కు తన ప్రణాళికలను అమలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## మార్కెట్ క్యాప్‌లో
# 'వెండి' సునామీ

**మొదటి పేజీ తరువాయి...**

ట్రిలియన్ డాలర్ల విలువ కలిగిన ఎన్విడియా ను కూడా అధిగమించి, బంగారం తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆస్తిగా అవతరించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బంగారం 31.598 ట్రిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, వెండి దాని తర్వాతి స్థానం కోసం పోటీ పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో వెండి ధరలు చారిత్రాత్మక గరిష్ఠాలను తాకడమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణం. శుక్రవారం కామెక్స్ మార్కెట్‌లో వెండి ధర ఔన్స్‌కు 75 డాలర్ల మార్కును దాటి కొత్త రికార్డును సృష్టించింది. కేవలం అంతర్జాతీయ మార్కెట్లోనే కాకుండా భారత్‌లోనూ దీని జోరు స్పష్టంగా కనిపిస్తోంది. దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో కిలో వెండి ఫ్యూచర్స్ ధర ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఏకంగా రూ. 2,33,115లకు చేరి సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. గతేడాది డిసెంబర్‌లో కిలో రూ. 91,600గా ఉన్న వెండి ధర, ఈ ఏడాది నాటికి ఏకంగా 153 శాతానికి పైగా పెరగడం విశేషం. ఈ అసాధారణ ర్యాలీపై ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు చూస్తుంటే వెండి త్వరలోనే ఎన్విడియా కార్పొరేషన్‌ను అధిగమించి రెండో స్థానానికి చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ధరల మధ్య ఉన్న భారీ వ్యత్యాసం, ముఖ్యంగా కామెక్స్ మరియు షాంఘై ఎక్స్ఛేంజ్‌ల మధ్య ధరల తేడా సుమారు 7 డాలర్లకు చేరడం వెండికి మరింత కలిసి వచ్చే అంశమని ఆయన వివరించారు. ఇదే జోరు కొనసాగితే పెట్టుబడిదారులకు వెండి అత్యంత లాభదాయకమైన ఆస్తిగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వెండికి ఉన్న పారిశ్రామిక డిమాండ్, సోలార్ ప్యానెల్స్ మరియు ఎలక్ట్రిక్ వాహన రంగాల్లో దీని వాడకం పెరుగుతుండటం కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే బంగారం ధర సుమారు 80 శాతం పెరిగి రూ. 1,39,233 (10 గ్రాములు) వద్ద కొనసాగుతుండగా, వెండి మాత్రం దానికి రెట్టింపు స్థాయిలో 153 శాతం పైగా వృద్ధిని కనబరిచింది. దీంతో తక్కువ కాలంలోనే అత్యధిక లాభాలను తెచ్చిపెట్టే 'వైట్ మెటల్'గా వెండి తన సత్తా చాటుతోంది.

# రికార్డుల రాణి స్మృతి మంధాన

- మహిళా క్రికెట్‌లో సరికొత్త చరిత్ర
- 10 వేల పరుగుల మైలురాయిని చేరిన రెండో భారతీయురాలు
- ప్రపంచంలోనే వేగవంతమైన బ్యాటర్‌గా రికార్డు!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

భారత మహిళా క్రికెట్ వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్ లో అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించారు. శ్రీలంకతో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఆమె 10 వేల అంతర్జాతీయ పరుగుల ఘనతను అందుకున్నారు. తద్వారా భారత దిగ్గజం మిథాలీ రాజ్ తర్వాత ఈ




మైలురాయిని చేరిన రెండో భారతీయ క్రీడాకారిణిగా స్మృతి చరిత్రకెక్కారు. ఓవరాల్‌గా ప్రపంచ మహిళా క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన నాలుగో బ్యాటర్‌గా ఆమె నిలిచారు. కేవలం 281 ఇన్నింగ్స్ ల్లోనే స్మృతి ఈ రికార్డును అందుకోవడం విశేషం. గతంలో మిథాలీ రాజ్ 291 ఇన్నింగ్స్ ల్లో ఈ ఘనత సాధించగా, స్మృతి 10 ఇన్నింగ్స్ లు ముందుగానే ఆ రికార్డును తన పేరున లిఖించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ ఇన్నింగ్స్ ల్లో 10 వేల పరుగులు చేసిన ఏకైక మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన ఇప్పుడు అగ్రస్థానంలో నిలిచారు. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచులో కేవలం 20 బంతుల్లోనే అవసరమైన 27 పరుగులు చేసి ఆమె ఈ అద్భుత మైలురాయిని చేరుకున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ లో అత్యధిక పరుగులు చేసిన మహిళల జాబితాలో మిథాలీ రాజ్ (10,868), సూజీ బేట్స్ (10,652), షార్లెట్ ఎడ్వర్డ్స్ (10,273) మాత్రమే స్మృతి కంటే ముందున్నారు. ఇదే సిరీస్‌లో టీ20ల్లో 4 వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారతీయ బ్యాటర్‌గా కూడా ఆమె రికార్డు సృష్టించడం విశేషం. ప్రస్తుత ఫామ్‌ను చూస్తుంటే త్వరలోనే ఆమె ప్రపంచంలోనే అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# సబలెంకపై నిక్ కిర్గియోస్ ఘనవిజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

దశాబ్దాల కాలం తర్వాత టెన్నిస్ ప్రపంచం మరోసారి 'బ్యాటిల్ ఆఫ్ సెక్సెస్' పోరుకు సాక్ష్యమిచ్చింది. పురుషుల శక్తికి, మహిళల టెక్నిక్‌కు మధ్య జరిగిన ఈ ఆసక్తికర పోరులో ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ నిక్ కిర్గియోస్ పైచేయి సాధించారు. ప్రపంచ నంబర్ వన్ మహిళా క్రీడాకారిణి అరీనా సబలెంకతో జరిగిన ఈ ప్రత్యేక మ్యాచ్‌లో కిర్గియోస్ వరుస సెట్లలో విజయం సాధించి తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నారు. మహిళా క్రీడాకారిణికి అనుకూలంగా ఈ మ్యాచ్ కోసం నిబంధనల్లో కొన్ని మార్పులు చేశారు. సబలెంక వైపు కోర్టు పరిమాణాన్ని తగ్గించడంతో పాటు, సర్వీస్ విషయంలోనూ కొన్ని సడలింపులు ఇచ్చారు. అయినప్పటికీ కిర్గియోస్ తన



పవర్‌ఫుల్ షాట్లతో సబలెంకను ఉక్కిరిబిక్కిరి చేశారు. తొలి రెండు సెట్లను 36, 36 తేడాతో సునాయాసంగా కైవసం చేసుకున్నారు. రెండో సెట్ ఆరంభంలో సబలెంక పుంజుకునే ప్రయత్నం చేసినా, కిర్గియోస్ అనుభవం ముందు ఆమె పోరాటం ఫలించలేదు. ఓటమి చెందినప్పటికీ, ఈ మ్యాచ్ తనకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చిందని సబలెంక వ్యాఖ్యానించారు. పురుష క్రీడాకారుడితో, అది కూడా భిన్నమైన కోర్టు సైజులో ఆడటం సవాలుతో కూడుకున్నదని ఆమె పేర్కొన్నారు. నిక్ కిర్గియోస్ అద్భుతంగా ఆడాడని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కుదిరితే మరోసారి అతనితో తలపడాలని ఉందని ఆమె తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ మ్యాచ్ టెక్నిక్ కంటే శారీరక బలానికే ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు.

# ఆధార్ కార్డు మార్పుపై కేంద్రం సంచలన నిర్ణయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

దేశవ్యాప్తంగా ఉన్న ఆధార్ నమోదు, అప్‌డేట్ కేంద్రాల సంఖ్యను భారీగా పెంచాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) నిర్ణయించింది. ప్రస్తుతం దేశంలో కేవలం 88 పూర్తి స్థాయి కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటిని సెప్టెంబర్ 2026 నాటికి 473కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని యూఐడీఏఐ సీఈఓ భువనేష్ కుమార్ అధికారికంగా వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల ఆధార్ సేవలు పొందాలనుకునే, లక్షలాది మంది పౌరులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఇది పెద్ద ఊరటగా మారుతుంది. చిన్న పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను పోస్ట్ ఆఫీసుల్లోనే పూర్తి చేసే సదుపాయం ఉంది. కానీ వయసు పైబడిన వారు కొత్తగా ఆధార్ తీసుకోవాలన్నా, మార్పులు చేసుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన కేంద్రాలు లేకపోవడం వల్ల చాలా మంది ప్రజలు తమ జిల్లాలు దాటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త కేంద్రాల ఏర్పాటుతో ఈ ప్రయాణ భారం తగ్గుతుంది. ఆధార్ కార్డు అనేది ఇప్పుడు ప్రతి వ్యక్తికి అత్యవసరమైన పత్రం కాబట్టి,, ఈ సేవలను




ప్రజల చెంతకు చేర్చడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఆధార్ కార్డులో కొన్ని మార్పులను ఆన్‌లైన్ ద్వారా ఇంట్లో కూర్చునే చేసుకోవచ్చు. చిరునామా వంటి వివరాలకు ఈ సదుపాయం అందుబాటులో ఉంది. అయితే బయోమెట్రిక్ వివరాలు అంటే వేలిముద్రలు, కంటి స్కాన్ అప్‌డేట్ చేయడానికి కచ్చితంగా ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సిందే. అలాగే పేరు మార్పులు చేయాలన్నా లేదా ఫోటో మార్చాలన్నా అధికారుల సమక్షంలోనే ప్రక్రియ పూర్తి చేయాలి. ఇలాంటి సేవలన్నీ కొత్తగా ఏర్పాటు చేసే 473 కేంద్రాల్లో పూర్తి స్థాయిలో లభిస్తాయి. ఇటీవలి కాలంలో అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. అందుకే కొత్తగా ఆధార్ దరఖాస్తు చేసుకునే వారి విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేశారు. జిల్లా యంత్రాంగం దరఖాస్తుదారుడి వివరాలను నిశితంగా పరిశీలిస్తుంది. వారు భారత్‌లో నివసిస్తున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతే ఆధార్ జారీ చేస్తారు. విదేశీయులు భారత్‌లో నివసిస్తుంటే వారికి ఆధార్ పొందే హక్కు ఉంటుంది కానీ అది పౌరసత్వానికి నిదర్శనం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.చివరగా ఆధార్ సేవల విస్తరణ అనేది డిజిటల్ ఇండియా దిశగా మరో ముందడుగు. ఆధార్ కేంద్రాల సంఖ్య పెరగడం వల్ల తప్పుడు దరఖాస్తులను అరికట్టడంతో పాటు నిజమైన లబ్ధిదారులకు వేగంగా సేవలు అందుతాయి. సెప్టెంబర్ 2026 నాటికి ఈ కేంద్రాలన్నీ అందుబాటులోకి వస్తే సామాన్య ప్రజల కష్టాలు తీరుతాయి. ఆధార్ అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు అది ప్రభుత్వ పథకాలు పొందడానికి ఒక బలమైన వారధి. ఈ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి.

# బ్యాంకులకు ఆర్థిక శాఖ కీలక ఆదేశాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలతో సహా, ఇతర ఆర్థిక సంస్థలలో పనిచేస్తున్న డైరెక్టర్ల ప్రవర్తనపై ఆర్థిక మంత్రిత్వ శాఖ కఠినమైన నిబంధనలు జారీ చేసింది. బోర్డు స్థాయి అధికారులకు సంబంధించిన విజిలెన్స్ వ్యవహారాలను, ఎప్పటికప్పుడు కేంద్రానికి నివేదించాలని స్పష్టం చేసింది. ఉన్నత స్థాయి అధికారులపై వచ్చే ప్రతికూల అంశాలను చాలా సంస్థలు గోప్యంగా ఉంచుతున్నట్లు ఆర్థిక సేవల విభాగం గుర్తించింది. ఇటువంటి సమాచారం బయటకు రాకపోవడం వల్ల, నియామక ప్రక్రియలో పారదర్శకత దెబ్బతింటోందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఇకపై జాప్యం లేకుండా వివరాలు వెల్లడించాలని ఆదేశించింది. సాధారణంగా ఉన్నతాధికారులపై వచ్చే ప్రైవేట్ ఫిర్యాదులు, కోర్టు వ్యాఖ్యలు లేదా దర్యాప్తు సంస్థల నుంచి వచ్చే సమాచారాన్ని సంస్థలు దాచిపెడుతున్నాయి. కేవలం విజిలెన్స్ క్లియరెన్స్ అవసరమైనప్పుడు మాత్రమే ఈ వివరాలను వెల్లడించడంపై మంత్రిత్వ శాఖ అసహనం వ్యక్తం చేసింది. కొన్ని సందర్భాల్లో విజిలెన్స్ ఫారమ్‌లలో ప్రత్యేక నిలువు వరుస లేదనే సాకుతో కీలక విషయాలను వదిలేస్తున్నట్లు అడ్వైజరీలో పేర్కొన్నారు. నియామకాలు, పదోన్నతులు, బోర్డు స్థాయి పోస్టింగ్‌ల విషయంలో ఇటువంటి సమాచారాన్ని దాచడం చాలా ప్రమాదకరం. ఉన్నతాధికారుల చిత్తశుద్ధిని పరిశీలించడంలో



ఇది ప్రధాన అడ్డంకిగా మారుతోంది. బోర్డు స్థాయి అధికారులు ప్రస్తుత పదవిలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, గతంలో ఇతర హోదాల్లో చేసిన పొరపాట్లను కూడా నివేదించాలని కేంద్రం ఆదేశించింది. అంతర్గత కమిటీల విచారణలు, ఆడిట్ అభ్యంతరాలు, ట్రిబ్యునల్ ఆదేశాల వంటి సమగ్ర వివరాలను నివేదికలో చేర్చాలి. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఏ ఒక్క చిన్న విషయాన్ని కూడా విస్మరించకూడదని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ నిర్ణయం వల్ల ఉన్నత స్థాయి నియామకాల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. బ్యాంకింగ్ రంగంలో అవినీతిని అరికట్టడానికి ఇది ఒక కీలక అడుగు. ఇటీవల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన పంకజ్ ద్వివేది విషయంలో ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టులో ఉన్న ఒక కేసు కారణంగా ఆయనను జనరల్ మేనేజర్ స్థాయికి తగ్గించి పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు పంపారు. విజిలెన్స్ క్లియరెన్స్ లేకుండానే ఆయనకు పదోన్నతి కల్పించడం నిబంధనలకు విరుద్ధమని కోర్టులో ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి సంఘటనలు ప్రభుత్వ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తాయి. అందుకే ఇకపై ప్రతి చిన్న ప్రతికూల అంశాన్ని కూడా తనిఖీ చేయాలని కేంద్రం పట్టుబట్టింది. ఉన్నత పదవుల్లో ఉండేవారు మచ్చలేని వారుగా ఉండాలని స్పష్టం చేస్తోంది. ఈ కొత్త మార్గదర్శకాలు ప్రభుత్వ ఆర్థిక సంస్థల్లో పారదర్శకతను పెంచుతాయి. బ్యాంకుల్లో ఉన్నత స్థాయి పదవులను పొందే అభ్యర్థుల చరిత్రను పూర్తిగా పరిశీలించడానికి ఇవి తోడ్పడతాయి. విజిలెన్స్ క్లియరెన్స్ ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేయడం ద్వారా సమర్థులైన అధికారులకు మాత్రమే గుర్తింపు లభిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే బ్యాంకుల్లో నీతివంతమైన పాలన అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలను అతిక్రమించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఈ హెచ్చరిక ద్వారా స్పష్టమవుతోంది. తద్వారా సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఆర్థిక సంస్థలపై నమ్మకం పెరుగుతుంది.

# వారానికి 70 గంటలు పని చేయాల్సిందే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

దేశీయ ఐటీ దిగ్గజ కంపెనీల్లో ఇన్ఫోసిస్ ఒకటి. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ నారాయణ మూర్తి, కొద్ది నెలల క్రితం వారానికి 70 గంటల పాటు ఉద్యోగులు పని చేయాలని సూచించిన సంగతి తెలిసిందే. ఉద్యోగులు ఎక్కువ గంటలు పని చేసినప్పుడే చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలతో, భారత్ పోటీ పడగలదని సూచించారు. అప్పుడు ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. చాలా మంది ఎక్కువ పని గంటలను తోసిపుచ్చారు. అయితే, తాజాగా ఇన్ఫోసిస్ సంస్థ సహ వ్యవస్థాపకుల్లో మరొకరైన ఎస్‌డీ శిబులాల్ 70 గంటల పని విషయంపై మాట్లాడారు. ప్రతి వారం ఎక్కువ గంటలు పనిలో ఉండడం కన్నా చేసే పనిపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యమని ఎస్‌డీ శిబులాల్ తెలిపారు. ఎక్కువ సమయం పని చేయడం కన్నా, ఆ పనిలో నాణ్యత చాలా ప్రధానమని ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎస్‌డీ శిబులాల్ తెలిపారు. ఇటీవలే ముంబైలో ఐఐ



ఎంయూఎన్ నిర్వహించిన ఒక ప్రజా బహిరంగ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా, 70 గంటల పనిదినాలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం నేను ఇక్కడ కూర్చుని ఉన్నా. ఇక్కడే ఉండాలి తప్ప పరధ్యానంగా ఉండకూడదని సూచించారు. నా మొబైల్ ఫోన్‌లో నన్ను నేను పరధ్యానంలో ఉంచలేను. నేను మరో ఇతర ఆలోచనల తోనూ పరధ్యానంలో ఉండను. నా మైండ్‌లో ఉంది ఒకటే. ఎక్కువ సమయం గడిపే కన్నా పనిలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని శిబులాల్ వెల్లడించారు. గతంలో మూడేళ్ల పాటు ఇన్ఫోసిస్ కంపెనీ సీఈఓగా ఎస్‌డీ శిబులాల్ పనిచేశారు. సమయ పాలనలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు, ప్రాధాన్యాలు వారికి ఉంటాయని అన్నారు. వ్యక్తిగత, వృత్తిగత, ప్రజా జీవితం మధ్య సమయాన్ని కేటాయించేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం ఉంటుందన్నారు. వారి అవసరాల మేరకు ప్రాధాన్యతలు మారతాయని తెలిపారు. అయితే కేటాయించుకున్న సమయంలో మాత్రం అక్కడే వంద శాతం జీవించాలని సూచించారు. గతంలో వారినికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి సూచించారు, ఆ తర్వాత 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ సలహా ఇచ్చారు. వీరి ఆలోచనలను చాలా మంది వ్యతిరేకించారు. తాజాగా ఇన్ఫోసిస్ లోనే మరో వ్యవస్థపక సభ్యులు శిబులాల్ సైతం వారి వ్యాఖ్యలను వ్యతిరేకించారు.




# నాలుగో టీ20 మనదే

- సిరీస్‌లో 4-0తో టీమ్ ఇండియా హవా
- రెచ్చిపోయిన ఓపెనర్లు..
- రిచా ఘోష్ మెరుపులు

**కొలంబో (ఏడీఎన్‌ఎన్):**

భారత మహిళా క్రికెట్ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. శ్రీలంకతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 4-0తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత బ్యాటర్లు పరుగుల విధ్వంసం సృష్టించడంతో శ్రీలంక ముందు 222 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. లంక బౌలర్లను ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ తొలి వికెట్‌కు ఏకంగా 162 పరుగులు జోడించారు. ఈ క్రమంలోనే స్మృతి మంధాన మహిళల క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తి చేసిన నాలుగో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించింది. షెఫాలీ వర్మ వరుసగా మూడో హాఫ్ సెంచరీతో మెరిసింది. ఆఖర్లో రిచా ఘోష్ కేవలం 16 బంతుల్లోనే 40 పరుగులు చేసి స్కోరును 221కి చేర్చింది. భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక గట్టిగానే ప్రయత్నించింది. కెప్టెన్ చమరి ఆటపట్టు (52) హాఫ్ సెంచరీతో రాణించగా, హాసిని పెరీరా (33) పర్వాలేదనిపించింది. అయితే భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి లంకను కట్టడి చేశారు. శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 191 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో అరుంధతి, వైష్ణవి శర్మ రెండేసి వికెట్లతో రాణించారు. అద్భుత ప్రదర్శన చేసిన స్మృతి మంధాన మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించింది.

# రొనాల్డో 'డబుల్' ధమాకా

- అల్-నాజర్ అద్భుత విజయం!
- 956 గోల్స్ తో రొనాల్డో సరికొత్త రికార్డు..
- మెస్సీ కంటే 60 గోల్స్ ఆధిక్యంలో సీఆర్7

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**



ఫుట్‌బాల్ ప్రపంచంలో తన ముద్రను మరింత బలంగా వేస్తూ క్రిస్టియానో రొనాల్డో మరో అద్భుత ప్రదర్శన చేశారు. సౌదీ ప్రో లీగ్‌లో భాగంగా అల్ అఖ్దూద్‌తో జరిగిన పోరులో రొనాల్డో రెండు గోల్స్ తో చెలరేగిపోవడంతో అల్‌నాజర్ జట్టు 30తో ఘనవిజయం సాధించింది. రొనాల్డోతో పాటు జావో ఫీలిక్స్ కూడా ఒక గోల్ చేయడంతో ప్రత్యర్థి జట్టుకు కోలుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ విజయంతో అల్‌నాజర్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆడిన 10 మ్యాచుల్లోనూ 30 పాయింట్లతో ఈ జట్టు తన ఆధిపత్యాన్ని చాటుతోంది. రొనాల్డో ఈ మ్యాచులో చేసిన రెండు గోల్స్ తో అతని కెరీర్ మొత్తం గోల్స్ సంఖ్య 956కు చేరింది. తద్వారా తన చిరకాల ప్రత్యర్థి, మరో లెజెండ్ లియోనెల్ మెస్సీ కంటే 60 గోల్స్ ఆధిక్యంలో రొనాల్డో నిలిచారు. ప్రస్తుతం మెస్సీ అమెరికాలోని మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మియామీ తరఫున ఆడుతున్న సంగతి తెలిసిందే.



## హైదరాబాద్ మెట్రోలో మద్యం అనుమతిపై
# మార్గదర్శకాలివే!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్):**

మెట్రో రైలులో తీసుకెళ్లిన రెండు మద్యం సీసాలను అనుమతిస్తూ ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో, హైదరాబాద్ మెట్రోలో కూడా ఇలాంటి అవకాశం ఉంటుందని హైదరాబాద్ మద్యం ప్రియులు భావిస్తున్నారు. కానీ, హైదరాబాద్‌లో ఆ నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. తెలంగాణ ప్రభుత్వం లేదా మెట్రో అధికారులు, ఇప్పటివరకు మద్యం రవాణాకు ఎటువంటి వెసులుబాటు కల్పించలేదు. ఇతర నగరాల్లో ఉన్న నిబంధనలు ఇక్కడ వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రవాణా వ్యవస్థలో భద్రతాపరమైన నిబంధనలు కఠినంగా ఉన్నాయి. సాధారణంగా రైల్వే శాఖ లేదా ఇతర రవాణా మార్గాల్లో ఉండే నిబంధనలకు మెట్రో నిబంధనలకు చాలా తేడా ఉంటుంది. ముఖ్యంగా మద్యం రవాణా విషయంలో హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ స్పష్టమైన మార్గదర్శకాలను అమలు చేస్తోంది.మద్యం సేవించి మెట్రోలో ప్రయాణించడం పెద్ద నేరంగా పరిగణిస్తారు. ఎవరైనా మద్యం మత్తులో ఉండి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. స్టేషన్ ప్రాంగణంలో గానీ, రైలు లోపల గానీ మద్యం సేవించడం చట్టరీత్యా నేరం. మెట్రో రైల్వే చట్టం 2002 లోని సెక్షన్ 59 ప్రకారం ఇలాంటి పనులు చేసిన వారికి భారీ జరిమానాలు విధిస్తారు. అవసరమైతే జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంటుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు ఈ విషయంలో రాజీ పడరు. చాలా మంది ప్రయాణికులు పార్టీలకు వెళ్లేటప్పుడు లేదా పండుగల సమయంలో, మద్యం కొనుగోలు చేసి మెట్రోలో వెళ్లాలని ప్లాన్ చేస్తారు. అలాంటి వారు ఖచ్చితంగా ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను చూసుకోవాలి. ఆటోలు లేదా క్యాబ్ సర్వీసుల ద్వారా మద్యం సీసాలను తీసుకువెళ్లవచ్చు. కానీ, మెట్రోలో మాత్రం ఇది అసాధ్యం. అదుపు తప్పిన ప్రవర్తన వల్ల ఇతర ప్రయాణికులకు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉండటంతోనే ఈ ఆంక్షలు పెట్టారు. సామాన్య ప్రజల భద్రతకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోంది.ఒకవేళ మీరు అనుకోకుండా మద్యం సీసాతో మెట్రో స్టేషన్‌కు వెళ్తే, అక్కడి అధికారులతో వాగ్వాదానికి దిగడం మంచిది కాదు. నిబంధనల ప్రకారం, వారు తమ విధిని నిర్వర్తిస్తారు. ఇలాంటి సమయాల్లో నిబంధనలను గౌరవించి సహకరించాలి. అక్రమంగా మద్యం తరలించడానికి ప్రయత్నిస్తే భద్రతా సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఇది మీ ప్రయాణాన్ని ఆలస్యం చేయడమే కాకుండా చట్టపరమైన సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి ప్రయాణానికి ముందే అన్ని విషయాలు తెలుసుకోవాలి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం సురక్షితంగా సాగాలంటే ఈ నియమ నిబంధనలను ప్రయాణికులు తప్పకుండా పాటించాలి. మద్యం, నిషేధిత వస్తువులను దూరంగా ఉంచడం వల్ల ప్రయాణికులు సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. నగర రవాణా వ్యవస్థను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. భవిష్యత్తులో నిబంధనలు మారితే తప్ప, ప్రస్తుతానికి మెట్రోలో మద్యం తీసుకువెళ్లడం పూర్తిగా నిషిద్ధం. ప్రయాణానికి సిద్ధమయ్యే ముందే ప్రయాణికులు ఈ విషయాలను గమనించి తదనుగుణంగా ప్రయాణికులు ప్లాన్ చేసుకోవడం ఉత్తమం.

మనసర్కార్
సోమవారం | హైదరాబాద్
29.12.2025
www.manasarkar.com



## సల్మాన్ పుట్టినరోజు వేడుకకు హాజరైన రామ్‌చరణ్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ 60వ పుట్టినరోజు వేడుకకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హాజరయ్యారు. స్టార్‌లతో నిండిన ఈ వేడుకకు రామ్ చరణ్ హాజరుకావడం ఈవెంట్ ని మరింత స్పెషల్ గా మార్చింది. రామ్ చరణ్ సింపుల్, క్లాసీ లుక్‌లో అదరగొట్టారు. సాఫ్ట్ కలర్స్ తో కూడిన క్లీన్ అవుట్‌ఫిట్‌లో నేచురల్ స్టైల్‌తో అలరించారు. ఆయన స్టైల్, స్వాగ్ హైలైట్‌గా నిలిచాయి. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, ఎంఎస్ ధోనీ, బాబీ డియోల్ కలిసి దిగిన ఫోటో. సినిమా, క్రికెట్ ప్రపంచాలకు చెందిన దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో సహజంగా నవ్వుతూ కనిపించిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయ్యింది. రామ్ చరణ్ – సల్మాన్ ఖాన్‌ల మధ్య ఉన్న స్నేహబంధం ఈ వేడుకలో స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం వృత్తిపరమైన పరిచయమే కాదు, అంతకంటే లోతైన అనుబంధమని ఈ మూమెంట్స్ చాటి చెప్పాయి. మెగా ఫ్యామిలీతో సల్మాన్‌కు ఉన్న సన్నిహిత సంబంధం, చరణ్ ప్రజెన్స్ ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా మార్చింది. రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా చిత్రం 'పెద్ది'తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రేక్షకులు, అభిమానుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేస్తోంది.

## 2న 'ఓ అందాల రాక్షసి' రాబోతోంది..



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రం జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. షెరాజ్ మెహదీ మాట్లాడుతూ .. ఓ అందాల రాక్షసి మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాను. ఒక ఏడాదికి ఓ మంచి సినిమా వస్తుంది. అలాంటి ఓ మంచి సినిమానే మా 'ఓ అందాల రాక్షసి'. అద్భుతమైన కంటెంట్‌తో రాబోతోన్న ఓ మంచి సినిమా. ఆడియెన్స్ కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. మంచి సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు అద్భుతంగా ఉంటాయి. అమ్మాయిలకు నచ్చే చిత్రం అవుతుంది అని అన్నారు. కథ, మాటల రచయిత భాష్య శ్రీ మాట్లాడుతూ ..

ఓ అందాల రాక్షసి' సినిమాకు కథను, మాటల్ని రాశాను. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఓ మంచి ఫీల్‌తో బయటకు వస్తారు. నేటి తరం ఆడపిల్లలు ఎలా ఉండాలనే కాన్సెప్ట్ తో ఈ మూవీని చేశాం. మా హీరో షెరాజ్ గారు అద్భుతంగా నటించారు. డైరెక్టర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, హీరోగా ఇందులో మ్యాజిక్ చేశారు. కృతి వర్మ గారు హిందీలో చాలా ఫేమస్. విహాన్షి చాలా అద్భుతంగా నటించారు. ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది అని అన్నారు. కృతి వర్మ మాట్లాడుతూ ..ఓ అందాల రాక్షసిలో నాకు అవకాశం ఇచ్చిన షెరాజ్ గారికి థాంక్స్. ఆ దేవుడి ఆశీస్సులు, ప్రేక్షకుల సపోర్ట్ తో మా చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను అని అన్నారు. విహాన్షి హెగ్డే మాట్లాడుతూ .. అమ్మాయిల్ని మోసం చేస్తే.. ఆ అందం రాక్షసిగా మారుతుంది. అదే మా 'ఓ అందాల రాక్షసి'. ఈ చిత్రం, కథ నాకు చాలా నచ్చింది. ఈ మూవీ ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

## 'టాక్సిక్' నుంచి ఫస్ట్‌లుక్



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

**రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్:** ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ సినిమాలో ఎలిజిబెత్ పాత్రలో నటిస్తోన్న బాలీవుడ్ బ్యూటీ హుమా ఖురేషి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న హుమా ఖురేషి..టాక్సిక్ ప్రపంచంలోకి అడుగుపెట్టడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఫస్ట్ లుక్‌ను గమనిస్తే..

ఆమె పాత్రలో మిస్టరీ, ఇంటెన్సిటీ అర్థమవుతోంది. 2026లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ మోస్ట్ అవైటెడ్ మూవీపై లేటెస్ట్ గా హుమా ఖురేషి ఫస్ట్ లుక్‌తో బజ్ మరింత పెరిగింది. హుమా ఖురేషి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే ఆమె బ్లాక్ కలర్ డ్రెస్ వేసుకుని ఓ వింటేజ్ బ్లాక్ కారు ముందు నిలుచుని ఉంది. వెనుక మైపు సమాధి రాళ్లు, రాతి దేవదూత విగ్రహాతో శ్మశానం ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ తరహా బ్యాక్‌డ్రాప్ ఒక భయానకమైన వాతావరణాన్ని తలపిస్తోంది. చిత్ర దర్శకురాలు గీతూ మోహన్ దాస్ హుమా ఖురేషి పాత్ర గురించి తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ..'''ఈ పాత్రకు ఎవర్ని ఎంపిక చేయాలా అనేది నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే ఈ క్యారెక్టర్‌లో నటించే వారి నటనా సామర్థ్యం, బలమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఓ డిఫరెంట్ లుక్ తీసుకు రావాల్సి ఉంటుంది. ఎప్పుడైతే హుమా నా ఫ్రేమ్‌లోకి అడుగుపెట్టిందో.. ఆ క్షణం నుంచే ఆమెలో ఏదో ప్రత్యేకమైన, అరుదైన గుణం ఉందని గమనించాను. ఆమె సహజమైన స్టైల్, ఇంటెన్సిటీ, 'ఎలిజబెత్' పాత్రకు ప్రాణం పోసేలా చేసింది. హుమా ఒక అద్భుతమైన నటి.. ఆమె తన పాత్ర ద్వారా ఒక ప్రశ్నలు వేసే, లోతుగా ఆలోచింప చేస్తాయి. సదరు పాత్రను ఎంత గొప్పగా చూపించాలనే సవాల్‌ను కలిగించే నటి. ఈ ప్రయాణంలో ఆమెతో చేసిన చర్చ, మా క్రియేటివ్ జర్నీలో ఎంతో కీలకంగా మారింది. హుమా ఓ టాలెంటెడ్ పవర్ హౌస్. ఈ పాత్రతో ఆమె వెండి తెరపై ఒక డిఫరెంట్, స్ట్రాంగ్, ఎఫెక్టివ్ వ్యక్తిత్వాన్ని ఎలివేట్ చేసింది. ఐ లవ్ యు హుమా ఖురేషి.

## హీరో రోషన్‌తో అల్లు అరవింద్ చిత్రం



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

'చాంపియన్' బ్లాక్‌బస్టర్ విజయంతో యంగ్ హీరో రోషన్ కెరీర్ కీలక మలుపు తిరిగింది. స్వప్న సినిమాస్ సంస్థ భారీ స్థాయిలో నిర్మించిన ఈ స్పోర్ట్స్ డ్రామా భారీ అంచనాలతో విడుదలై, అంచనాలకి మించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ముఖ్యంగా మైఖేల్ పాత్రలో రోషన్ చూపించిన ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్, స్క్రీన్ ప్రెజెన్స్ పై ప్రేక్షకులు, విమర్శకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా గీతా ఆర్ట్స్ అధినేత, అగ్ర నిర్మాత అల్లు అరవింద్ గారు 'చాంపియన్' చిత్రాన్ని వీక్షించి, రోషన్ నటనకు ఎంతగానో ముగ్ధులయ్యారు. ఆయన వ్యక్తిగతంగా రోషన్‌ను అభినందించడమే కాకుండా, తన బ్యానర్‌లో రోషన్ తో ఒక ప్రాజెక్ట్ చేయనున్నారు. ఇది రోషన్ కెరీర్‌లో ఒక మైలురాయి కానుంది. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ గారి నుంచి వచ్చిన ఈ అవకాశం రోషన్ టాలెంట్‌కు గొప్ప గుర్తింపుగా నిలుస్తోంది. ఇప్పటికే ఇండస్ట్రీలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ హీరోగా గుర్తింపు తెచ్చుకుంటున్న రోషన్, నాగ వంశీ గారి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో కూడా ఓ సినిమా చేయనున్నారు.

## 'రాజా సాబ్' బ్లాక్‌బస్టర్ కావాలి



ప్రీ - రిలీజ్ ఈవెంట్ లో రెబల్ స్టార్ ప్రభాస్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్". ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్ లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో "రాజా సాబ్" ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..

రెబల్ స్టార్ ప్రభాస్ మాట్లాడుతూ .. నా ఫ్యాన్స్ అందరికీ హాయ్, ఈ మధ్యే జపాన్ ఫ్యాన్స్ ను కలిసినప్పుడు ఇలాగే హ్యాపీగా ఫీలయ్యా. మీ అందరి కోసం కొత్త హెయిర్ స్టైల్ లో వచ్చా. అనిల్ తడానీ నా బ్రదర్ లాంటి వారు. ఆయన నా సినిమాలకు నార్త్ లో సపోర్ట్ చేస్తుంటారు. సంజయ్ దత్ గారు క్లోజ్ షాట్ పెడితే సీన్ మొత్తం తినేస్తారు, ఇది నానమ్మ, మనవడి కథ. జరీనా వాహబ్ గారు నాకు నానమ్మ క్యారెక్టర్ లో నటించారు. డబ్బింగ్ చెబుతుంటే నా సీన్స్ మర్చిపోయి నానమ్మ సీన్స్ చూస్తూ ఉండిపోయా. ఆమె నటనకు ఫ్యాన్ ను అయ్యాను. నాతో పాటు జరీనా గారు కూడా రాజా సాబ్ లో హీరోనే. రిద్ధి, మాళవిక, నిధి ముగ్గురూ బ్యూటిఫుల్ హీరోయిన్స్. ఈ ముగ్గురు తమ పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంటారు. ఒక రోజు వేదిక మీద నా స్పీచ్ ఇస్తా, షాకై పోతారు. ఈ సినిమాకు అనుకున్న బడ్జెట్ పెరిగింది. అయినా ఎంతో ధైర్యంగా విశ్వప్రసాద్ గారు సినిమా నిర్మించారు. రాజా సాబ్ కు హీరో విశ్వప్రసాద్ గారే. ఈ రేంజ్ హారర్ ఫాంటసీ సినిమాకు తమన్ మాత్రమే మ్యూజిక్ చేయగలడు అనిపించింది. తమన్ చేతుల్లో మా సినిమాను పెట్టాం. మా డీవోపీ కార్తీక్ గారు ఎంతో స్పీడ్ గా క్వాలిటీగా మూవీ చేశారు. మీ వల్లే మా సినిమా క్వాలిటీ ఇంత బాగా వచ్చింది. సొలమన్, రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ ఫైట్స్ ఇరగదీశారు.

## రసవత్తరంగా ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలు





తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన మోహన్ వడ్లపట్ల









**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్ సినీ వర్గాల్లో ఉత్కంఠ రేపిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చిత్ర పరిశ్రమలోని వివిధ వర్గాల ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఫిల్మ్ నగర్ సందడిగా మారింది. ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటును వేశారు. మన ప్యానల్ పేరిట చిన్న నిర్మాతలు, ప్రొగ్రెసివ్ ప్యానల్ పేరుతో పెద్ద నిర్మాతలు పోటీ పడ్డారు. చాలా విరామం తర్వాత ఈ ఎలక్షన్లు జరుగుతున్న క్రమంలో టాలీవుడ్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన ఫిలిం ఛాంబర్ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ , స్టూడియో సెక్టార్ సభ్యులు అంతా స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయంలో ఇరు ప్యానెళ్ల సభ్యుల మధ్య కొంత వాగ్వాదం నెలకొంది. అయితే.. ఈ క్రమంలో ఇరు ప్యానెల్స్ సభ్యులు యలమంచి రవి చంద్, అశోక్ కుమార్‌ల నడుమ కొంత వాగ్వాదం సైతం చోటు చేసుకుంది. ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి అశోక్ కుమార్ గుర్తింపు లేని, చనిపోయిన ప్రొడ్యూసర్ల ఓట్లను మన ప్యానెల్ వారు వినియోగించు కుంటున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంగా ఓటు రాజకీయాలు కాదు సినిమాలు తీస్తే తెలుస్తుందంటూ అశోక్ కుమార్ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలో దిల్ రాజు వారిని సముదాయించారు. ఈసారి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల బరిలో రెండు ప్రధాన ప్యానళ్ల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. పరిశ్రమలోని అగ్ర నిర్మాతలంతా ఏకమై 'ప్రోగ్రెసివ్ ప్యానల్' తరపున అదృష్టాన్ని పరీక్షించుకోగా.. చిన్న నిర్మాతల గళాన్ని వినిపిస్తూ వారి సమస్యలే ప్రధాన ఎజెండాగా 'మన ప్యానల్' పోటీకి దిగింది. పెద్ద నిర్మాతల ఆధిపత్యం ఒకవైపు, చిన్న సినిమాల మనుగడ కోసం పోరాడుతున్న నిర్మాతలు మరోవైపు నిలవడంతో ఈ ఎన్నికల ఫలితాలు ఇండస్ట్రీలో ఎవరి బలాన్ని చాటుతాయోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

- 44 స్థానాల్లో ప్రోగ్రెసివ్ ప్యానల్ 28, మన ప్యానల్ 15 మంది విజయం
- ప్రొడ్యూసర్స్ సెక్టార్ మన ప్యానల్ నుంచి ఏడుగురు గెలుపు
- ప్రొడ్యూసర్స్ సెక్టార్ ప్రోగ్రెసివ్ ప్యానల్ నుంచి ఐదుగురు విజయం
- ఎగ్జిబిటర్స్ సెక్టార్ ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 14 మంది గెలుపు
- ఎగ్జిబిటర్స్ సెక్టార్ మన ప్యానెల్ నుంచి ఇద్దరు విజయం
- స్టూడియో సెక్టార్‌లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి ఒకరు విజయం
- స్టూడియో సెక్టార్‌లో మన ప్యానెల్ నుంచి ముగ్గురు గెలుపు
- డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 8 మంది విజయం
- డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ మన ప్యానెల్ నుంచి ముగ్గురు గెలుపు

## '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'లో ప్రియాంక మోహన్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

వెర్సటైల్ స్టార్ ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తోన్న '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో అప్డేట్స్‌తో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పలువురు స్టార్స్‌తో నిండిన ఈ సినిమాలోకి ఇప్పుడు పాపులర్ హీరోయిన్ ప్రియాంక మోహన్ జాయిన్ అయ్యారు. తాజాగా ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌స్‌ను మేకర్స్ విడుదల చేసింది. రెండు వేర్వేరు పోస్టర్లలో విడుదలైన ఈ ఫస్ట్ లుక్‌లో ప్రియాంక మోహన్ లుక్‌ను గమనిస్తే.. డిజైన్ పరంగానూ, కథకు కనెక్ట్ అయ్యేలా ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ పోస్టర్లలో ఆమె వింటేజ్ లుక్, కళాత్మక శైలిలో చూపించారు. పోస్టర్‌స్‌ను జాగ్రత్తగా గమనిస్తే ఎన్నో చిన్న విషయాలు అర్థమవుతాయి. మొదటి పోస్టర్‌ను చూస్తే..ఆమె వెనుక భాగంలో మెరిసే బంగారు రంగు పౌర్ణమి చంద్రుడితో కనిపిస్తుంది. ఆమె లావెండర్ రంగు బ్లౌజ్, పూల డిజైన్ ఉన్న స్కర్ట్ ధరించింది. ఈ పోస్టర్‌లో వింటేజ్ వాతావరణాన్ని, మోడ్రన్ స్టైలింగ్, రంగులు కలగలిసిన ఫ్రేమ్ ద్వారా చూపించారు. ఇందులో ఆమె ధరించిన ఇయర్‌ఫోన్స్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో ఈ సినిమా టైమ్ ట్రావెల్‌కు సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందుతుందని అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. రెండో పోస్టర్‌ను గమనిస్తే ప్రియాంక మోహన్‌ను రెట్రో స్టైల్‌లో చూపించారు. ఆమె ముత్యాల ఆభరణాలు, పువ్వుల డిజైన్ ఉన్న డ్రెస్సు, గ్లవ్స్, పెద్ద అంచులు ఉన్న టోపీ ధరించిన లుక్‌లో కనిపిస్తుంది. ఈ లుక్ చూస్తే క్లాసిక్ టైమ్ నేపథ్యంతో రూపొందిన థ్రిల్లర్ సినిమాకు చక్కగా సరిపోతుంది. ఈ పోస్టర్‌లో చూపించిందే కంటే దాచిందే ఎక్కువగా ఉందనిపిస్తోంది. అందువల్ల ఆమె పాత్రపై మరింత ఆసక్తి ఏర్పడుతుంది. మృదువైన రంగులు, క్లాసిక్ స్టైలింగ్ పాతకాలపు సినిమాల అందాన్ని గుర్తు చేయటమే కాకుండా. ఆ పాత్రతో సినిమా చుట్టూ ఉన్న మిస్టరీ వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ విజువల్స్ చూస్తుంటే అందం, రహస్యం, ఫాంటసీ అన్నీ కలిగలిసిన ఓ వైవిధ్యమైన, ప్రత్యేకమైన కథా ప్రపంచం ఈ సినిమాలో ఉండబోతున్నట్టుగా అనిపిస్తోంది.



Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**